సంపుటము 21
సంచిక 12

భారతి

తారణ, మార్గశీర్షము
1944 డిసెంబరు

వితంత్రి

— శ్రీ ప్రయాగ కోదండరామశాస్త్రి —

తీగెలు లేని వీణియ కదే ఇది! ఇందున నేస్వరమ్ములో
మ్రోగెడినంచు నెంచి, కనుమోడ్చి యొకించుక యాలకించి, ఏ
మో 'గులుగుల్ గులు'క్కనుటయుం దలపోసి, రసజ్ఞలోక ము
ఱ్ఱూగినదా? పురాంధ్రుల పురోగమనమ్ము తిరోగమించెనా?

అణగిపోలేదు త్యాగయ్యగొంతున తూగుటూయేలలూగిన గేయవాణి,
తరిగిపోలేదు క్షేత్రయ్యపదాలలో పారవశ్యముగన్న పచ్చివలపు,
సురిగిపోలేదు కంచరలగోపనప్రాపు గొని మిన్నుముట్టిన తెనుగువెలుగు,
చెరగిపోలేదహో! గురజాడతోడనే మిరుమిట్లు గొల్పు నెత్తురులకెంపు
రాగమేసాగి, వెన్నెలతీగలాగు-సోక కేమౌను? తంత్రులు లేక కాని—
కల దనంతమ్ముగా భౌతికప్రపంచ-మొక్కటే లేని దుచితసంయోజనమ్ము!

అమరావతీపురి నాంధ్రసంస్కృతి విదేశీయులగుండెలు చెక్కినపుడు,
పలనాట తరపి వెన్నెలబాటలో లోకవృత్తాంతమును విరచించినపుడు,
రాతిరథాలు పల్లవరాజకీవితో తమిళభూముల కళల్ దనిపినపుడు,
ఆంధ్రనాయక కటాక్షాంచలమ్మున చట్టుబండలో కళ లుట్టిపడినయపుడు,
ఆపురాశిల్పిచేతిలయాతిశాయి-నర్తనములు నేడు విచిత్రవార్తలేమి?
ఈవిపంచి వితంత్రి కాదేని యిందు-నేవనంతమ్ములో పుల్కరించియుండు.

నవ్యాపసవ్యప్రసారితశరాసారమునకు జీవనదాత తెనుగుకైత,
అల ద్వాదశాబ్దపర్యంతఘోరపరీక్ష కాదర్శమైన దీయాంధ్రవాణి,
వనవాల్చు చెక్కులం దెనరేగిన ప్రతాపమునకు నిప్వాలబాట తెనుగుపాట,
ఉద్యానవనముల కూపిరివోయు రక్తానంతగీతి యీఆంధ్రగీతి,
ఆంధ్రు డంతర్విలోకన మాచరించి-వింత జెంది, బయల్గని చింత జెందు;
ఎంతలో నెంతపాటు! వితంతువైన-దీవిపంచి; రాగాలు పల్కించు నెట్లు?

ఈవీణం బలికింతునా? ఇచట నేనే పూర్వగాంధర్వమో
భావింపం బులకింతునా? కలదుగా భావానుబంధమ్ము, తం
త్రీవాల్లభ్యము కేమి లే! ఇక రస(శ్రీ) నించు రాగాంచిత
ప్రావీణ్యమ్ముకదా? అదేమి కొదువా? రాల్చిందె నే రాగముల్!



శివకవి యథావాక్కుల అన్నమయ్య

❀

= శ్రీ నిడుదవోలు వేంకటరావు =

ప్రాచీనాంధ్రవాఙ్మయమున శివకవులలో నన్నెచోడుఁడు, మల్లికార్జున పండితుఁడు, పాల్కురికి సోమనాథుఁడు నను కవిత్రయముతోఁ జేర్పఁదగిన శివకవి యథావాక్కుల అన్నమయ్య. ఈతని కృతి సర్వేశ్వర శతకము క్రీ. శ. ౧౨౪౨ లో రచిత మగుటచే నుపలబ్ధము లగు ప్రాచీన శివకవుల కృతులలో నిదియు నొకటి యని చెప్పనగును.[1] భాషయందును, భావములయందును, కావ్య వస్తువునందును నీకృతి శివకవి కృతి యనియు, నితఁడు శివకవియే యనియు నిరూపింప నగును. ఈ నిరూపణమున నీతఁడు శివకవి యగుటయేకాక ప్రాచీనాంధ్ర గ్రంథముద్రణపరిష్కరణవిధాన మేతీరున నున్నదియోకూడ తెలియానగును.

గ్రంథరచనాకాలము 'శాకాబ్దంబులు వార్ధిమట్కపురజిత్సంఖ్యం బ్రవర్తించు' శుభకృత్తు వర్షమని కవి పద్యరూపమునఁ దెలిపియుండుటచేతను, నా పద్య మన్నిప్రతులం దుండుటచేతను, ప్రక్షిప్తము కాకపోవుటచేతను నిది ప్రమాణముగఁ గొనవచ్చును. వార్ధి (౪)మట్క (౬)పురజిత్ (౧౧) అనఁగా ౧౧౬౪. ఇవి శాకాబ్దములు; అనఁగా శాలివాహన శకాబ్దములు. దీనికి ౭౮ చేర్చిన (౧౧౬౪ + ౭౮) క్రీ. శ. ౧౨౪౨ గా నేర్పడుచున్నది. కావున నితఁ డా కాలమున నున్నవాఁ డనుట సునిశ్చితమే.

అన్నమయ్య వంశముకూడ అవిచ్ఛిన్నమై వెలయుచున్న దనుటకు పల్నాటిసీమయందు నేఁటికి నీ వంశీయులు సోమరాజువా రను నింటిపేరుతో నుండుటయే ప్రమాణము. ఆ వంశవృక్ష మిది:

యథావాక్కుల అన్నమయ్య (క్రీ. శ. ౧౨౪౨)
|
వీరమరాజు
|
నాగరాజు
|
చిట్టెమరాజు (క్రీ. శ. ౧౪౨౨)
|
గోపరాజు
|
సోమరాజు.

పైవారిలో చిట్టెమరాజు సాగరాబ్ధియుపావకచంద్రసంఖ్య(౪౪౩౧)=౧౩౪౪ శా. శ.=క్రీ. శ. ౧౪౨౨ లో పల్నాటి సీమలో నాలుగ్రామముల కరణీకమును సంపాదించెను. సోమరాజు తరువాత చాల ప్రసిద్ధుఁ డగుటచే నాతనినుండి యీ వంశమువారు సోమరాజువారైరి. నేఁడు సోమరాజు వేంకటశివుఁడుగారి వంశజులే. (సర్వేశ్వర శతకము, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికటితము, పీఠిక 3 పుట.)

క్రీ. శ. ౧౫౯౦-౧౬౨౦ ప్రాంతమున నుండిన పింగళి ఎల్లనకవి తన తోభ్యచరిత్రమున నన్నమయ్య నిట్లు స్తుతించినాఁడు :

"భక్తిమై రేణుకప్రముఖోత్తము నుతించి
మాయిదేవాహ్వాయు మహిమఁ బొగడి

---

1. బసవపురాణ పీఠిక (౧౯౨౬) ౭౨ పుట లో 'శివకవుల గ్రంథములు' అను శీర్షికలో నిట్లు కలదు: "మల్లికార్జున పండితారాధ్యుని శివతత్త్వసారమును, నన్నిచోడని కుమారసంభవమును, మన సోమనాథుని కృతులును నిప్పుడు మన కుపలబ్ధములైన శివకవుల గ్రంథములలోఁ బ్రాచీనములు." పై గ్రంథముల పట్టికలో సర్వేశ్వర శతకముఁగూడ చేర్పఁదగినది. కృతి ప్రాచీనమే కాక యిప్పటికి నాలుగు ముద్రణములంది వ్యాప్తిలో నున్నది. సర్వేశ్వర శతకమును శతకమనుటకంటె స్తోత్రమనుటయే లెస్స. ఈ విషయము ముందు వివరింతును. అన్నమయ్య కృత్యంతరము లీలానందసర్వేశ్వరశతకము శతక మననొప్పను.

చెలఁగి యథావాక్యముల నన్నమయగారి
భజియించి మ్రొక్కెడి పాలకురికి
సోమన్నగారిఁ బ్రస్తుతిఁజేసి..."

కావున అన్నమయ్య యాంధ్రవాఙ్మయమున కపరిచితుఁడు కాఁడు.

అన్నమయ్య సర్వేశ్వరశతకము బహుప్రాచీనమైన దగుటచే నిప్పుడు మనకు లభ్యమగుచున్న గ్రంథములో నింకను కొన్ని పద్యము లుండఁదగునేమో యని తోఁచుచున్నది. ఇది శతకమని పేర్కొనఁబడినను నిందు మకుటనియమమేకాని సంఖ్యానియమము లేదు. దీనిని స్తోత్రమని కవి పేర్కొనినాఁడు. నేఁటి ముద్రితప్రతులలోనే పద్యసంఖ్య వ్యత్యస్తమై యున్నది. ప్రస్తుత ముపలబ్ధములగు ముద్రితప్రతు లివి:

౧. శ్రీ శైవసిద్ధాంతముద్రాక్షరశాల,
మదరాసు ౧౯౨౪
౨. శ్రీ రామలింగేశ్వర శివధర్మవర్ధనీ
ముద్రాక్షరశాల, ఒరంగలు. ౧౯౧౦
౩. ఆంధ్రసాహిత్య పరిషత్, మదరాసు ౧౯౧౯
౪. భక్తిరసశతక సంపుటము, వావిళ్ల వారు ౧౯౨౬
౫. ఆంధ్ర గ్రంథమాల శతకమంజరి. ౧౯౨౬.

వీని యన్నింటిలో నాంధ్రగ్రంథమాల ముద్రణము ప్రశస్తమనుటలో సందియము లేదు.

ఈ సర్వేశ్వరశతకపు వ్రాఁతప్రతులు నాలుగు ప్రాచ్యలిఖిత పుస్తకభాండారమునఁ గలవు. అందు ౧౨౩,౧౨౦,౧౨౩,౧౩౩ పద్యములు గలవు. పైముద్రితములలో పరిషత్ప్రతిలో ౧౩౭, తక్కినవానిలో ౧౪౨ పద్యములు కలవు. పరిషన్ముద్రణమున రెండు వ్రాఁతప్రతులను, పూర్వముద్రణప్రతి (ఒరంగలు)ని నాధారము చేసికొని ముద్రింపఁబడిన ట్లాపీఠికవలనఁ దెలియుచున్నది. కావున పద్యసంఖ్యలో వ్యత్యాసమున్నదనుట నిశ్చితమే. పెక్కు ప్రాచీనాంధ్రకృతులవలె నిందును కొన్ని మార్పులు, చేర్పులు జరిగినవి.

పరిషత్ప్రకటిత పీఠికలో నన్నమయ్య వంశీయులగు సోమరాజు వేంకటశివుఁడుగారు వ్రాసిపంపిన వంశావళిపద్యములలో చివర నీక్రిందిపద్యము కలదు:

"అజరుద్రాదులు మిమ్మెఱింగి మతినే
యస్థైరు నే నెంతవా
డ జగద్రక్షణదక్ష నిన్ను కొనియా
డ నీస్వభావంబు దా
సజనానుగ్రహ నిశ్చితం బగుట నా
జన్మంబు సాఫల్యమం
ద జడుం డంచు నిరాకరింపకఁ బ్రస
న్నుండౌట సర్వేశ్వరా!"

ఈపద్యము కనుపర్తి యబ్బయామాత్యరచితమైన కవిరాజమనోరంజనము చతుర్థాశ్వాసాంతమున నాశ్వాసాంతపద్యములకు ముందు కథాభాగమున కలదు. (చింతామణీ ముద్రాక్షరశాలలో రాజమహేంద్రవరమున ౧౯౧౩లో ముద్రితమైన ప్రతి. పుట ౧౦౬) ఈపద్యము సర్వేశ్వరశతకములోనిదే యగును. కవిరాజమనోరంజనమున నీపద్యమున కంతగఁ బ్రసక్తి లేదు.

"కరధణక్కారవవాద్య మింపొదవ గం
గాతుంగరంగత్తరం
గరవప్రస్ఫుటతాళసమ్మిళితత
త్కంజాతపుంజస్ఫుర
ద్వరపుష్పంధయమందరధ్వనులు గీ
తంబొప్ప తౌర్యత్రికం
బిరవై యుండఁగ నీదు తాండవమహం
బేపారు సర్వేశ్వరా!"

ఈపద్యము ప్రబంధరత్నావళి (౧౧౨పుట)లోఁ గలదు. అం దీపద్యము మమ్మయ జైతరాజు (విష్ణుకథానిధానములోని)దిగా నుదాహృతమైనది. కాని యీపద్య మందు ప్రసక్తమైనట్లు తోఁపదు. ఆకృతిలోనివిగా ౩౬౫ నుండి ౪౦౬ వఱకు పద్యము లున్నవి. అవి యన్నియు విష్ణుకథానిధానములోనివే యని చెప్పఁదగదు. తక్కిన గ్రంథములనుండి పద్యము లందున్నవి. వివరణ కిది చోటుకాదు. అయిన రెండుదాహరణములు. (౧)౩౮౧—'ఆడెడ దాండవ మార్భటిగా' అను పద్యము భీమఖండము (౪-౧౪౭) లోనిది. (౨) ౩౮౬—'ఊకరల నొట్టక యుబ్బసంబందక' ఈ సీసము 'ఊరక మురియక యుబ్బసంబందక' అను మొదలుగా (తక్కిన చరణములు, నెత్తుగీతియు సమ

నమే) సకలనీతిసమ్మతములో పురుషార్థసారములోని పద్యముగా నుదాహరింపఁబడియున్నది (సకలనీతి సమ్మతము, ౩౫ పుట, ౩౦౪ పద్యము). ఇట్లే 'వెను కకుఁబోక యీయనకా' యను ౩౯౯-వ పద్యము పై నుదాహరించిన పురుషార్థసారములోనే యుదాహృత ము. కావున పైపద్యమును సర్వేశ్వరశతకములోనిదే యైయుండు నని నాతలంపు. ఇట్టిదియే తాండవనృత్య మును వర్ణించు పద్యము సర్వేశ్వరశతకమున కలదు.

"జగతీచక్రము పాదఘట్టన వద్య
శ్యంబై ప్రవర్తింపఁగా
గగనం బంతయు బాహుమండలసమ
గ్రవ్యాప్తులం దద్భుతం
బుగ ఘూర్ణిల్ల నజాండ్యవేళల సము
ద్భూతాంగహారావళుల్
నెగడం బొంగి నటింతు తాండవమహా
నృత్యంబు సర్వేశ్వరా!"

ప్రాచీనకృతులలోని పద్యము లిట్లు విడిగా సంధానగ్రంథములలోను, చాటుపద్యము లనుపేరఁ గూర్చిన సంకలనములలోను గానవచ్చుచునేయుండు ను. నన్నిచోడని కుమారసంభవము, ఆంధ్రభోజుని నీతిభూషణము (ఇది యిపు డలభ్యము)లోని పద్యము లిట్లే చాటుపద్యమణిమంజరిలో నుదాహృతములుగా నాగ్రంథముఁ జూచిన తెలియనగును.

మఱియు—

"జయశక్తి ప్రవిచంద్రతారకముగాఁ
జల్పెక్ యథావాక్కులా
న్వయసంజాతుఁడు నన్నమార్యుఁ డవని
న్వర్ణించి నీ సత్కథా
క్రియసంబోధన నీదు భక్తిని మహా
నిర్ణీతవిశ్రాంతిగా
భయవిభ్రాంతులు లేక యీశతకముం
బ్రఖ్యాతి సర్వేశ్వరా!"

కవి తన కృతిరచనాకాలమును, తన గురువును, తన పేరును ప్రత్యేకపద్యములలోఁ జేర్కొని తిరిగి యిట్లు వ్రాయ నావశ్యకత లేదు. మఱియు నిందు మూఁడవపాదమున యతిభంగము. ఈ పద్యము ప్రథమ ముద్రణప్రతియందు లేదు. ప్రాతవ్రాఁతలలోఁ గొన్నిం ట లేదు. ఈ పద్యము నడక యన్నమయ్యయితర పద్యములతోఁ జూచిన నాతనిది కా దనిపించును. దీనిని తరువాతివారు చేర్చియుందురు. ఇట్లే ౧౩౨ పద్యమును చేర్చిన ట్లగుపడుచున్నది (ఆంధ్రగ్రంథ మాలముద్రణము, ౨౫ పుట).

సర్వేశ్వర శతకము భాషయందును, భావము లందును, కవితావస్తువునందును శివకవుల కృతులనే యనుసరించినది.

భాష: — శివకవులు ప్రత్యేకముగ నుప యోగించిన పదముల నీకవి యుపయోగించినాఁడు. అవి నేఁటి ముద్రణములలో మాఱినవి. ఈ క్రింది పదము లట్టివి.

౧. సమూహి—

'సమూహము' అను రూపమును 'సమూహి'గా శివకవులు వాడిరి. ఆ ప్రయోగము లిందు చూపెదను.

నన్నిచోడ మహాకవి[1] కుమారసంభవమునందలివి: సురసమూహిసదస్యులు (౨-౨౨౫) వసుసమూహి (౭-౯౧)శారద నీరద సమూహి చాడ్పున(౧౦-౩౭౫) నీతచ్ఛద సమూహి (౧౦-౩౭౬.)

కేతన: బకసమూహి (౧౧-౭౦).

పాల్కురికి సోమనాథుఁడు[2] బసవపురాణము నందు భక్తసమూహి (పుటలు ౫౨, ౧౧౪, ౧౨౯); చతుర్వేదసారమున[3] ప్రమథగణ సమూహి, రుద్రగణ సమూహి, భక్తగణ సమూహి, వ్రతగణసమూహి యని యు నీ శబ్దమును వాడియున్నాఁడు.

అన్నమయ్య సర్వేశ్వర శతకమున[4] 'సురల నక్షత్ర సమూహిగా మనుజులన్ శోభిల్ల బృందార

1. కుమారసంభవము - ప్రథమ భాగము, ముద్ర ణము ౧౯౦౯. ద్వితీయ భాగము ౧౯౧౪.

2. బసవపురాణము - ఆంధ్ర గ్రంథమాల, ౧౯౨౬.

3. చతుర్వేదసారము - భైరవ ముద్రాక్షరశాల, బందరు. ౧౯౧౪.

4. సర్వేశ్వర శతకము - ఆంధ్ర గ్రంథమాల శతకమంజరి, ౧౯౨౫.

శోత్కరముంగా...' అని యీ పదమును ప్రయోగించి యున్నాఁడు (౧౨ పద్యము).

సర్వేశ్వర శతకపు ముద్రితప్రతులలో[1] పెక్కింట నీ 'సమూహి' కి బదులుగా 'సమంబుగా' అని కలదు. శతకమంజరియం దిట్టి పాఠమే కలదు. పుట యడుగున వ్రాఁతప్రతి పాఠము 'సమూహి' యని చూపఁబడినది. కాని పై ప్రయోగముల ననుసరించి శివకవి యగు యథావాక్కుల యన్నమయ్య 'సమూహి' యనియే యుపయోగించె నని గ్రహింపనగును. మఱియును 'సురల న్మర్త్యసమంబుగా' నని యనుటకంటె 'సమూహి' యనుటయే లెస్స. ఇచట దేవతలను మర్త్యసమూహముగను, మర్త్యులను బృందారకోత్కరము (దేవతా సమూహము) గాను నని ఉత్కరశబ్దమే తెలుపుచున్నది. పద్యమిది:

" సురల న్మర్త్యసమూహిగా మనుజులన్
శోభిల్ల బృందారకో
త్కరముంగా, ఘను నల్పు, నల్పుని ఘనం
గాఁ బుణ్యపాపాలిచేఁ
దిరుగన్ సేయుచు నీ మహామహిమ శ్రీ
తిం బద్మజాండంబునం
దరయన్ జీవుల నింద్రజాలములుగా
నాడింతు సర్వేశ్వరా."

కావున 'సమూహి' యనునది సరియగు పాఠము.

ప్రాచీన పద్యమయ శాసనములలో నొకచోట నీపదము కానవచ్చుచున్నది.

"శ్రీమంతులైన యుద్దామభుజోద్దర్వ
లన్వయవార్ధిసీహారకరులు
రమణీయ మగుచున్న రాంకిపురాధీశు
లుగ్రనిగ్రహులు భూపాగ్రగణ్యు
లంగజాకారు లుత్తుంగగభీరులు
మిత్రపంకజశీతపత్రహితులు
గొండపశ్చిమము భూమండలాధీశులు
పాదసరోజమట్పద(స)మూహి(సమూహి)"

(Journal of Andhra History and Culture Vol. 1-No. 2. Page 67. Some unpublished Inscriptions No. 4. of Nadumpadu Pillar Inscriptions.)

౨. విసర్వించు—

సర్వేశ్వరశతకమున ముద్రిత మూలపాఠములలో 'విసర్వించు' నకు బదులుగా 'విజృంభించి' అను పాఠ మీయఁబడి 'విసర్వించి' అని పాఠాంతరముగా నీక్రింది పద్యమున నీయఁబడినది. శివకవిప్రయోగసరళిచే నిదియే సరియగు పాఠము. శాసనములఁగూడ నీపదము ప్రయుక్తము.

" సుమహార్వద్మథవాండ పంక్తుల లయ
క్షోభప్రతాపంబుతో
నిమిషార్ధంబునఁ గాఁచి పెంపెసగు నీ
నేత్రానలజ్యోతి య
య్యమ మీనాంక పురందర త్రిపురదై
త్యాళిన్ విజృంభించి భ
స్మముగాఁ జేయుట నిశ్చయింప నిది దా
శ్చర్యంబె సర్వేశ్వరా !"

ఈ పదమునకుఁ బ్రయోగములు :- నన్నిచోడని కుమారసంభవమున వచనము: గణముఖ్యులు తలతలమని వెడలి విసర్వించి (౨-౧౯౯), పటుదోర్బల గర్వ విసర్వణంబులన్ (౧౦-౭౨౭). పద్యమయ మగు నాదిండ్ల శాసనములో[2] (క్రీ.శ.౧౧౩౯) "గోరి శశాంక మాళికి విసర్వనతోఁగుడి నిల్పె భక్తువన్." అని విసర్వణ ప్రయోగము కలదు. బసవపురాణము (పుట ౭౫) కన్నప్ప కథలో 'సర్వాంగసుందర శంకర యీవిసా (?) ర్వణం బెటు దొరకొనెనయ్య నీకు'. భారతము ఆదిపర్వమున (౬-౨౬౮) "నీ పర్వత వివరం బెత్తి విసర్వింపుము చూత మనిన గోత్రభిదుండున్-" అనియు, ద్విపదభారతము[3] సభాపర్వములో ప్రథమాశ్వాసమున "కుటిలసద్భ్రుకుటీ విసర్వణ ఘటిత - నిటలుఁడై పటుకార్య నిర్భరత్వమున" అనియు నీ పదమునకు సమాపక క్రియకు, నసమాపక క్రియ

1. వావిళ్ల వారు ముద్రించిన ప్రతిలో 'సమూహి' యని పాఠమే మూలమునఁ గలదు.

2. శాసన పద్యమంజరి ౧౯ పుట

3. ఆంధ్రవిశ్వవిద్యాలయప్రకటితము, ౫౭౧పు.

కును సమాసగతమై యుండుటకుఁ బ్రయోగములు చూపఁబడినవి.

౩. సురంగము—

ఈ పదమును 'మనోహరము, ఒప్పిదము' అను నర్థములలో శివకవులే కాక వారిననుసరించిన భవికవులును వాడిరి. తొలుత నాయా ప్రయోగములఁ జూపి యావెనుక పదముఁగూర్చి తెలిపెదను.

నన్నిచోడకవికుమారసంభవమునఁ బ్రయోగములు:-

చ. ఒండొకభంగి సురంగమయ్యెఁ జాపులు (౩-౩౧౯)

వ. అపాంగావలోకనంబులు సురంగంబైపాలయు (౫-౫౯౯)

గీ. చిత్రవర్ణాతిశయరత్నచిత్రితాంగ
రంగవల్లీబహుసురంగాంగణముల (౬-౯౭౪)

("చిత్రవర్ణాతిశయ మాత్నరత్నచిత్రితాంగవల్లీ సురంగాంగణముల" అని వ్రాఁతప్రతి[1])

వ. పసిండియాయగమున మఱియు సురంగంబుగాఁ దొంగలిపట్టియుం గట్టి చెన్నమిగులం గైసేసిన (౯-౨౨౮)

వ. ఆస్థానంబు సురంగంబుగా (౯-౨౩౬)

గీ. కామసుఖములతోఁ బూర్వకామకేళి
కామచిహ్నాలు మెయిసురంగంబుఁగాగ (౯-౨౮౬)
సురంగంబగు సంగరరంగంబు (౧౧-౭౬౮)

ఈ పైప్రయోగములలో మూఁడవదానియం దిది సమాసగతమై యున్నది.

పాల్కురికి సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున[2]:—

ద్వి. ఈతురగంగాతరంగోత్తమాంగ
విమలకీర్తిసురంగ! వేదాంతశృంగ! [3]
ప్రమథాంతరంగ! యభంగ! యోలింగ!

(పుట ౨౧౯)

అని యీ పదము ప్రయోగించెను. ఇదియు సమాసగతమే.

యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వరశతకమున—మ. కడుచిత్రంబుగఁ జేయఁగా వెలి సురంగం బయ్యె నేఖడ్గమందిడకున్నన్ (౭౦ పద్యము) అని ప్రయోగము కలదు.

ఇవి శివకవిప్రయోగములు. ఇఁక తిక్కన ప్రయోగములు:

తిక్కన సోమయాజి నిర్వచనోత్తరరామాయణములో:—

చ. రవియుదయంబుకంటె ముని
రాజశిఖామణి మేలుకాంచి తా
నవకులమర్ధ వాంక ముని
వాదములైన సురంగగీతముల్
వివిధగతిప్రవర్తన న
వీనములై సొగయింప...(౬-౧౩౯)

పోతన భాగవత దశమస్కంధోత్తరభాగమున (౩౦౪ పద్యము):—

ఉ..................చని కాంచి రంత నా
రంగలవంగలుంగవిచరన్మదభృంగసురంగనాదసం
సంగతరంగిణీకలితసంతతనిర్మలవాలుకస్థలిన్.

జక్కన విక్రమార్కచరిత్రమున:—

ఉ. ముందటఁ గాంచె నాకుభవ
ముజ్జ్వలమూర్తిపురందరుండు ని
వ్యందకృపాతరంగముఁ బి
శంగకపర్దసురంగము న్వని

ఈ విసుర్వణముఁగూర్చి 'విసుర్వణము' అను వ్యాసము విజయనగర కళాశాలా పత్రిక ౩-వ సంపుటమునఁ జూడనగును. మఱియు సారస్వత సర్వస్వము (రక్తాక్షి భాద్రపదము) ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక ౯-సం., బసవపురాణ పీఠిక ౧౧౬ పుట చూడనగును. వీనియం దీ పదముం గూర్చిన సంపూర్ణ చర్చ కలదు.

1. మదరాసు విశ్వవిద్యాలయ పుస్తకభాండార ప్రతి.

2. ఆంధ్రగ్రంథమాలాప్రచురణము, మహిమ ప్రకరణము.

3. 'వేదతురంగ' యని పాఠము.

మ్యందిరభక్తలోకహృద
పాంగము సుందరరత్నకందరా
మందిరమల్లికార్జునప
మాహ్వయ జృంభితసిద్ధలింగముస్.
(౨-౨౦౦)

పైపదమును సమాసమున వాడియుండుటచే నిది సంస్కృతపద మని యెన్నవగును. కన్నడమున సురంగ, సురంగిత, సురంగిసు అను రూపము లున్నట్లు కన్నడనిఘంటువున కలదు.

సురంగ- **A good colour, bright colour, brilliance Bp 437; 2. Great love. Fine stage or arena.** సురంగిత- **Well coloured or tinted bright.** సురంగిసు-**to shine.**

(Kittel's Canarese Dictionary Page 1574)

పై నిఘంటువున కన్నడదేశ్యమున నీపదము భిన్నముగాఁ బరిగణింపఁబడుటచే నిది సంస్కృతపద మని చెప్పనొప్పను. సంస్కృతాంధ్రనిఘంటువుల నీ శబ్ద మీయర్థమునఁ గానరాకున్నది. పైయర్థములలో సురంగము అనఁగా మంచిరంగము (**Fine stage or arena**) అనునది పొసఁగుటలేదు. కాని తక్కినవి లాక్షణికముగ సరిపోవుచున్నవి.

౪. ఆరోగిణముసేయు-భోజనముసేయు—
"వేడ్కంగోరి యారోగిణం బమరంజేసి"
(సర్వేశ్వరశతకము ప. ౫౩)

ద్వి. చేతిపులగము చెచ్చెర బుచ్చుకొనుచు
ఆరోగిణము చేసి యందఱుచూడు
(బసవపురాణము పుట ౫)

౫. బహురూపమాడు = వేషములు వేయు, నాటకములాడు—

మ. అమరంగా స్ఫుటభక్తినాటకము భా
షాంగక్రియాంగాభిర
మ్యముగాఁ జూపిన మెచ్చి నీవిలబకే
యన్నంతకున్ యోనిగే
హములన్ రూపులు వన్నెకొంచును నటుం
డై వచ్చి సంసారరం
గములోనం బహురూపమాడు వెలయం
గా జీవి సర్వేశ్వరా!
(సర్వేశ్వరశతకము ప. ౨౦)

సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున:—
బహురూపమాడుచోఁ బాటి వెండిఁడు
సహజంబుఁ జూపకే జాడవచ్చినను
నరయనేరంగమధ్యంబున నున్న
తరుణి యెఱుంగదే తన మగడనుట
(దీక్షా ప్రకరణము ౧౪౪ పుట)

బసవపురాణమున:—
శైవంబనఁగ లేదు తాబహురూపు (పుట ౨౦)

మఱియు భవి, లింగారాధన, జంగమార్చన మున్నగు పదప్రయోగములు శివకవులకుఁ బ్రత్యేకములు గాని భవికవులకుఁ గాదు.

కర్మధారయమున మహచ్ఛబ్దము—
సుమహాత్పద్మభవాండసంతతులు(సర్వేశ్వర. ౧౬)
భక్తమహదాజ్ఞాసంబు (ప. ౧౧౦)
సోమనాథుఁడు బసవపురాణమున:—
ఇది సుమహాత్తత్త్వము (పుట ౧౨)
ప్రోద్గతసూత్రమహద్గురుపుత్ర (౨౨౫)
ప్రమథమండలిలో భవన్మహదాజ్ఞఁజేసి (పండితారాధ్యచరిత్రము, పర్వతప్రకరణము, (౫౪౪ పుట)

నన్నెచోడని కుమారసంభవమున నిట్టిరూపములు గలవు. "సుమహాత్కాశాసనాఘంబు" (౬ ఆ)

దుష్టునణఁపంగా-శిష్టురక్షింప (సర్వేశ్వర. ౧౩)
దుష్టశిక్షింప-శిష్టరక్షింప(పండితారాధ్యచరిత్ర, దీక్షా ప్ర. ౨౫౧ పుట)

మది మత్సాహించి (స. శ. ౨౬)
కార్యతిశయతకుత్సాహించి (పండిత. వాద. ౫౧౭ పుట)

ఇక భావములు చూచిన నీవిషయ మింకను స్పష్టము.

ఆంధ్రకవుల అవతారికలు

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

ఆంధ్రకవుల గ్రంథములలో అవతారికారచన మొక విశేషలక్షణముగా గనబడుచున్నది. మంగళశ్లోకము,లేదా పద్యము, దేవతాస్తుతి, పూర్వకవిస్తుతి, కవితాలక్షణము, కుకవినింద, సుకవిప్రశంస, కృతిపతిప్రశంస, షష్ఠ్యంతములు మొదలగునవి ఆయాకవుల కవితాలక్షణోద్దేశాదులను, దేశకాలపరిస్థితులను, చారిత్రకాంశములనుగూడ కొంతవరకు దెలుపగలవిశేషములతో గూడినవై యుండుట సామాన్యముగా గానవగును. సుప్రసిద్ధములగు ప్రాచీన సంస్కృత కవుల కావ్యములలో నిట్టివి విశేషముగా గనబడకపోవుటనుబట్టియే యాంధ్రకవుల రచనలలో వీనిని విశేషలక్షణములుగా గ్రహింపవలసివచ్చుచున్నది. ఆదికవియగు వాల్మీకిగాని, ప్రాచీనకవులగు కాళిదాసాదులుగాని యట్టి గ్రంథావతారికలను రచించిన ట్లగపడదు. ఆదికావ్యమగు రామాయణము

"తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరం
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవం"

అను వస్తునిర్దేశపూర్వకమగు శ్లోకముతోడనే ప్రారంభింపబడిన ట్లగపడుచున్నది. కాని యిది వాస్తవముగా వాల్మీకి రచించిన ప్రారంభశ్లోకమేనా, లేక తరువాతివా రెవరైన చేర్చిన యవతారికాభాగశ్లోకమా యను సందేహమునకు తావు లేకపోలేదు. ఏలయనగా నిది గ్రంథరచనాప్రారంభమునకు బూర్వము జరిగిన విషయమునుగూర్చి - అనగా వాల్మీకికి నారదుడు రామాయణసంక్షేపకథను దెలుపుటనుగూర్చి - చెప్పుచున్నది. వాల్మీకి నారదుని నడిగినట్లు ప్రథమపురుషలో రచింపబడియున్నది. తెనుగున భారతమును రచించిన నన్నయభట్టు "తెనుంగునన్ మహాభారతసంహితారచనబంధురుడయ్యె"నని ప్రథమపురుషలో జెప్పుకొనలేదా యనియు,అతడు దీనిని చూచియే యట్లు చేసెనేమో యనియు దలంపవచ్చును. కాని మొదటి యీనాలుగుసర్గలలో జెప్పబడిన వృత్తాంతమంతయు రామాయణరచనాప్రారంభమునకు బూర్వము వాల్మీకిజీవితమున జరిగిన విషయములనుగూర్చి చెప్పుచున్నది. నారదనిర్గమనానంతరము వాల్మీకి తమసాతీరమునకు బోవుట, క్రౌంచదర్శనము,భర్తతై యేడ్చుచున్న క్రౌంచపక్షిని జూచి 'మా నిషాద' శ్లోకరచనము, బ్రహ్మ ప్రత్యక్షమై శోకము 'శ్లోకబద్ధ'మైనదని చెప్పి రామచరితమును చెప్పుమని హెచ్చరించుట, అతని ప్రభావముచే రామాయణకథ నంతను ఆగతానాగతములను యోగశక్తివలన ప్రత్యక్షముగ దర్శించుట, చతుర్వింశతిసహస్రశ్లోకములు, ౫౦౦ సర్గలు, ౬ కాండలు గల గ్రంథమును 'సభవిష్యం సహోత్తరం'గా రచియించుట, వేదోపబృంహణార్థమై దీనిని కుశీలవులచే గ్రహింపజేసి రాముని యెదుట తంత్రీలయసమన్వితముగా పాడించుట మొదలగు విషయములతో గూడిన తొలి నాలుగుసర్గలును రామాయణకథావతారికగా తరువాతి కాలమున రచింపబడినవై యుండవచ్చును. అట్లే యైనచో తొలుత వ్యాసులు వ్రాసిన 'జయ' మనుమూలభారత గ్రంథము తరువాతి చేర్పుకూర్పులతో మహాభారతమైనట్లే రామాయణమునకుగూడ నీయవతారిక తరువాతికాలమున జేరిన దనవలసియుండును. మొదటి ౪ సర్గలలోను కవిని గూర్చి చెప్పబడిన విశేషణములు—"ఏవ ముక్తో భరద్వాజో వాల్మీకేన మహాత్మనా": "దదర్శ భగవాం స్తత్ర క్రౌంచయో శ్చారునిస్వనం": "స మునిపుంగవః": "వాల్మీకయే మహర్షయే సందిదే శాసనం తతః:" "అనాగతంచ యత్కించి ద్రామస్య వసుధాతలే, తచ్చకారోత్తరే కావ్యే వాల్మీకి ర్భగవాన్ ఋషిః": "తస్య చింతయమానస్య మహర్షేః భావితాత్మనః" ఇత్యాదులు — వాల్మీకి స్వయముగా రచించినవేనా యను విషయమున సందేహము కలిగించక మానవు. ౫-వ సర్గలో "ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనాం, మహదుత్పన్న మాఖ్యాతం రామాయణ మితిశ్రుతం .... కోసలోనామ ముదితః స్ఫీతో జనపదో మహాన్, అయోధ్యానామనగరీ తత్రాసీ ల్లోకవిశ్రుతా" అను శ్లోకములతో రామాయణకథాప్రారంభము జరిగినది. ఇక్కడనుండియే వాల్మీకిరచన ప్రారంభమగు నవదగునేమో. ఎట్లయినను ఆదికావ్యమగుటచే తనేమో, మంగళశ్లోకాదికముకూడ లేకయే వస్తునిర్దేశపూర్వకముగనే యీగ్రంథము ప్రారంభమైన దని చెప్పనొప్పును.

ఇక కాళిదాసు కుమారసంభవ, మేఘసందేశములను వస్తునిర్దేశముతోడనే ప్రారంభించినాడు. రఘువంశమున మాత్రము పార్వతీ పరమేశ్వరులకు మ్రొక్కి "పూర్వసూరి కృతమార్గమున "రఘూణాం అన్వయం వక్ష్యే తనువాగ్విభ వోపి సన్" అని తన వినయమును దెలుపుకొన్నాడు. భారవి, మాఘకవులుగూడ వస్తునిర్దేశముతోడనే తమ గ్రంథములను బ్రారంభించినారు. మంగళాచరణావతారికలులేవు.

ఇట్లు ప్రసిద్ధులగు ప్రాచీనసంస్కృతకావ్యకర్తల గ్రంథములలో-ప్రధానముగా పంచకావ్యము లని ప్రసిద్ధిజెందిన వానిలో నాల్గింట అవతారికా రచనావిశేషములు లేకయుండగా, పెక్కువిషయముల వాని ననుకరింప యత్నించినవా రనదగిన ఆంధ్రకవుల రచనలలో నివి యెట్లు పొడసూపి పెరుగుచువచ్చిన వను విషయ మాంధ్రసాహితీపరులకు పరిశీలింపదగినది కాకపోదు. ఇంతేకాక ప్రాచీనకావ్యములు కేవలపద్యకావ్యములై యుండగా తెలుగుభాషలోని తొలికవిత గద్యపద్యసంమిశ్రితమైన దగుటకూడ మరియొక విశేష మనదగును: నన్నయకు బూర్వ మాంధ్రకవితారచనలు మనకు విశేషముగా గోచరింపకుండుటచేత నాంధ్రమున నాదికవులుగా నెన్నబడుచున్న నన్నయాదుల రచనామార్గము లెట్లేర్పడినవో తెలిసికొనుట కాధారములు కానవచ్చుటలేదు. ఇటీవల బయలుపడిన ప్రాఙ్నన్నయయుగమునందలి శాసనాదులనుబట్టి భాషాపరిణామరీతులు, పద్యరచనా పద్ధతులు, ఛందోవిశేషములు మొదలగువాని విషయమున కొంత విశేషజ్ఞానము లభించుచున్నను, సాహిత్యలక్షణములనుగురించి తెలుపు నాధారము లేమియు బయలువడ లేదు. కావున సన్నిహితభాషాసాహిత్య లక్షణములను బరిశీలించి వానితో బోల్చిచూచుటయే మన మవలంబింప దగిన ముఖ్యమార్గము. సాహితీమార్గముల విషయమున మనకు విశేషముగ దోడ్పడగలయది మన దేశమునకు సమీపమందు గల కన్నడదేశ భాషాసాహిత్యమే.

కన్నడాంధ్రములకు చిరకాలమునుండి విశేషముగా పొత్తు కలదు. ఇవి హిందూదేశమధ్యభాగ మనదగు 'దక్షిణా పథ'భాగము నాశ్రయించిన వగుటచే నింకను దిగువనున్న తమిళభాషకంటె నెక్కువగా నార్యభాషాప్రభావమునకు లోనైనవి. క్రీస్తు శకారంభకాలమున నాంధ్రసామ్రాజ్య మునకు స్థానములై వారి యేలుబడిలో నుండుటయేకాక, తరువాతి కాలమునగూడ రాజకీయార్థిక వ్యావహారిక విషయములలో పరస్పరసంబంధము కలవైయుండినవి. పడమటి దేశపు కొండలలో పుట్టి దేశమధ్యభాగమున బ్రవహించి తూర్పున రత్నాకరుని జేపట్టవచ్చిన కృష్ణాగోదావరీ తరంగిణులే యీ రెండు దేశముల సంబంధమునకును గారణములైన వనవచ్చును. చాళుక్యరాజుల కీదేశములతో గలిగిన రాజకీయసంబంధము సాహితీరంగమునందలి సంబంధమునకుగూడ దోడ్పడినది. ఆకాలమున నాంధ్రదేశ మార్యభాషా మతవిజ్ఞానములను విశేషముగ నాదరించిన దగుటచే జైనబౌద్ధ మతాభిమానులగు కవులు, పండితులు కన్నడ రాజ్యము నాశ్రయించినవా రైనారు. ఆర్యమత విజ్ఞానములకు సంస్కృతభాష మూలస్తంభముగావున, తద్భాషాసాహిత్యముల నభ్యసించియు, తద్భిన్నమతావలంబు లగుటచే జైనులు బౌద్ధుల దేశభాషాసాహిత్యమార్గముల నవలంబించి రచనలు గావించి దేశీయుల యాదరమును బడయజూచుటలో నాశ్చర్యము లేదు. కావుననే దక్షిణాపథమున తూర్పుదేశభాగమగు నాంధ్రదేశమునందు కంటె పశ్చిమదేశభాగమగు కన్నడదేశమున తొలుత దేశికవితకు ఎక్కువ ప్రోత్సాహము లభించినట్లున్నది. ఆ భాషలో తొలికవులని కీర్తింపబడు పూజ్యపాద సమంతభద్రకవిపరమేష్ఠిదుర్వినీతాదులు జైనమతావలంబకులు. వీరికి నాశ్రయభూతులైన కదంబరాష్ట్రకూటరాజులు కూడ జైనమతావలంబకులే. ఆంధ్రదేశమున శాలంకాయన విష్ణుకుండినవంశీయుల కాలమున-అనగా చాళుక్యరాజుల పరిపాలనకు బూర్వము రాజాస్థానములందు సంస్కృత ప్రాకృతములకు గల గౌరవము దేశభాషయగు తెలుగునకు గలుగలేదు. కుమారిలాదుల ప్రచారమువలన రాజాస్థానములందు వైదికమతమందు గల యభిమానము జైనబౌద్ధములందు లేకయుండును. కావుననే యీదేశభాషయందు రచనలను సాగింపబూనుకొనిన కవులును లేకపోయిరి. కన్నడదేశమున తొలుత దేశభాషలో గవితారచనకు గలిగిన ప్రోత్సాహమునుబట్టి, చాళుక్యరాజులు తూర్పుదేశము నాక్రమించి నెలకొనిన పిదప, నీదేశమునగూడ దేశభాషాకవి తను ప్రోత్సహించి కొన్ని శాసనముల నందు వెలయింప మొదలిడిరి. ఆ తొలికాలమునందలివి మన కిప్పటికి లభించినవానిలో నన్నియు గద్యమయములే. తెలుగులో పద్యమయశాసనములు రచింపబడిన కాలమునకు పూర్వమే దుర్వినీతాదుల కన్నడకాదంబర్యాదిగ్రంథములే రచింపబడి నట్లు తెలియుచుండుటేకాక, సంస్కృతవృత్తములలో దీర్ఘ సమాసములతో గూడిన భాషలో రచింపబడిన శాసనములే మన కిప్పుడు గానవచ్చుచున్నవి. సుమారు క్రీ. శ. ౬౫౦ ప్రాంతపు కన్నడశాసనము—

"శ్రీభద్రవాహానచంద్రగుప్తమునీంద్రయుగ్మదినొప్పెవల్
భద్రమాగిద ధర్మమందువళిక్కె నందినిసల్కలో"
(ఎపి. కర్నా II ౩౧)

క్రీ. శ. ౭౦౦ ప్రాంతము—

"సురచాపంబోలె విద్యుల్లత గళ
తెఱవోల్ మంజువోల్ తోఱిబేగం
పిరిగుం శ్రీరూపలీలాధనవిభవ
మహారాశిగళ్ నిల్లవార్గఱం"

దీనికి సుమారు నూరునూటయేబది సం.ల తరువాతగాని యింతవరకు దెలియవచ్చిన మొదటి తెలుగుపద్యశాసనము బయలుదేరినట్లు లేదు. అదియు దేశీయచ్ఛందమగు తరువోజలోను, సీసమునను రచింపబడినదేగాని సంస్కృత వృత్తము కాదు. తత్సమసమాసములు వాడుకలోనికి వచ్చినట్లుమాత్రము "శ్రీనిరవద్యుండు, చిత్తజాతసముండు" వంటి వానివలన దెలియవచ్చుచున్నది. ఈకాలముననే - అనగా సీసపద్యములు వెలువడిన ౯-వ శతాబ్దినాటికే—కన్నడమున సాహిత్యలక్షణమార్గము లేర్పడి దండ్యాదుల కావ్యాదర్శ పద్ధతుల ననుసరించి రచింపబడిన 'కవిరాజమార్గ'మను సాహిత్యలక్షణగ్రంథము రచింపబడినది. ఇది తరువాతి కన్నడకావ్యములవలె గద్యపద్యసమ్మిశ్రితముకాక కేవల పద్యకావ్యమే యైనను, ఇది ఆదిని మంగళాచరణము పూర్వకవిస్తుతి, సభావర్ణనము, సుకవిత్వప్రాప్తి విధానము, అపండితనింద, కుకవినింద, సుకవికావ్యప్రశంస మొదలగు విషయములతోగూడిన అవతారికాభాగము గలదై యున్నది. కావున దేశీయభాషా కవికలలో నవతారికారచన కిదియే మొదటిదిగా గనబడుచున్నది. తరువాతి కన్నడకవులీతని సాహిత్యపద్ధతినే యవలంబించినను తమ కావ్యములను గద్యపద్యమయములుగా జేసినారు. తెలుగున తొమ్మిదవ శతాబ్దినాటి శాసనములలోనే యీగద్యపద్య సమ్మిశ్రితత్వము పొడసూపినది. కాని కేవలపద్యమయములగు యుద్ధమల్లుని బెజవాడశాసనమువంటివి లేకపోనూలేదు. అయినను కన్నడాంధ్ర సాహిత్యముల నీ చంపూపద్ధతి ప్రాధాన్యమును వహించినది.

ఈచంపూపద్ధతిరచనను తొలుత పేర్కొనిన యాలంకారికుడు దండ్యాచార్యుడుగా గనబడుచున్నాడు. "గద్యపద్యమయం కావ్యం చంపూ రిత్యభిధీయతే." ఈతనికి బూర్వపుదనియే చెప్పవచ్చునేమో — అగ్నిపురాణములోగూడ నిది మిశ్రకావ్యముగా పేర్కొనబడినది. "మిశ్రం చంపూ రితి ఖ్యాతం ప్రకీర్ణమితిచ ద్విధా" అని మిశ్రకావ్యము చంపువుగా గ్రహింపబడినది. పంచతంత్రాదులలో గద్యపద్యము లున్నను ఇట్టి వానికి చంపూకావ్యము లను ప్రసిద్ధి యున్నట్లగపడదు. దండి తాను పేర్కొనిన చంపూకావ్యమున కుదాహరణముగా వీనిని పేర్కొనలేదు. ఇక "తథాయది గద్యపద్యమయీ రాజస్తుతి ర్భవేత్-తదా సా 'విరుద' శబ్దేన వ్యవహర్తవ్యా" అని చంపూకావ్యములలో విరుదభేద మొకటి కలదనియు సూచించినాడు. ఇట్టివి దేశభాషాకావ్యములలో బ్రసిద్ధములై యుండెనేమో. హేమచంద్రుడు "గద్యపద్యమయీ సాంకా సోచ్ఛ్వాసా చంపూః" అని చెప్పి సుబంధు విరచితవాసవదత్త నుదాహరణముగా నిచ్చినాడు. కాని దాని కాప్రసిద్ధి లేదు. బాణుడు భట్టారహరిచంద్రుని గద్యబంధమును ప్రశంసించినాడుగాని యాతడు జీవంధరచంపువును గూడ రచించిన ట్లగపడుచున్నది. ఇది జైనకావ్యము. జైనులే యీ చంపూపద్ధతిని కావ్యరచనమును చేపట్టియుండురని తలంపనగును. త్రివిక్రమభట్ట విరచితమగు 'నలచంపువే' లభ్యములగు చంపూకావ్యములలో ప్రాచీనముగా నున్నది. ఇదియు జైనమతాభిమాని, మాన్యఖేటాధీశ్వరుడు, రాష్ట్రకూటరాజు నగు ఇంద్రరాజు ప్రోద్బలమున తదాస్థాన పండితుడగు త్రివిక్రమభట్టు రచించినది. ఇంద్రరాజు క్రీ. శ. ౧౦ శతాబ్దివాడగుటచే (౯౧౪-౯౧౬) త్రివిక్రమభట్టు నాకాలమువాడే యగును. ఈసమీపకాలముననే (క్రీ. శ. ౯౪౧) పంపకవి కన్నడమున 'విక్రమార్జున విజయ'మనుపేర వ్యాసభారతకథను, 'ఆదిపురాణ'మను జైనతీర్థంకరుని కథను చంపూకావ్యములుగా రచించియున్నాడు.

ఇట్టి రచనాపద్ధతి దేశీయమే యని-దక్షిణదేశీయమే యని తలంచుటకుగూడ నవకాశము లేకపోలేదు. ఏలయనగా క్రీస్తుశకారంభకాలమునందలి తమిళవ్యాకరణమగు 'తొల్కాప్పియ' మనుదానియందే యీమిశ్రకావ్య ప్రశంస గానబడుచున్నది. అందు పద్యములేకాక గద్యముతోగూడ జేర్చిచెప్పబడిన ప్రాచీనేతివృత్తము గల కావ్యము 'తొన్మై' అని చెప్పబడుచున్నది. దీనినిబట్టి గద్యపద్య సమ్మిశ్రితమగు కావ్య మానాటికే తమిళభాషలో వెలయుచుండె నని తలంపవలసియున్నది. అట్టి కావ్యము లాభాషలో నిటీవల విశేషముగా రచింపబడిన ట్లగపడదు. కాని ప్రాచీనకావ్యములలో నొకటగు శిలప్పదికారమున క్వాచిత్కముగానైనను గద్యరచనలుకూడ కలవు. ఇటీవల, అనగా క్రీ. శ. ౧౦-వ శతాబ్ది ప్రారంభముననే పెరుందేవనార్ అను తమిళకవిచే రచింపబడిన భారతము చంపూపద్ధతినే యున్నది. ఇట్లే దక్షిణదేశీయ భాషలోని తొలి లక్షణగ్రంథములో క్రీస్తుశక ప్రారంభకాలముననే యీమిశ్రకావ్య రచనాపద్ధతి చెప్పబడియుండుటయే

కాక క్రీ. శ. ౧౦-వ శతాబ్దిప్రాంతమున కన్నడమందువలెనే తమిళమునగూడ భారతము చంపూకావ్యముగానే రచింపబడుట నొక విశేషవిషయముగా మనము గ్రహింపవలసి యున్నది.

ఈకాలముననే భోజుడు రామాయణమును చంపువుగా రచించుచు తద్రచనాపద్ధతిలోని హృద్యత నీక్రింది రీతిని సమర్థించినాడు:

"గద్యానుబంధ రసమిశ్రితపద్యసూక్తిః
హృద్యాహి వాద్యకలయా కలితేవ గీతిః,
తస్మా ద్దధాతు కవిమార్గజుషాం సుఖాయ
చంపూప్రబంధరచనాం రసనా మదీయా."

అనగా జైనకవులచేతను, దేశభాషలలోను ఆదరింపబడుచుండిన యీ చంపూరచనాపద్ధతి సంస్కృతమున బాహాటముగా నవలంబింపబడకుండుటచేగాబోలు నీసమర్థన మావశ్యకమైన దతనికి. మొత్తముమీద క్రీ. శ. ౧౦-వ శతాబ్దిప్రాంతము చంపూరచనయం దభిమానము పెరుగుచున్న కాలమని తలంపవచ్చును. దేశభాషలో కన్నడకవులు పంపాదులు కవిరాజమార్గకర్తపద్ధతిని వదలి దీని నవలంబించినారు. ఈపద్ధతినే తెలుగుకవులును అనుసరించినారు. తిక్కన తొలుత "గద్యముతోడుత జెప్పిపెట్ట"నని తెలుపుచు నుత్తరరామాయణమును 'నిర్వచనము'గా రచించుట యను దాని నొక గొప్ప విశేషముగా చెప్పుకొనినను, తరువాత భారత రచనాకాలమున "మహాకవిత్వదీక్షావిధినొంది" కవిత్వతత్త్వవిరతిశయానంద భావితాంతఃకరణుడగుటచేతను గాబోలు నన్నయాదు లవలంబించిన చంపూపద్ధతినే గ్రహించి "గద్యముల పద్యములఁ రచియించెదఁ గృతుల్" అని ముక్తకంఠముగా జెప్పికొనినాడు. ఇట్లీ చంపూరచనాపద్ధతి దేశీయముగా ముందు తమిళ కన్నడసాహిత్యముల ప్రబలి, క్రీ. శ. ౧౧-వ శతాబ్ది నాంధ్రసాహిత్యమునగూడ వ్యాపించి స్థిరపడినది. ఇదంతయు రాజాదరణ గలిగి రాజసభలలోని పండితుల యాదరణ బొందదగిన శిష్టకవితావిషయము కాని దేశీయచ్ఛందములో రచింపబడిన కవితావిషయము కాదు. అది ద్విపద, రగడ, షట్పది, గీతిక, సీసము మొదలగు దేశీయచ్ఛందములలో సామాన్యపంగా పాదనియమముకూడ లేకయే రచింపబడుచుండెడిది. రాజాస్థానము లందలి పండితకవులు సంస్కృత వృత్తాదులం దభిమానముచే దీనిని చేపట్టకపోవుటచేతను, రాజాదరణముగాని, శిష్టకవిపండితాదరముగాని లేని యీ రచనలు జనసామాన్యమున నాకాలమున వ్యాప్తిలోనున్నను, గ్రంథస్థము లగుటకు దగిన యవకాశము లేక కాలక్రమమున నంతరించినవి. కాని యీ దేశీయచ్ఛందములు మతాభిప్రాయములందలి వైరుధ్యముచేతను, జనసామాన్యమున సులభముగ మతవ్యాప్తి కలిగించుటకనువుగా గనబడుటచేతను, శైవకవులచే తరువాతి కాలమున నాదరింపబడియుండెననుట సుప్రసిద్ధమే. కన్నడమునగూడ పంపాదు లవలంబించుటవలన సంస్కృతవృత్తప్రాబల్యముతో గూడిన యీ చంపూపద్ధతికి ప్రాధాన్యము కలుగుటచేతనే, వీరికి పూర్వమే నాగవర్మ తన ఛందోంబుధిలో కన్నడదేశీయచ్ఛందములని పేర్కొనిన రగడ, షట్పది మొదలగునవి వెనుకనే పడిపోయినవి. శైవకవుల కాలములో తెలుగున ద్విపదవలెనే మరల ౧౨-వ శతాబ్ది ప్రాంతమున కన్నడమున షట్పది తలయెత్తి షట్పదికావ్యములే యాభాషలో నంతటినుండి ప్రబలము కాజొచ్చినవి. తెలుగున చంపూకావ్యములతోపాటు ద్విపదరచనలు విశేషముగనే రచింపబడినవి. కాని చంపూరచన కాలక్రమమున ప్రకృష్టబంధముకలదై ప్రబంధరూపమును బొంది నవ్యయుగప్రారంభమువరకు నీభాషలో సాగుచునేవచ్చినది.

ఇక "ఆశీర్నమస్క్రియావస్తునిర్దేశోవాపి తన్ముఖం" అని ఆలంకారికులు చెప్పినట్లు వాల్మీకికాళిదాసాదుల రచనలు కొన్ని వస్తునిర్దేశముతోడనే ప్రారంభింపబడిన వైనను, మఱికొన్ని దేవతానమస్క్రియాదులతో బ్రారంభింపబడినవియు గలవు. కావున నిదియే యవతారికాభాగమునకు మూలభూతమని తలంపవచ్చును. కావ్యాదియం దీదేవతానమస్కార మాయాకవుల మతభావరీతుల ననుసరించియే యుండునుగావున, నాయాకవుల మతభావములెట్టివో మనము తెలిసికొనుట కవకాశము కల్పించుచున్నది. కాళిదాసు శివునియందు భక్తి కలవాడని రఘువంశాదిని, నాటకాదులందును చేసిన శివపరమగు స్తుతులనుబట్టి వ్యక్తమగుచున్నదిగదా. ఉజ్జయినిలోని మహాకాలశివుడే యీతని హృదయమందుండిన శివుడనియు జెప్పువారు కలరు. సంస్కృతపంచకావ్యకర్తలలో తక్కినవారు వస్తునిర్దేశముతోడనే గ్రంథారంభము చేయుటచే వారి యభిమాన దేవతలనుగురించి తన్మూలముగా తెలిసికొనుట కవకాశ మేమియు గలుగుటలేదు. ఇక దేశభాషలలోని కవితలలో తమిళమునందలి ప్రాచీన వాఙ్మయము సంఘవాఙ్మయ మనబడునది ఖండకావ్యము లనదగిన యేకైకపద్యములయొక్క సంపుటి. తరువాత ప్రత్యేకము మహాకావ్య మనదగినవి శిలప్పదికారము, మణిమేఖల అనునవి. ఈ రెండవదానిలో మంగళాచరణాదికము లేదు. తొలిదానిలోమాత్రము కొంతకలదు· అందు బ్రశంసింపబడిన ప్రభుప్రభుత్వము చల్లగా వెన్నెల

వలె మన్నదిగావున మొదట నెల—చంద్రుని-ప్రశంస చేయబడినది. పిదప మేఘము, సూర్యుడు ప్రశంసింపబడినారు. ఇది తొలికావ్యపద్ధతి. ఇక తరువాతి శైవవైష్ణవసంప్రదాయగ్రంథములలో నాయా మతగురువుల ప్రశంసలు కలవు. జీవకచింతామణి బౌద్ధకథతో గూడిన గ్రంథము కావున బుద్ధుని ప్రశంసతో గూడినది.

ఇక కన్నడమున నిప్పటికి లభించినవానిలో తొలిగ్రంథ మనదగిన కవిరాజమార్గములో మొదట విష్ణుస్తుతి రూపముగా చేయబడిన నృపతుంగప్రశంస గల రెండు పద్యములు కలవు. పిదప సరస్వతీప్రశంస. ఇది మంగళాచరణము. పిదప పూర్వాచార్యప్రశంస—అనగా పూర్వకవిస్తుతి చేసి అతిశయధవళుని (నృపతుంగుని) సభావర్ణనము చేసినాడు.

రాజాస్థానములయందలి యిట్టి సభలలోని పండితప్రవరుల యాదరమును, ప్రశంసను బొందగలిగిన రచనలను సాగించు బాధ్యత యాకాలపు కవులకు గలదని తలంపనగును. ఆంధ్రమున నాదికవియగు నన్నపార్యుడుకూడ నిట్టి సభల నీసంప్రదాయానుగుణముగ కొనియాడియే "తెనుంగునన్ మహాభారతసంహితారచన బంధురు"డైనాడు గదా-

"పరమవివేకసౌరభవిభాసితసద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహామనో
హరసుచరిత్రపావనపయఃపరిపూర్ణములైన సత్సభాం
తరసరసీవనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్."

రాజమహేంద్రపురమునందలి రాజనరేంద్రుని సభలో, నాతని బరివేష్టించియున్న విద్వజ్జనులలో "అపారశబ్దశాస్త్రపారగులైన వైయాకరణులును, భారతరామాయణాద్యనేకపురాణప్రవీణులైన పౌరాణికులును, మృదుమధురరసభావభాసురనవార్థ (వచన)రచనావిశారదులయిన మహాకవులును, వివిధతర్కవిగాహితసమస్తశాస్త్రసాగరగరీయఃప్రతిభులైన తార్కికులు నాదిగా గల"వా రున్నట్లు తరువాత తెలిపియున్నాడు. వీరి యనుగ్రహము, అంగీకారము, మెప్పు నీభాషలో నూతనపద్ధతిని కావ్యరచన చేయగడంగిన యాతని కెంతయు నావశ్యకమే యైయుండును.

కవిరాజమార్గకర్త తరువాత ఛందోంబుధికర్తయగు నాగవర్మ శ్రీవిష్ణు, పినాకి, వినాయక, భగవతి, దివాకరులను,సరస్వతిని తన కావ్యాదిని స్తుతియించినాడు. అనగా "ఆదిత్యం, అంబికాం, విష్ణుం, గణనాథం, మహేశ్వరం" అను పంచాయతనదైవములను స్తోత్రముచేసి వానితో సరస్వతినిగూడ చేర్చినట్లగపడుచున్నది. ఈ పంచాయతనపూజాపద్ధతి వైదికసంప్రదాయసిద్ధ మగుటచేతను, ఈ నాగవర్మ వైదికమతాభిమానియై యగుటచేతను నిట్లు చేసియుండుననుటయు సమంజసమే. ఈ వైదికసంప్రదాయమునే తరువాతి కవులు సందర్భానుసారముగా ననుసరించియుందురు. ఇక పంపకవి జైనమతాభిమానము కలవాడు. అయినను తన ప్రభువగు చాళుక్యరాజు అరికేసరి వైదికమతపక్షపాతము కలవాడగుటచేగాబోలు నాతని నర్జునునితో సరిపోల్చి నాయకునిగా చెప్పిన భారతకథలో, అనగా విక్రమార్జునవిజయములో నీపంచాయతనదైవములనే స్తుతించి వీరికి మరియిద్దరిని మన్మథుని, సరస్వతినిగూడ జేర్చినాడు. అందలి వరుస యిది : ఉదాత్తనారాయణ, ఉదారమహేశ్వర, ప్రచండమార్తండ, సహజమనోజ, సరస్వతి, దుర్గాదేవి, వినాయక. ఇందు పంచాయతనదేవతలుగాక పూర్వచంపూకవులనుండి వచ్చిన సరస్వతియు, మనోజుడు నధికముగా జేర్పబడినారు.

ఈతడు జైనమతావలంబుడైనను తనకు ప్రభువగు చాళుక్యరాజు వైదికమతాభిమానము కలవాడగుటచే నీగ్రంథమును లౌకికపద్ధతిని రచియించి, స్వీయమతాభినివేశమును సూచించుటకై మఱియొకగ్రంథమును - ఆదిపురాణమును రచించినాడు. అం దీపంచాయతనదైవతముల ప్రశంసలేదు. దీనికి బదులుగా జైనమతసంప్రదాయానుకూలముగా అర్హత్సిద్ధ, ఉపాధ్యాయ, ఆచార్య, సాధు, యక్ష, యక్షి, సరస్వతుల ప్రశంసకలదు. సరస్వతిమాత్రము జైనవైదికమతములకు రెంటికిని సామాన్యమగు దేవతగా గ్రహింపబడిన ట్లగపడుచున్నది.

ఈతనితరువాత 'గదాయుద్ధ'మును రచించిన రన్నకవియు పురుషోత్తమ, శంకర, బ్రహ్మ, మార్తాండ, కంఠీరవవాహన, కందర్ప, వాక్సుందరి, గణనాయక దేవతలను స్తుతించినాడు. అనగా పంపకవిమార్గమునే యనుసరించినవాడైనాడు.

ఈకన్నడకవులు స్తుతించిన దేవతాగణములో కందర్పునికి స్థాన మెట్లు వచ్చినదో వేరువిధముగా సమర్థించుట కవకాశము కనబడదు. కాని యాకాలపు సంస్కృత చంపూకావ్యకర్తలలో బ్రధానులైన త్రివిక్రమభట్టు రచించిన నలచంపూగ్రంథములో నీకందర్పదేవుని స్తుతి కానవచ్చుచున్నది. మొదట

"జయతి గిరిసుతాయాః కామసంతాపవాహి
న్యురసి రసనిషేక శ్శ్రావణ శ్చంద్రమౌళిః"

అని యీశ్వరుని స్తుతించి, పిదప

"జయతి మధుసహాయః సర్వసంసారవల్లీ
జననజరఠకందః కోపి కందర్ప దేవః
తదను పున రపాంగోత్సంగసంచారితానాం
జయతి తరుణయోషిల్లోచనానాం విలాసః"

అని మన్మథుని స్మరించినారు. క్రీ. శ. ౧౦-వ శతాబ్ది ప్రారంభమున సంస్కృతమున నతిప్రౌఢములగు శ్లేషరచన తోఁగూడిన యీతని నలచంపూకావ్య మాకాలమునందలి కన్నడకవులనేకాక, తరువాతి కాలమున నన్నిచోడునివంటి తెలుగుకవులనుగూడ నాకర్షించిన దనుటకు సందేహము లేదు. ఏలయనగా నీకన్నడకవులవలెనే కృత్యాదిదేవతా ప్రశంసలో మన్మథునిగూడ జేర్చిన మొదటి తెలుగుకవి నన్నిచోడుడుగానే కనబడుచున్నాడు. ఇంతేకాక అతని, కృత్యాది రచనతోపాటు అతని శ్లేషభంగులు, వర్ణనారీతులు మొదలగు నవికూడ నీ త్రివిక్రమభట్టురచనను దలపింపకపోవు. చూడుడు:—

"కింకవే స్తస్య కావ్యేన కింకాండేన ధనుష్మతః
పరస్య హృదయే లగ్నం నఘూర్ణయతి యచ్ఛిరః"
(నలచం. ౫)

"మదమున సత్కవికావ్యము
నదరగ విలుకాని పట్టినమ్ము ను బరహృ
ద్పిదమై తలయూపింపని
యది కావ్యమె మలరి పట్టినదియున్ గ(శః) రమే."
(కు. సం. ౪౧)

"సంత్యేకే బహుళాలాపాః కవయో బాలకాఇవ"

"నోరుగొలదుల్ పురికొల్పగ నందులోన నొ
క్కొక్కడు సక్కనైన గృతియుం గృతియందురె"

అతని శ్లేషపద్ధతినే నన్నిచోడు డవలంబించినాడా యని తోచును:—

"ప్రసన్నాః కాంతిహారిణ్యో నానాశ్లేషవిచక్షణాః
భవంతి కస్యచి త్పుణ్యై ర్ముఖే వాచో గృహే స్త్రియః"

"చతురోక్తుల నుతపదబహు
గతులనలంకారభావకాంతిరసార్థో
న్నతి గృతినతిరసికులువర
సతిగతి నెఱిగింపవలదె సౌభాగ్యమునన్"

"అక్షమాలాపవృత్తిజ్ఞా కుశాసనపరిగ్రహా
బ్రాహ్మీవ దౌర్జనీ సంస ద్వంద్యపీయా సమేఖలా-"
దుర్జనసంసత్తుకు బ్రాహ్మితో నుపమానము.

"సత్కృతి జగన్మాన్యప్రభావంబునన్, మదనాగం
బునుబోలె గ్రాలవలదా" (కు. సం)—సత్కృతికి మదనాగ
ముతో బోలిక.

"వాచః కాఠిన్య మాయాంతి భంగశ్లేషవిశేషతః
నోద్వేగ స్తత్ర కర్తవ్యో యస్మా న్నైకో రసః కవేః"

అని త్రివిక్రమభట్టు తన శ్లేషకవిత్వమును సమర్థించి కొనినాడు.

ఈ శ్లేషవిషయ మట్లుండ కన్నడాంధ్రములయందు చంపూపద్ధతిని ప్రౌఢకావ్యనిర్మాతలగు పంపాదికవులును, నన్నిచోడుడును వారి గ్రంథములలోని దేవతాప్రశంసలో మన్మథుని చేర్చుట కీతడే మార్గదర్శియై యుండవచ్చు నని తోచుచున్నది. అయితే ఆంధ్రమున నాదికవి యని చెప్ప దగిన నన్నయభట్టారకుడు కన్నడభాషాసాహిత్యపరిచయము కలవాడగుటయేకాక, అష్టభాషాకవీశ్వరుడని ప్రసిద్ధిగాంచిన నారాయణభట్టుతోఁ బాటుకూడ గలిగినవాడగుటచే, నంతకు పూర్వము చంపూకావ్యరచనచే ప్రసిద్ధిగాంచిన పంపాదుల మార్గమునే యనుసరించి, చాళుక్యప్రభువే యగు రాజనరేంద్రుని యాజ్ఞానుసారముగా భారతమును దెనిగింప బూనినపుడు, ఆ కన్నడభారతకవుల రచనాసంప్రదాయములను దెలిసినవా డగుటచే, వానిలో దనకు హితమైనవానిని గైకొనియుండు ననుటకు సందేహము లేదు. ఆకారణముననే వేదమతాభిమానియగు నీతడును వారివలెనే పంచాయతనమందలి దేవతలను స్మరించినా డనవచ్చును. కాని ప్రస్తుతము లభించిన భారతపాఠములను బట్టి చూడగా కన్నడకవులును, నన్నిచోడుడును స్మరించిన మన్మథు నీతడు స్మరింపక పోగా, కుమారస్వామిని, మాతృకలను నధికముగా స్మరించి నట్లు తెలియుచున్నది.

"హరిహరాజగజాననార్కషడాస్యమాతృసరస్వతీ
గిరిసుతాదిక దేవతాతతికి న్నమస్కృతి సేసి"

అనంతరము వాల్మీకివ్యాసులను, తత్పూర్వాంతరసరసీవనంబులను గొనియాడి, నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితారచనబంధురుడైనట్లు చెప్పినాడు. మొట్ట మొదట "శ్రీవాణీగిరిజా"యను సంస్కృతశ్లోకమున హరిహరహిరణ్యగర్భపద్మోమావాణీపతులను స్తుతించిన వాడు అఖిలజగజ్జేగీయమాన నానాగుణరత్నరత్నాకరుండగు రాజరాజనరేంద్రుడు కాని నన్నయభట్టు కాడు. "భారతము తెనుగున రచియింపు మని యాత డానతిచ్చిన విని యాతని యనుమతంబునను, విద్వజ్జనంబుల యనుగ్రహంబునను నాచేర్చినవిధంబున నిక్కావ్యంబు రచించెద"నని చెప్పి

తరువాత తాను "హరిహరాజగజాననాదుల"కు మ్రొక్కిన వాడయ్యెను. వైదికమతాభిమానియగు రాజనరేంద్రునిచే తొలుత మూర్తిత్రయస్తవము నన్నయ చేయించుట యుక్తమే. అట్లు మొదట హరిహరపద్మగర్భుల స్తుతి వచ్చుటచే నిచ్చటగూడ బ్రహ్మను జేర్చియుండునేమో. కాని పంచాయతనములోగాని, కన్నడకవుల స్తుతులలోగాని బ్రహ్మ స్తుతి కానరాదు. వారి యవతారికలలో లేని షడాస్యమాతృక లిందు హెచ్చుగా జేరినారు. 'మాతృ'అనునది 'మార'శబ్దమున కపపాఠమేమో యని తలచినవారును గలరు. నన్నిచోడుడు నన్నయకు బూర్వు డనియు, నాతని పీఠిష యమున నన్నయ యనుకరించియుండు నను భావమే యిట్టి తలంపు కలుగుటకు గారణము. కాని వ్రాతప్రతులలో నింతవర కెచ్చట నాపాఠము కానవచ్చుట లేదు. కుమారస్వామియు, మాతృకలును తూర్పుచాళుక్యుల కులదైవతములను ప్రసిద్ధి యొకటి కలదు. అకారణముచే నన్నయ యీదేవతలను స్మరించియుండవచ్చును. బెజవాడయుద్ధమల్లుని శాసనములో గొమరస్వామికి గుడిగోపురము నెత్తించుట, జాతరజరుపుట మొదలగునవి పేర్కొనబడి యున్నవిగదా.

నన్నిచోడుడు కుమారసంభవకథారచనకు గడంగినవా డగుటచే షణ్ముఖుని, మారుని బేర్కొనినా డనవచ్చును. ఇక శివపారమ్యమునుగూడ బ్రతిపాదింపదలచినవాడగుటచే తొలి మూడుపద్యములలోను మహాదేవుడని, అంబికాధవుడని, పరమేశ్వరుడని అతని స్తుతించుటేకాక, తరువాతి పద్యములలో అతని వామాంగమునందు బుట్టి నియమస్థితి గొల్చి యఖిలలోకములను గాచుచున్నట్లు వర్ణించిన విష్ణువుతోపాటు పరమేశు దక్షిణాంగమున జనించి యాతని చిరకాలము గొల్చి తత్ప్రసాదమున విశ్వము సృజియించిపొల్చినట్లు బ్రహ్మనుగూడ స్తుతించినాడు. ఇట్లు బ్రహ్మవిష్ణుల బేర్కొనుట ఆవశ్యకమైనది. ఇక రవి భవుని యష్టమూర్తులలో నొకమూర్తి: త్రిలోచనములలో నాదిలోచనము. గణనాథు డభీష్టఫలప్రదాత. షణ్ముఖుడు అపర్ణాస్థాణువులు జననీజనకులుగా గలవాడు. హరుని కామాతురునిగ వశము జేసికొన్నవాడు మరుడు. వీతరాగి నర్ధనారిం జేసినది నగజాత. వేదాగమరూపమున మహాదేవు నపారగుణమహాస్తుతి సంపాదిత భారతి. ఇట్లు శివపారమ్యమును స్థిరపరచి యిట్టి శివునితో దన గురువును, కృతిపతియు నగు జంగమమల్లికార్జునున కభేదము కల్పించినాడు. సహజమగు దేశి కవితాభిమానమునే వెల్లడించుకొనుటకో యన్న ట్లీతడీ గ్రంథమున తొలిపద్యమును దెనుగుననే రచించినాడు.

నన్నయమాత్రము రాజనరేంద్రుని వైదికమతాభిమానమును వ్యక్తపరచుటకో, లేదా ఆతని యాస్థానమం దున్నట్లు వర్ణించిన వివిధశాస్త్రపండితులను, కవులను సంతృప్తిపరచుటకో, భారతీయవిజ్ఞానమునకు, తాను తెనిగింపదలచిన భారతమునకు మూలము సంస్కృతభాష యగుటచేతనో గ్రంథాదిని రాజనరేంద్రునిచే జేయించిన త్రిమూర్తి స్తవరూప మంగళము సంస్కృతభాషలో రచించెను. ఈయాచారము కన్నడకవులలోను గానరాదు. ఇట్లు తెలుగున రెండువిధముల భిన్నరీతులగు కవితలకు మూలపురుషులని చెప్పదగిన యానన్నయనన్నిచోడులు వారికి బూర్వమున, అనగా ౧౦-వ శతాబ్దిని కన్నడదేశమున ప్రసిద్ధిగాంచిన దేశీయ కవితాసాహిత్యసంప్రదాయములను గుర్తించి వానిని వారివారి కనువైన రీతిని గ్రహించి తమ గ్రంథరచనను సాగించిరని తెలియుచున్నది.

చంపూ రచనాపద్ధతి, సంస్కృతవృత్త సంగ్రహణము, వీనితో జాతీయములు-లేదా తెలుగుదేశీయములగు పద్యములను జేర్చి చెప్పుట, సంస్కృత వృత్తములలో దేశీయములగు ప్రాస (వడి) నియమములను పాటించుట, సంస్కృతవిభక్తిక్రియారూపావ్యయాదులను తెలుగు (దేశి) రచనయందు జొనుపకుండుట, సంస్కృతశబ్దములను దీర్ఘసమాసములనైనను తెలుగుగా జేసి తత్సమబహుళమగు భాషను విశేషముగా బ్రయోగించుట, కృత్యాది దేవతాసంస్తుతులలో పంచాయతన దేవతలను గ్రహించుట, రాజాస్థానములయందలి పండితసభావర్ణనము, కృతిపతిని కథానాయకుని తోడనో ఇష్టదైవముతోడనో అభేదము చేసి వర్ణించుట, కథాభాగముననో లేదా ఆశ్వాసాద్యంతములందో కృతిపతిగుణవిశేషములను కథాసందర్భానుసారముగ నాయకుని గుణగణముగ వర్ణించుట, ఏకవిభక్త్యంత విశేషణములతో కృతిపతిని పొగడి అతనికి నాయకునితో నభేదముచెప్పుట, లేదా అతనికి గృతియిచ్చుట, ఉత్తమకవితాలక్షణ ప్రశంస, కుకవినింద, సుకవిస్తుతి, స్వీయకవితావిశేష లక్షణప్రశంస ఈ మొదలగు ఆంధ్ర కావ్య (ప్రబంధ) విశేషలక్షణములుగా బరిగణింపబడుచుండిన నన్నయ నంతకుపూర్వమున మనకు సన్నిహితులగు కన్నడకవులు తమ దేశికవితయం దవలంబించినవే యని తత్సాహిత్యలక్షణముల నింతక పరిశీలించినచో మనకు దెలియకపోదు.

ఈలక్షణములు కన్నడసాహిత్యమునుండి నన్నయాదులు గ్రహించి రనవేల. నన్నయకుపూర్వము తెలుగు సాహిత్యముననే యుండియుండకూడదా యను ప్రశ్న కలుగవచ్చును. నన్నయకుపూర్వమున గల తెలుగుకవులు వీరద్ధ

తుల నవలంబించినను అవలంబించియుండవచ్చునుగాని పైని దెలిపిన కావ్యపద్ధతులు తెలుగుకవితలోనికి వచ్చిన వని చెప్పుట కాధారము లేదు. ఇప్పటికి లభించిన శాసనవాఙ్మయమునుబట్టి పరిశీలించినచో, నాకాలపు తెలుగుకవితలో సంస్కృతవృత్తములు చేరిన ట్లగపడదు. అక్కర, సీసము, తరువోజ, గీతము మొదలగు దేశీయచ్ఛందోరీతులుమాత్రమే ప్రచారమునం దున్న ట్లూహింపదగియున్నది. కన్నడసంప్రదాయమునకు భిన్నముగా దెనుగుకవితలో పద్యములందు ప్రాసయేకాక వడియు బాటింపబడుచుండినది. కన్నడమున నప్పటికి గానరాని సీసపద్యములలో ప్రాసయతులు, సర్వప్రాససీసములు వాడుకలోనికి వచ్చియున్నవి. రచనలో దీర్ఘసమాసబహుళమగు తత్సమభాష ప్రయోగింపబడుచునే యున్నది. కాని శాసనరచనలో తెలుగుపదములు సంస్కృతవిభక్త్యంతములతో బలిమిపుచ్చబడుచుండిన ట్లగపడదు. అట్టి మణిప్రవాళరచనల నంతకుపూర్వమే కన్నడలాక్షణికులు నిషేధించి తత్సమభాషారచననే ప్రోత్సహించియుండుట కవిరాజమార్గాదిగ్రంథములను బట్టి వ్యక్తమగుచునే యున్నది. ప్రస్తుతము లభ్యములగు శాసనములను బట్టి యింతవరకే చెప్పదగియున్నను, తరువాతి శైవకవుల గ్రంథములలోని సూచనలను (references) బట్టి యాకాలమున దెలుగుకవితలో ద్విపదలు, రగడలు, ఉదాహరణలు, అనేకరీతులు గల పదములు, ఏలలు, జోలలు, అంకమాలికలు మొదలగు ననేకరీతులు గల దేశిరచనలు ప్రచారములో నుండెడి వని యూహించుట కవకాశము కలదు. ఇట్టి దేశిరచన లన్నియు దేశీయులలో కంఠస్థములై యుండినవేగాని, రాజావలంబనము, పండితాదరణము, శిష్టుల సానుభూతి వీని మొదల కలుగకపోవుటచే నివి వ్రాతలోని కెక్కియుండవు. ఒకవేళ ఏకొన్నిటికో అట్టి భాగ్యము లభించినను పండితులకు, శిష్టులకు వానియెడల గల నిర్లక్ష్యభావముచే వాని నాదరించువారు లేక ఆవ్రాతగ్రంథము లచిరకాలముననే యంతరించియుండును. అటులనే యెప్పుడో వ్రాయబడి యిప్పటికిని ఏప్రాచ్యలిఖితపుస్తకభాండారముననో యెట్లో కీటదష్టమై బోకుండ సంరక్షింపబడుచున్న పాటలు,పదములు మొదలగు దేశిరచనలతో గూడిన తాటియాకుగ్రంథము లీకాలమున నెట్టి యాదరమును బడయుచున్నవో మన మెరుగనిది కాదు. అందులో నన్నయవంటి మహాకవి బయలుదేరి రాజనరేంద్రునివంటి ప్రభువునాదరణమున నాతని మహాసభయందలి పండితవర్యులను మెప్పింపగలిగిన మహాభారతమువంటి యుద్గ్రంథము రచించి శిష్టలోకము నంతను సంతృప్తినొందింపగలిగినపిదప నీదేశీయరచనలను శిష్టలోకమున దలచువా రెవ్వరుందురు? మతవిషయమున గలిగిన యభిప్రాయభేదమునుబట్టి తరువాతి శైవకవులు జనసామాన్యమున ప్రచారములో నున్న దేశీయకవితారచనాపద్ధతిని కొంతవర కవలంబింపవలసినవారైనారు. జనసామాన్యమున నింకను ప్రచారములోనుండి కాలగతి నంతరింపకుండుటచేతనే తరువాతి లాక్షణికులు వీనికి-అనగా రగడలు, షట్పదులు, ఉదాహరణములు, యక్షగానములు మొదలగువానికి దమ గ్రంథముల లక్షణము కల్పింపవలసినవారైనారు. నన్నయకు పూర్వకాలమున నీదేశమున సంస్కృతభాషకు, నందలి కవితకు గలిగిన ప్రాధాన్యము, పలుకుబడి దేశభాష యగు తెలుగునకు, అందు దేశీయచ్ఛందములో రచింపబడి పదములు, పాటలరూపమున నున్న దేశికవితకును లేకపోవుట తటస్థించుటచేతనే, కన్నడమున నాకాలమున బయలుదేరిన కవితాసంప్రదాయముల ననుసరించి చాళుక్యప్రభువులు తెలుగుదేశమునగూడ తత్సమభాషాబహుళమగు దేశికవితను ప్రోత్సహించినారు. ఈ విషయమునే తరువాతి నన్నిచోడుడు తన యవతారికలో

"మును మార్గకవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు మొదలగు పలువుర్".

అను పద్యమున మన కెరిగించినాడు.

నన్నయ రచించిన భారతమువిషయమున సంస్కృతప్రాకృతకర్ణాటసాహిత్యసంప్రదాయము లెంతవరకు సాయపడినవో వ్యక్తముగా జెప్పలేదుగాని అష్టభాషాకవీశ్వరు డని ప్రసిద్ధిగాంచిన నారాయణభట్టు తన "కభిమతంబుగ దోడయి విర్వహించె" నని చెప్పుటచే మనము కొంతవర కూహింపకొనవచ్చును. అయినను ఈతడు భారతరచనలో నవలంబించినది పురాణరచనాపద్ధతి. సంహితారచనాదృష్టియగుటచేత కవితాశిల్ప దృష్టితో కావ్యలక్షణముల నందు మనము పరిశీలింపజాలము. మన మాతని కవిత నెట్లు చూచి యాదరింపవలెనో ఆతడే చెప్పినాడు. ఇం దాతని సౌమ్యస్వభావముకూడ నెట్లు వ్యక్తమగుచున్నదో గమనింపుడు.

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగున న్మహా
భారతసంహితారచనబంధురు డయ్యె జగద్ధితంబుగన్"

తెనుగున భారతరచన చేయునపు డద్దానిని సంహిత యను దృష్టితో జూచియే నన్నయ రచించినాడు. ఫలము

జగత్తునకు హిత మొనగూర్చుట. ఆ హితమనునది బహు యాగఫలరూపమైన పరమార్థము. అది

"బహుభాషల బహువిధముల
బహుజనములవలన వినుచు భారతబద్ధ
స్పృహులగువారికి నెప్పుడు"

గలుగుచుండునని రాజనరేంద్రుడు చెప్పియేయున్నాడు గదా. భారతశ్రవణాభిరతి కపిలంబగు గోశతంబు నుత్తము లగు వేదవిప్రులకు దానముచేసిన ఫలంబును సమకూర్ప గలదు. ఆంధ్రజగత్తున కిట్టి హితము గలుగుటకై వారిని భారతబద్ధస్పృహులగువారినిగా జేయగోరియే నన్నయ తెనుంగున మ్మహాభారతసంహితారచనబంధురు డైనాడు. ఈ యాంధ్రజగత్తున కవీంద్రులు కొంద రున్నారు. ఇతరులు నున్నారు. అందు కవీంద్రులు తమ రచనలలోని ప్రసన్న కథాకలితమగు నర్థయుక్తిని లోనారసి యది మేలని యాద రింతు రనియు,నితరులు అక్షరరమ్యత* నాదరింతురనియునే యాత డాశించినది. ఏలయనగా తాను నానారుచిరార్థముల కును, సూక్తులకును నిధి యని యాతడే యెరుగును. ఇ ట్లీతడు వ్యాసభారతార్థమును ప్రసన్నగంభీరములగు తెనుగు సూక్తులలో రచించి జగద్ధితం బొనగూర్చినవా డయ్యెను. అంతేకాని నన్నిచోడునివలె "కేనములేకనుర క్తమైన భాషాంగన దక్క నేలిన మహత్త్వము లోకమునం బ్రసిద్ధిగా భంగిగ విస్తరించెద ప్రబంధము సద్రసబంధురంబుగా" అనికాని. "నాకుగా కొరునకు నిట్లు సేకురునె నొక్కట లాభము లెన్ని యన్నియున్" "అరువదినాలుగు విద్యలను నేర్పు నైసర్గికమై వాలిన (తనవంటి ?) సుకవులకుంగాక కృతులు సెప్ప నెవ్వరికైనన్ దరమే" అని కాని. తిక్కనా ర్యునివలె "నే నుభయకావ్యప్రౌఢి పాటించు శిల్పమునకా పారగుడ కళావిదుడ" నని కాని ప్రగల్భరీతి నేమియు జెప్పికొనియుండలేదు.అనగా వీరియం దిది యొక దోష మను నభిప్రాయముతో జెప్పుట కాదు. అది నన్నపార్యుని సౌమ్య స్వభావమును జాటినట్లే యిది వీరి ప్రౌఢిమకు దార్కాణము కాగలదు. ముఖ్యముగా నాయాకవుల కవితారచనలలోని వారివారి దృక్పథములను గనిపట్టి, వాని సహాయమున నాయా రచనలలోని కవిహృదయమును గాంచగలిగినచో తత్కవితా రసానుభవమున కది విశేషముగ దోహదపడగల దను విషయ మును మనము గుర్తింపవలసియున్నది. నన్నపార్యుని ప్రసన్నత, అర్థయుక్తి, అక్షరరమ్యత తిక్కనలో ప్రధాన ముగా మనకు గనపడకపోవచ్చును. తిక్కన తాను చెప్పు కొనిన ప్రౌఢిమ, కవితాశిల్పము, కళావేత్తృత్వము నన్నయ లో లేకపోవచ్చును. నన్నిచోడుడు వాచ్యముగ జెప్పికొనిన యష్టాదశవర్ణనలు, దశప్రాణంబులు, షట్త్రింశదలంకార ములు మొదలగువానికై నన్నయతిక్కనల రచనలలో వెదకుకొనుట యుక్తమైన పని కాకపోవచ్చును. అంతమా త్రముచే నొకరి కొకరు తీసిపోవుదు రనికాని, ఒకరికంటె నొకరు గొప్పవా రనికాని చెప్పజూచుట కేవలసాహస మని పించకపోదు. సామ్యలక్షణములు కొన్ని యుండవచ్చును. కాని ఆయాకవులకు గల ప్రత్యేకలక్షణములను గనిపట్టి వానిని దేశకాలపరిస్థితులతోడను, ఆయాకవుల జీవితచరిత్రల తోడను సమన్వయించి యాకవుల హృదయమును గ్రహిం చినగాని సరియగు కావ్యానందరసానుభవము కలుగబోదు. ఈయాంధ్రకవుల యవతారికలే వారి కవితాదృక్పథములను గనిపట్టుటకుగూడ గొంతవరకు మనకు సహాయకారులు కాగల వనుటకు సందేహము లేదు.

* నన్నపార్యుని అక్షరరమ్యతవిషయమున నభిప్రాయభేద మున్న ట్లగపడును. కొందరు తలచినట్లు అక్షర రమ్యత యనగా నన్నయకాలమునందలి యాంధ్రాక్షరముల పొంకము అనుట హాస్యాస్పదము. నందంపూడిశాసనాక్షర ములు అంతకుపూర్వమునందలి శాసనముల యక్షరముల కంటె పొంకము, కుదురు కలవైయున్న వను భావముతో గొంద రిట్లు తలచియుందురు. కాని కవితాలక్షణమును గూర్చి ప్రశంసించుచున్న నన్నయ లిపిలోని అక్షరముల పొంకమునుగూర్చి చెప్పునని తోచదు. సంస్కృతాంధ్రభాష లకు చక్కని సమ్మేళనమును గల్పించి ప్రసన్నగంభీరము, హృదయంగమము, ధారాళము నగు శైలిలో నాతడు చేసిన రచనాసౌభాగ్యమునే అక్షరరమ్యతయని యాతడు పేర్కొ నెను. కొంకు, మరుగు, కుంటు, అన్వయకాఠిన్యము మొద లగునవి లేక విశిష్టపదరచనారూపమగు రీతిమాధుర్యముతో గూడినదే యాతని 'యక్షరరమ్యత.'

కడుపుతీపి

= శ్రీ చెరుకుపల్లి జమదగ్నిశర్మ =

•

నను గన్న తండ్రి! రామా! - వినవో నామాట, యపుడు విన్నానుకదే
యనియెదో, యది కాదోయీ - విను నివి నాక్రుంగుటెడద వెలువడు పలుకుల్.

నాయన! యేమి చెప్పుదును, నాటి నిశన్ దిశలెల్ల ముంపులై
పోయెను పట్టలేని ప్రజ మోదభరమ్మున నిన్నుగూర్చి స్వీ
యాయతనమ్ములన్ నిలిపినట్టి జ్వలన్నవదీపకాంతితో;
నాయెదమాత్ర మంటనితనాన దిగుల్వడి చీకటింబడన్.

అది యేమందువొ? ముందు నేనును నపూర్వానందపీయూషసం
పద నోలాడితి రాఘవా! నిజముసుమ్మా! ఈవు రాజౌదువం
చెద నుప్పొంగితి, నంతకంటె నధికాభీష్టమ్ము లేదంచు న
మ్మద మేపారగ రాజదత్తమణిదామం బిచ్చితిన్ దాసికిన్.

అణువణు వూచముట్టు కదలాడిన దీమెయి, పుల్కలెత్తె చి
క్కణముగ, నిల్చిపోయితిని కంబమురీతి జగమ్ము సర్వ ము
ల్బణముగ విస్మరించితిని రాఘవ! చూచితి నిన్న మెల్లెడన్;
క్షణ మది, జీవితక్షణము; నాడు గతింపకయుంట కేడ్చెదన్.

అపుడేమయ్యెనొ నీ వెలుంగుదువ రామా! దేవతల్ క్రుద్ధులై
విపులం ద్రోయగ నన్ను జూచి విబుధద్వేషుల్ మహోత్సాహని
ర్వపురుత్సానయుతాట్టహాసములు పర్వంజేసినట్లైపరం
తప! నాబుద్ధి సహస్రధా శిథిలమై త్రవ్వెన్ భవాంభోనిధుల్.

క్షణము గతింపకుండ తొలిగా నటువంటి శుభమ్ము నాకు దె
ల్పిన దని మెచ్చి నే నిడిన పేరును నామొగమందు గొట్టుచున్
కనలుచు గొంపకూలినటు గంతులువెట్టుచు మన్మనోబ్ధిమం
థనచణ, దాసి, మంథర యథావిధి యీడ్చినదోయి రాఘవా!

ఎన్నో చెప్పిన దేమి చెప్పుదును తండ్రీ! నీవు నీ తండ్రియున్
పన్నాగమ్ములు పన్ని నాసుతుని సంపత్తెల్ల గాజేయగా
నున్నా రన్నది, తా నిదేవరుసలో నూహించియూహించి నా
కిన్ని చెప్పి మఱింత యేడ్చి నను నేడ్పించెన్ రఘూత్తంసమా!

తలచిన నిల్వ నీరగుదు తత్ఫలితమ్ముల లోనలోన, నీ
యిలపయి నావలెం దమకహీన సుఖమ్ములు కోరి తోడివా
రల సుఖహీనలం బలుపు రాగలు, కుత్సిత లున్నవారె? నా
తల చెడి యిట్లు లైతిని కదా! యిక నేమగు నాకు బాపికిన్.

కోరితి నన్ను నాసుతునకున్ ప్రభుపట్టము గట్టునట్లు, ని
న్నారక కాన కంపెడి దురూహా జనింపగ నేల రామ! ని
ర్ధారితమయ్యె నింకిదియు రాక్షసకృత్యము కాదునాగ నె
వ్వారికి సాధ్యమా, ననుభవమ్మున కయ్యె ఫలమ్ము సర్వమున్.

వెకలితనమ్ము బైటబడి వీటిడి నైతిని నే నొకర్తనా
సకలము నాకు దూరమయి చన్నది, యున్న దకీర్తి యొక్కడే;
ఒకటని వేఱొకం డనక యుండెనె నా కొమరుండు నన్ను, నా
కకట! వ్రతమ్ము చెడ్డ ఫలమైనను దక్కగ లేదు రాఘవా!

నారలుగట్టి కూర లశనమ్ముగ నుండుము రామ! నీవు కాం
తారములందు నంటి నిను, తా నటులే భరతుండు నీవలెన్
నారలుగట్టి కూర లశనమ్ముగ నొక్కడు నందిగ్రామ కాం
తారమునందు నుండు నను తాపవిదగ్ధను జేసి నన్నునున్.

భరతుడు చెప్పె మీా రడవిబట్టిన దాది యెటుల్ వసించుచుం
డిరొ యది యెల్ల నాతనయు! డెందమునం దొక ఝంఝ వీచి ని
ష్కరుణగ ప్రాణవృక్షము పెకల్చెను మూలముతోడగాని నా
కొఱ కదియే నొసర్తు ననుకొంటమెకా నిల ద్రొక్కనింతకున్.

నా పలు కాలకించిగద నాయన! మ మ్మిటు చేసితీవు, రా
మా! పొరపాటు నీ వలిపినట్టిది సుంతయు లేదు, నేనుగా
పాపిని చేసికొంటి నిది, వమ్మయిపోయిన వన్ని యాశలున్;
నాపలు కివ్వడున్ వినుము నాయన! తొల్లిటి ప్రేమ చూపుచున్.

మనమార బిల్చుచుంటిని-వినవా నామాట రామ! పితృవాక్పాలా!
నిను జూచు చూపుతోడనె-నను జూచుకొనంగ నిమ్ము నను నాతండ్రీ!

సాధనమా? సాధకుడా?*

❀

= కీ. శే. శ్రీ కపిస్థలం కృష్ణమాచార్యులు =

చేతిలో పనులు కొనసాగటానికని పనిముట్లు తయారుచేసుకోవటానికీ, వాడుకోవటానికీ అనాదిగా అలవాటుపడ్డాడు మానవుడు. ఉత్తచేతికన్నా పనిముట్లతోటి చేయి సున్నితంగానూ, సత్వరంగానూ పనిచేయగలగటం (చూచి, పనిచేసి, సులభంగా) అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగాడు. అప్పటి నించీ వానికి సాధనమంటే ఒక మెప్పూ, గౌరవమూ కలిగాయి. వీటి మూలకంగా దీనికి కాలంతరబడి సహజంగా చేతికన్నకూడా యెక్కువ గొప్పదనమూ, ప్రాముఖ్యతా లభించినై.

ఇలాంటి పరిణామానికి మన ఆయుధపూజే నిదర్శనం. ఆయుధాలకూ, సాధనాలకూ ఈ పూజలో ఒక ఆధ్యాత్మిక అంతరార్థం ఆపాదించబడుతుంది. పూలుగా, కిరణాలుగా, అర్ధవలయాలుగా పనిముట్లను తీర్చి, అలంకరించి మొక్కేవాళ్లలో చాలామందికి ఇది దేవత అన్న భావం వాస్తవంగా వుంటుంది. రోజూ తన దినసరిపనుల్ని ఆరంభించేముందు తన పనిముట్లకు మొక్కుకోవటం మంచిదని తలిస్తూ పనుల్లో తెలివితేటలతో వర్తించే పనివాడుకూడా అనుకుంటాడు. శుక్రవారం శుక్రవారమూ ఇనప్పెట్టెలు పూజించటం వడ్డీవ్యాపారం చేసేవాళ్లకు సర్వత్రా అలవాటే. పుస్తకాల్ని (ఇవికూడా ఒకమోస్తరు పనిముట్లేగా) పూజించేకోసం ఏర్పడిందే సరస్వతీపూజ.

ఇలాంటి పూజలన్నీ సూచించేదేమిటి ?— నిగూఢమైన ఒక మనస్తత్వానికి ఇవన్నీ పైరూపాలే. దీనిప్రకారం సాధనాలకే గౌరవమంతా; వాటిని వాడే చేతికి (వాస్తవంగా వుండవలసిన) పూజ్యత అసలే లేదు. కార్మికులకు వీటివల్ల నమ్రతా, కృతజ్ఞతా అలవడుతా యన్న ఆశయం ఒకటి వుంది. కాని, అది ఆశయమే. నిజానికి ఇవి మనిషికి తలవంపులు కలిగించే తలతిక్క-తారుమారు పనులు. యవనిక వెనుకవున్న అమూల్యమైన, ఆధ్యాత్మికమైన సత్యాన్ని కాదని, ఎదట కనబడే నిర్జీవమైన, చంచలమైన బాహ్యచిహ్నాల్ని అతిగా నుతించటం వీటిల్లో తోస్తుంది.

విధానంకావాలిగాని, దాన్ని వాడే మనిషెందుకూ?

పనిముట్లే లేకుంటే, చేయి పనికి మాలిందే.

పనితనం పేరు చెప్పుకోవాలీ అంటే, మెచ్చుకోవలసింది పనిముట్టునేకాని, చేతిని కాదు.

— ఆయుధపూజల అంతరార్థం ఇలాంటి దురభిప్రాయాలేకాని నమ్రతా కాదు, కృతజ్ఞతా కాదు. అవి పూజలు కావు: పూజాభాసాలు.

అట్లని యెవ్వరూ మనల్ని చూచి నవ్వుకోవలసింది లేదు.

అన్ని జాతులకూ, అన్ని దేశాలకూ యిలాంటి ఆచారాలు వున్నవి. అయితే ఒకటి : పేర్లు పెట్టటంలోనే యిలాంటివాటిని కప్పిపుచ్చటంలో వాళ్లు మనవాళ్లకంటే మరికాస్త యెక్కువగా చూపిస్తారు తమ తెలివీ, నేర్పరితనమూ. అంతేకాని ఈ మనస్తత్వం వాళ్ల కార్యాల్లోనూ, విశ్వాసాల్లోనూ ప్రతీచోటా ప్రతిఫలిస్తూనేవుంది. మనలాగే వాళ్లకూ—

మనుష్యులమీదకంటే విధానాలమీదా, సాధనాలమీదా నమ్మకం యెక్కువ.

తరతరాల విలువలన్నీ తారుమారుచేసి, సాధనాలే ప్రమాణాలుగా కొత్తకొత్తగా, బలవంతంగా విలువలు కట్టేస్తున్నారు.

* అనువాదకుడు : శ్రీ శ్రీరంగాచారి.

కాబట్టి, ఎవరేమనుకుంటారో అనుకోవలసిన పని లేదు మనకు; ఆత్మవంచన లేక, ఆత్మపరీక్ష చేసుకుందాం.

మనలో కొందరు బైలుదేరారు. వాళ్లది ఒళ్లు తెలియని వుద్రేకం. వాళ్లు మనలోని కుళ్లునూ, మాలిన్యాన్నీ 'అదేపనిగా చూపెడతారు. వీళ్లందరూ సంస్కర్తలే—దేశం, కాలం, సంఘం, మతం, విద్య వగైరా వగైరాల సంస్కర్తలు. ఎవరి ఆదర్శాలు వాళ్లవే. ఎవరికి వారు ఆదర్శాలంటే తమవేనని అనుకుంటారు. అనుకోవటమే కాదు—దబ్బా వాయిస్తారు. అవి తగిలించుకుంటే సరి, దిక్కుమాలిన కుళ్లూ గిళ్లూ కనిపిస్తాయి వీళ్లకు. కనిపించి 'కుయ్యో మొర్రో' అంటాయి—"మాగతేం కానూ? మోక్షం అంటూ లేదా మాకు? క్షణం దాటితే సర్వనాశనం బాబూ!" అని. వీళ్ల కౌశల్యప్రదర్శనాన్ని నిరీక్షిస్తూ యుగయుగాలుగా తయారై కూచున్నాయి పరిస్థితులు.

సామాన్యమానవుడు చూచి గుర్తించగలిగింది సాధనమే గాని దాన్ని వాడే చేతిని కాదు. కాబట్టి, సాధనం లేకుంటే చేతికి పనిలేదు. అని వాదించటమే వాని పని. ఈ వాదానికి మరోపక్షం వుందనీ, లేక వుండవచ్చుననీ వానికి తోచదు; తోచినా అంతగా దాన్నిగూర్చి యోచించడు. వానిమట్టుకు యీవిషయం మన పాతకాలపు వాదెం—అంటే రెండోపక్షం శుద్ధశూన్యం. కాబట్టే 'చేతులంటూ లేకుంటే సాధనాల గతేమిటి?' అన్న ప్రశ్న వానికి లేదు.

'అన్నింటికీ దివ్యామృతం' అని సంస్కర్తలు ఏకమాలికా ప్రయోగపు వుపన్యాసాలుదంచేస్తూవుంటే జనం మూగిపోతుంది. సంస్కరణల్ని అమల్లో పెట్టే వాళ్ల గొడవే వద్దు.

ఆవేవో చెప్పండి మొదట.

వాటికి తగ్గట్టు వ్యక్తుల్ని మార్చుకుంటేసరి— ఆవువెంట దూడలాగా దానంతట అదే వస్తుంది మేలు.

—ఇదీ సంస్కర్తలైనవాళ్లూ, కాబోయేవాళ్లూ గుడ్డినమ్మకం.

విశ్వాసం వున్నవాళ్లకు చత్వారం వుంటుందంటారు. సంస్కరించేవాళ్లూ, సంస్కరించబడేవాళ్లూ సంస్కరణల రంగులరాట్నంలో తలతిరిగేదాకా పరిభ్రమిస్తారు. భ్రమణవేగం కాస్తా చల్లారేసరికి రాట్నం క్రమేపీ నిలిచిపోతుంది. ఎదురెదురుగా, వీళ్లూ వాళ్లూ ఎప్పటిలాగే, ఎక్కడ వున్నారో అక్కడే! కించిత్తైనా మార్పు వుంటేనా? అంత ప్రయాసా నిరర్థకం అని అప్పుడుకానీ అర్థంకాదు.

యువజనవిద్యలో లోపం వుందా?—కొత్తవిధానం కనిపెట్టు...

సంఘవృత్తం సక్రమంగా సాగటంలేదా?—కొత్తచట్టం తీసుకురా...

రాజకీయసంస్థల్లో వైషమ్యాలున్నాయా?—వోట్ల హక్కును విస్తరించు...

అని ప్రతీదానికీ ఒక సంస్కరణ చూపెట్టడానికి వాళ్లకూ, దాని చప్పరించటానికి వీళ్లకూ వున్న ఓపికా, నమ్మికా మరీ ఆశ్చర్యంగా వుంటాయి.

విధానాలూ, సాధనాలూ—ఎలాంటివైనాసరే—తమంతటఅవే పనిచేయగలుగుతాయా?

వీటిని అలక్ష్యం చేయటానికీ, తక్కువపరచటానికీ వీల్లేదు.

ఐతే—వీటివెనుక నీడలో వున్న, వుండితీరవలసిన వ్యక్తినీ, సాధకుణ్ణీ విస్మరించటం కానిపని.

సాధనం లేకుంటే సాధకుని పనితనం కుంటుపడుతుంది; కాని, వాడు పనిచేయగలుగుతాడు.

సాధకుడు లేకుంటే సాధనం చచ్చినట్టే. ఏపనీ జరగదు.

మేలైన సాధనంతో చేతకానివాడు చేసేపనికంటే మేలుగా చేస్తుంది పనికిరాని సాధనంతో పనివాని చేయి. చేయి మంచిదికాకుంటే, సాధనాలు వాడటం మొదట నేర్పాలి దానికి. ఆతర్వాత వెదుక్కోవచ్చు దానికి తగిన సాధనం. పనితనం లోపించినప్పుడల్లా చేయవలసింది కొత్తసాధనాలు వెతకటం కాదు; వున్న సాధనాలకూ, సాధకులకూ తగిన పొందిక సమ

మార్చటం. సాధనమే వాడలేని చేయి కొత్త సాధనం వాడటానికి అసలే తగదు. ఇక్కడే మన సంస్కర్తల కష్టాలకు అంకురార్పణం. అందరి చేతులూ పట్టుకో కలసిం దని తాము నిర్ణయించుకున్న, ధగధగలాడే ఆ సాధనాల వెలుగు చీకట్లు కొలిపితే, పాపం, వాళ్లు నీడలోని చేతుల్ని చూడలేకపోతారు. సాధనాలూ, విధానాలూ వాటంతట అవే — వాటిని వాడే వ్యక్తుల సంబంధరి లేకుండానే—ప్రపంచాన్ని సంస్కరించగలిగే లాగుంటే, ఈపాటికి ఏనాడో భూలోకం స్వర్గమై వుండేది...

కాని, అనుకున్నది ఒకటి; అయివున్నది ఒకటి...

కైలుగోడలు మాత్రమే దొంగమనసు మార్చి వట్టు ఎక్కడా చెప్పకోలేదు. స్థూలదృష్టికీ, సంకుచిత భావాలకూ అక్షరాస్యతే ఔషధం అని నమ్మేరోజులు రాలేదు. తన్ను వాడే చేతి గౌరవం తనదేనని మోగే ఉపకరణం అడ్డంకికాని, ఉపకారి కాదు. అంచేత, మొట్టమొదట వెనుకనీడలో వున్న చేతిని నమ్మి, గౌరవించి, ఆపిమ్మట దానికి సాధన మిద్దాం; సంస్కరణల్నీ, విధానాల్నీ అమల్లో పెట్టేముందు వాటికి సంబంధించిన, అవి వుపకరించవలసిన వ్యక్తుల భావాల్నీ, సామర్థ్యాల్నీ గుర్తించి గ్రహించుకోకుండానే వాటిద్వారా రాబోయే మేళ్లకోసం ఎదురుచూడటం వెర్రితనం.

మానవశిల్పి బ్రహ్మయైనచో—



వి దు ల

[ఏకాంకిక]

= శ్రీ ఘట్టి లక్ష్మీనరసింహశాస్త్రి =

— పాత్రలు —

సంజయుడు	—	సౌవీర దేశపు రాజు
విదుల	—	సంజయుని తల్లి
భాగ్యవతి	—	,, భార్య
ప్రభంజనదాసు	—	,, ఆస్థానకవి
వీణాదాసు	—	ప్రభంజనదాసు శిష్యుడు
విదర్భరాజకుమారుడు	—	విదుల శిష్యుడు
దుర్జయుడు	—	భాగ్యవతి అన్న

సింధురాజు, మంత్రి, ప్రాతిగామి, భటులు

౧-వ దృశ్యం

[ఉదయం. బాలభానుడు తన రాగాన్ని స్వచ్ఛం చేసుకొంటూ, క్రమక్రమంగా యౌవనం పొందుతూ న్నాడు. వనలక్ష్మి అంతకంతకు రమణీయత్వాన్ని గడిస్తోంది. సరోవరంలో వికసించిన తామరపూలలోని మకరందం ఆస్వాదిస్తూ మధుకర దంపతులు అమృతగానం సాగిస్తూన్నాయి. లేడిపిల్లలు ఇటూ అటూ చెంగుచెంగున దూకుతూ ఉన్నాయి.

ప్రభంజనదాసు, వీణాదాసు గూఢచారుల వేషాలతో ప్రవేశిస్తారు.

ప్రభంజనదాసు సౌవీరరాజకుమారుని ఆస్థాన కవి. వయస్సు నలభైయేళ్లు. వీణాదాసు ఆతని శిష్యుడు. ఇరవై యేళ్లవాడు.]

వీణా—(తలపాగా తీసి, పిలక సవరించుకొంటూ) గురూజీ!

ప్రభం—ఇంకేం గురూజీ? ఆ ఆశ్రమం దాటిపోయింది.

వీణా—పోయి?

ప్రభం—వానప్రస్థం.

వీ—పోనీండి. వనసౌందర్యాన్ని పరామర్శిస్తారు.

ప్ర—అలాగే మరి. యౌవనంవా, వనంవా.

వీ—ప్రకృతిపరామర్శ, వర్ణనే కదా మీకు కావాలిసింది?

ప్ర—ఇదుగో, ఈనాటి కీ ప్రకృతి ఇలా పరామర్శిస్తోందిగదా!

వీ—బోలెడు కవితావస్తువు.

ప్ర—చేపా, జెల్లా దొరకడం లేదు.

వీ—రసంలో మునిగి తేలే మహాకవులు ఊరుకుంటారా?

ప్ర—రసం ఎక్కువైతే ఇప్పటివాళ్లు భరించలేరు. అందుకనే పెళ్లి లేనివాళ్లకి పెళ్లి చేయించి పాతి

ప్రశస్త్యం చేర్చుతూన్నారు. అదీగాక, రసం, ప్రకృతాన భోజనశాలల్లోకి పాకింది.

వీ—అలంకారా లున్నాయిగా లోలెడు ?

ప్ర—శబ్దాదిగుణాల అలంకారాలను ఇప్పుడు స్త్రీలుకూడా అభినందించడంలేదు. ఉపమా అప్పటి కప్పుడే తయారుచేయాలికదా !

వీ—అయితేమాత్రం ఛందస్సు కుంటుపోతుందా?

ప్ర—ఎందుకు పోతుంది? ఛాందసులు ఉసుళ్ల లాగా దేశమంతా మూగిఉన్నారుగా.

వీ—రీతులు సరిగా ఉంటే సరి.

ప్ర—రీతులు శయ్యలోనే.

వీ—చక్కటి సంస్కారం ఉన్న వ్యక్తికి లోటేమిటి గురూజీ?

ప్ర—కేశాలనమాత్రమే మిగిలింది అది.

వీ—పోనీండి. నవలల పాటి చేయరా ?

ప్ర—నవలలైతే లేందేం? నిట్టనిలువూ డబ్బే.

వీ—ఏమో, మరి నిరుత్సాహంగా మాట్లాడు తూన్నారు మహాకవులు !

ప్ర—ఆదరించే రసికులు పాడైపోయింతరవాత నిరుత్సాహం కాదా మరి ?

వీ—అదేమిటి గురూజీ! అనేకమంది రసికు లుంటేను !

ప్ర—లేల బొమ్మలు కట్టింది, నీబోటి ఆషాఢ భూతులతోను, వాళ్లబోటి శ్రావణభూతులతోను.

వీ—మన రాజాశ్రయం తిరిగీ మనకు అలభ్య మంటారా?

ప్ర—దైవానుగ్రహ మెలా ఉందో! మావాళ్లు నాకు పెట్టిన ప్రభంజనదాసనామం సార్థకం చేసు కొంటూ, పట్టణాలకు పట్టణాలు, పల్లెలకు పల్లెలు, అడవులకు అడవులు, రాత్రనక పగలనక కాలీచపోయే లాగు తిరిగాంగదా ! సంజయమహారాజు జాడ కించిత్తైనా తెలీలేదుగదా! మూర్తీభవించిన శౌర్య రసం అముపలితల్లి యే అగచాట్లకు లోనయిందోగదా! గాలికి కందిపోయే బంగారపు శరీరంతోటి ఆ భాగ్య వతీదేవి భాగ్యం ఏచెట్టుకింది కాపురానికి దోవ తీసిందోగదా! (నిట్టూరుస్తాడు.)

వీ—కాలమహిమ !

ప్ర—అందువల్లనే మామిళ్లు కూలేయి, జిల్లేళ్లు పెరిగేయి.

వీ—(పరికించి) నాకు కుడికన్ను అదురుతోంది గురూజీ! ఇవా శేకో శుభవార్త- బహుశా, వారి అచూకీయే కాబచ్చు-వినవస్తుందనుకుంటాను.

ప్ర—అంతకన్నా మరో అదృష్టమా!...... మనపాలిట పడి, మేతా నీరూ లేక, చెట్టుకు వేలాడ దీసి ఇగిరిపోతోంది, ఆగుఱ్ఱాని కాస్త మాలీసూ, దాణా వగైరా చూడు, పద.

వీ—మీరు ?

ప్ర—నే నిప్పుడే ఇలా పోయివస్తాను.

వీ—సరే. (నిష్క్రమిస్తాడు.)

ప్ర—(ముందుకు సాగుతాడు.)

(చంకన మంచినీటిబిందెతో భాగ్యవతి ఎదు రుగా వస్తుంది.

భాగ్యవతి రాజపుత్రస్త్రీ. సౌవీరరాజ కుమారుడు సంజయుని భార్య. యువతి. వల్కలాలు ఆమె చక్కని దేహానికి మరింత చక్కదనం తెస్తూ ఉంటాయి.)

ప్ర—(నడక ఆపి, భాగ్యవతిని ఎగాదిగా చూస్తూఉంటాడు.)

భాగ్యవతి—(అతన్ని చూచి, చకితురాలై, మెల్లని నడకతో తప్పుకుపోతూ ఉంటుంది.)

ప్ర—(గొంతు సవరించుకొని) అమ్మాయీ ! అవి మంచినీళ్లేనా ?

భా—(సంకోచంతో, గాభరాపడుతూ, ఆగీ ఆగని నడకతో) ఆ.

ప్ర—కాసిని ఇస్తావూ? నాలిక పిడచకట్టుకు పోతోంది.

భా—(ఆగి) ఆ తామరాకుతో ఒక దొన్నె చేసుకో.

ప్ర—(అటూ ఇటూ వెతుకుతూన్నట్టు చూసి, కూర్చొని) నా కామాత్రం ఓపిక లేదు. నీవే ఆ కాస్త పుణ్యమూ కట్టుకోందూ,

భా—(బిందె దించి, తామురాకుకోసం సరోవరంలోపుకు రెండడుగులు వేస్తుంది.)

ప్ర—(ఏగాదిగా పరికించిచూచి, తల ఊపుతూ) పోనీ, నీ కంత శ్రమ ఎందుకులే, నాకు కొంచెం దాహం తగ్గింది.

భా—(వెనుదిరిగి నీరసించినట్లున్నావు. దాహం తీర్చుకో.

ప్ర—తరువాత చూసుకోవచ్చును. తొందర లేదు...కాని, ఒక్క విషయం అడుగుతాను.

భా—(కలతపడి) ఏమిటది?

ప్ర—మరేం లేదు. నీ వెవరు?

భా—నాగోలి నీకెందుకు?

ప్ర—కావాలి.

భా—అనవసరం.

ప్ర—నీ కనవసరం కావచ్చు.

భా—ఒంటరిగా ఉన్న ఆడదానితో ఎందుకీ సంభాషణ?

ప్ర—నిష్కల్మషమైన సంభాషణతో ప్రమాదం?

భా—ఆచారానికి భంగం కాదూ?

ప్ర—అంతఃపురాల్లో ఉండవలసిన భాగ్యవతివిగా కనబడుతూన్నావు. ఈ అడవుల్లో ఇలా నీరు మోస్తూ ప్రవర్తించడం ఆచారానికి భంగం కాదూ?

భా—(విచారపడుతూ, ఆలోచనతో) దైవప్రేరణ.

ప్ర—సాక్షాత్తు దైవప్రేరణ కాదు. పురుషకారంకూడా తోడవుతుంది.

భా—(కళవళపడుతూ) చాలా ఆలస్యమైంది. పోతాను. (బిందె తీసుకుపోబోతుంది.)

ప్ర—(లేచి) ఇప్పుడే పోవచ్చును...మరి... ఇక్కడ నీకు తోడు?

భా—దైవం కూర్చినవాళ్లు.

ప్ర—అంటే?

భా—(చికాకుతో) ఇంత ప్రసంగంతో నీకేంపని?

ప్ర—అది నీ అంతట నీకే తెలుస్తుంది.

భా—యాచక బ్రాహ్మణుడులాగా దాపరించావు. చాలు పద.

ప్ర—యాచన పూర్తికాందే, పోవడమెలాగా?

భా—నేనే దొరికానా?

ప్ర—ఈ అడవిలో మరోమనిషిపురుగు కనపడడం లేదు.

భా—అనేకమంది మును లున్నారు.

ప్ర—వారు నీ చెప్పుచేతల్లో ఉంటారా?

భా—నేనే వారిని తల్లిదండ్రులుగా భావించి సేవిస్తున్నాను.

ప్ర—అంటే నీపోషణ వారి దన్నమాట?

భా—(రాజసంతో) నాభర్త ఉండగా పరాయిపోషణతో నాకేం అవసరం?

ప్ర—ఓహో! నీభర్త అంతవాడా? అయితే, నీకులం?

భా—(విక్షోభపడుతూ, చెప్పలేక) క్షత్రియులం.

ప్ర—(ఆలోచించి) సరిసరి. అయితే, నీకు పరిచారిక లేరి?...పొరపాటు...నేనే పరిచారికగా ఉన్నానన్నావుకదూ?

భా—(రోషించి) క్షత్రియకులక్రమాచారానికి అమర్యాదగా మాట్లాడుతూన్నావు. జాగ్రత్త.

ప్ర—క్షత్రియకాంత అంతఃపురంలో ఉన్నప్పుడు కులం, క్రమం, ఆచారం కాని అడవులపాలైన తరవాత కుల మేమిటి? క్రమ మేమిటి? ఆచార మేమిటి? దానికొక అమర్యాదకూడానా?

భా—కూటికి పేదయితే కులానికి పేదా?

ప్ర—కాకపోవచ్చు. పేదపడ్డప్పుడు?

భా—ఉత్తములైనవారు ఎక్కడుంటే నేం? ఎలాంటి దశ అయితే నేం? తమ ఆచారాన్ని అన్నివిధాలా కాపాడుకుంటూనే ఉంటారు. ఆపదలు సంభవించినా తమ స్వభావాన్ని పోగొట్టుకోరు.

ప్ర—మానవత్వం ఉన్నవాళ్ల ధోరణి అది.

భా—కాలం ప్రతికూలం అయినప్పుడు కొన్ని కొన్ని వైభవాలు పోవచ్చును.

ప్ర—నాబోటివాడి తోడ్పాటువల్ల తిరిగీ వాటిని సంపాదించుకోవచ్చుగదా?

భా—మే మనాథల మయినప్పుడుగదూ?

ప్ర—కాక మరేమిటి? తవుడు తింటూ, పళ్ల పొడి పోశేదే అన్నట్టున్నది నీధోరణి.

భా—(రోషంతో) ఏం మాట్లాడుతూన్నావో, ఏం చేస్తున్నావో గుర్తించావా?

ప్ర—నీదురవస్థతో బాటు అన్నీ చక్కగా గుర్తించాను... సరేకాని, నీ మగడు, ఆ సంజయుడు కాడుగదా?

భా—(చకితురాలై, కళవళపాటుతో) ఆయ నెవరు?

ప్ర—ఆయన కాదు, అతడు, పొరబాటు-అతిగాడు హుష్ అంటే పిల్లకాకిగూడా లేవని ఒకానొక అప్రయోజకచక్రవర్తి. ఒక్కమాటలో—నిర్భాగ్యదామోదరుడు.

భా—(సంభ్రమవిషాదాలతో) ఏం చేశాడు?

ప్ర—ఛీ. ఛీ. నోటివిరాదుగా ఉచ్చరించరాదు. శృంగారంలాంటి రాజ్యలక్ష్మిని శత్రువులపాలు చేసి, వీరపత్ని, వీరనారీశిరోరత్నం, వృద్ధు, ఆ విదులామహాతల్లితోనూ, అవతరించిన శౌర్యరసం, క్షత్రియకులాభరణం అయి, పూర్వపాపఫలితంగా అతడి భార్య అయిన ఆ భాగ్యవతితోనూ, వద్దంటూన్నా వినక, వెన్నిచ్చి, యుద్ధంలోంచి కాలికి బుద్ధిచెప్పేడు. ఆ నీచుడు, భూభారంకోసం, ఇంకా బ్రతికే ఉన్నాడో యేమో! ఈ చెవులకు అలాంటి వార్తనుకూడా వినే దౌర్భాగ్యంకూడా ఉంది కాబోలు! రామ! రామ! (చెవులు మూసుకుంటాడు)

భా—(రోషవిషాద సంభ్రమాలతో కలతపడుతూ, బిందె తీసుకుపోబోతుంది)

ప్ర—మరోమాట. ఆపదగదా అని అడుగుతూన్నాను. ఆపదలో ఆదుకున్నవాడే తనవాడు. ప్రస్తుతం మీగతి?...

భా—ఆదుస్తావా తీరుస్తావా? పరాయివాడివి, నీ కెందుకది?

ప్ర—పరాయివాడు తనవాడు కావడం ఎంత సేపు? నీ మగడు నీవాడేనా?...

భా—(రోషంతో) ఆఁ. నాఎదుట నామగని అలాంటివాడుగా నిందిస్తావా?

ప్ర—చేతకాక అయిదు పది చేసి క్షత్రియకులానికి కళంకం తెచ్చిన పంద నిందార్హుడు కాడా?

భా—(రాజసంతో) కాడు. పురుష ప్రయత్నాలకు దైవం తోడుపడాలి.

ప్ర—పురుషుడైనవాడికి పురుషప్రయత్నం.

భా—నామగడు నిరుత్సాహి కావచ్చు. అంతమాత్రాన క్షాత్రం లేని బడుగు అనుకున్నావా?

ప్ర—అక్షరాలా. కనీసం, కట్టుకున్న ఇల్లాలినైనా సుఖపెట్టలేక, అడవులపాలైన రాజు రాజా వాజా? ఇలాంటి అధముడికి ఆలి అయ్యేకన్న బలవంతుడికి బానిస అయింది మేలు. (మీసం మెలివేస్తూ) చూచావా? నన్నూ, నా...?

భా—(కోపించి) ఛీ! దుర్మార్గుడా! పతివ్రతయైన కులాంగనకు అవమానం తలపెట్టి మట్టిలో గలిసిపోకు.

ప్ర—తాటాకు చప్పుళ్లకు కుందేళ్లు జడవవు. చేత కాని నీపాతివ్రత్యం నన్నేం చేస్తుంది? (సమీపిస్తూ) ఆ అప్రయోజకుడితో, ఆ జీవచ్ఛవంతో తెగతెంపులు చేసుకొని నాఅండ చేరు. ఈదౌర్భాగ్యం తొలగి భాగ్యవతి వవుతావు.

భా—(రోషవిషాద సంభ్రమాలతో) పాపాత్ముడా! పాడునోటితో నా భాగ్యవతీనామధేయాన్నికూడా అపవిత్రం చేస్తున్నావు. క్షత్రియకాంతకు అవమానం తలపెట్టిన నీకండలు కాకులు తింటాయి.

ప్ర—ఇశ్. ఫరవాలేదు. రథం తెప్పించనా? ఏనుగంబారీ తెప్పించనా? తొందరగా చెప్పు. ఆపైకి పంద పొత్తున భ్రష్టురాలివి కాబోకు. ఏం?

భా—(రోషంతో రోజుతూ, బిందె చంక నెత్తుకొని చరచరా పోతూ ఉంటుంది.)

ప్ర—(అడ్డం పోయి) ఆలోచించుకో. నరకకూపంలో కూలబోతూన్నావు. నీకు ఆరుమాసాలు గడువిస్తూన్నాను. వెనుకముందులు బాగా విమర్శించి నన్ను వరించు. లేదా ఆ నీచుడితో బాటు అధోగతి అనుభవించు.

ధా—(కోపంతో దారితప్పుకొని వెళ్లిపోతుంది.)

ప్ర—(ఆమెనే చూస్తూ వెళ్లిపోతాడు.)

౨-వ దృశ్యం

[అడవిలో ఒక పర్ణశాలవాకిట తుక్కుమలక మంచంలోపడి సంజయుడు మూలుగుతూ ఉంటాడు.

సంజయుడు నడికారువాడు. కొంచెం బక్కచిక్కి ఉంటుంది దేహం. దర్శనీయమైన రూపసంపద. రాచఠీవికి తగిన మీసం.

విదుల ప్రవేశించి మంచందగ్గరగా కూర్చుంటుంది.

విదుల వార్ధకంలో పడ్డది. వితంతువు. వీరనారీత్వం ఆమెముఖంలో ప్రస్ఫురిస్తూ ఉంటుంది. ఆమె నేత్రాలలో రాజసం ప్రజ్వలిస్తూ ఉంటుంది.]

సంజ— (విదులను చూచి, దీనస్వరంతో) అమ్మా! పాకమయిందా ?

విదు—ఉత్సాహం లేని అబలలకు పాకమెట్లా సమకూరుతుంది సంజయా!

సంజ—విదులామతల్లీ! నన్నెందుకిలా బాధపెడతావు ?

విదు—నీకేంబాధ ? మగపాడి లేని నీవంటి వ్యక్తిని గన్న నాకుగాని.

సం—అబ్బ! కనికరం లేని యీ వాక్శరాలతో నాహృదయం తూట్లు వేసి నీవు చేయగలదికాని, నాచేత చేయింపగలది కాని ఏమిటమ్మా ?

వి—ఛీ! నిన్ను నాకొడుకునుగా సృజించడానికి బ్రహ్మకుకూడా బుద్ధిలేకపోయింది కాబోలు! నాలుగు తలలూ, ఎనిమిది కళ్లూ ఉన్నాయే అతడికి? నాపోలికగాని, నాతండ్రిపోలికగాని, నీతండ్రిపోలికగాని, నీతాతపోలికగాని అతడికంటికే, బుద్ధికీ ఎక్కలేదు గాబోలు !

సం—నాపోలిక నాది.

వి—అవును, పాసిపోయిన జీవచ్ఛవం.

సం—ఏం చేయమంటావు తల్లీ! రోజు లివ్వి.

వి—(విసుగుతో) చచ్చినదాకా నిరాశతోనే ఉండి ఏం పురుషార్థం సంపాదించగలుగుతావురా అప్రయోజకుడా ?

సం—ఇందులో నాదోషం?

వి—నీదోషమా ? చావక బ్రదికి ఉండడం; బ్రదికి ఉండి శత్రువులను బాగుచేయడం.

సం—అయితే యిప్పుడు నన్నేం చేయమంటావు ?

వి—'ఉత్తమక్షత్రియకులంలో పుట్టి అధమస్థితి ననుభవిస్తున్నాను' అని గట్టిగా అనుకో. భయపడకు. మనస్సును బాగుచేసికొని గట్టిపఱచుకో. ఆవేశం పొందు. లే. శత్రువుల కానందం, బంధువులకు శోకం కలిగిస్తూ యిలా తుక్కుమంచంలో పడి చావకు. ఎలుకదో పిల్లివలె నీబోటి అల్పుడి మనస్సు చాలా చిన్నది. స్వల్పంతోనే నిండిపోతుంది. పాముకోరవారిన కుక్కలాగా చావకు. చచ్చేటప్పుడుగూడా పరాక్రమించు. డేగలాగా శత్రువులను వెదకుతూ తిరుగు. కాని, పీనుగులాగా పడిఉండకు. షండత్వాన్ని మోయకు. ఉత్తమ, మధ్యమ, అధములలో ఉత్తమశ్రేణిని సంపాదించి, నీపౌరుషాన్ని ప్రపంచానికి ప్రకటించు.

సం—(భయం, ఆశ్చర్యం చూపిస్తూ) ఈమాటలన్నీ నాకే ?

వి—(అసహ్యంతో) నీమొహం చూస్తూ ఎలా మాట్లాడేదిరా నీచుడా? ఈకృపణదశ ననుభవించేకన్న చనిపోవడం మేలురా షండా!

సం—మాటిమాటికీ అదే చెబుతూన్నావు. ఏం చేస్తాను?

వి—తుమ్మకట్టెలాగు కొంచెంసేపైనా బాగా మండాలి. ఊకలో నిప్పులాగు చాలాసేపు పొగరాజి ఏం ప్రయోజనం? చీమిడి తిని వేయేళ్లు బ్రదికి కాకి ఏం సాధిస్తోంది ? దివ్యమైన రాచపుట్టుక పుట్టిన కోడెగాడు పౌరుషవంతుడై, తల్లిదండ్రుల ఋణాలు తీర్చుకొని కృతార్థుడవుతాడు. లాభాలాభాలను గూర్చి మీనమేషాలు లెక్కపెట్టడు. అహర్నిశలూ ముందుపనినే ఆలోచిస్తూ, సందు దొరకినప్పుడు విక్రమిస్తాడు. కాని, నీలాగా ప్రాణమే ధనమనుకొని యిలా కాలెం

తలాగు పడిఉండడు. ధర్మం పురస్కరించుకొని పరాక్రమించి విజయం సంపాదించు. కానివాడు ముక్కు మూసుకొని పాదుగడియలు నిరీక్షించు.

సం—అప్పుడా నీకు మనశ్శాంతి?

వి—అవును. ఎవని ప్రవర్తనను గురించి లోకం అద్భుతంగా చెప్పుకోదో, తపోదాన యజ్ఞ విద్యా విక్రమ సంపదలచేత ఎవడు సర్వాధికుడు కాడో, వాడు స్త్రీగాదు, పురుషుడూ గాదు. తల్లి కడుపు చీల్చడానికీ, జనాభాలెక్క పెంచడానికీ పనికివచ్చే ఒక మొద్దు అనవచ్చు.

సం—కాలానికి తలఒగ్గాలిగదా తల్లీ!

వి—అబ్బ! నీ నిరుత్సాహాన్ని చూచి నీ తోటి రాజపుత్రులు, బంధువులు ఎంత నవ్వుతూన్నారో కదా! కొంచెమైనా విచారం లేదే! (మనస్తాపంతో) ఏసీమంతినీకూడా చాలాగా నీలాంటి నిర్భాగ్యుణ్ణి కనకుండెదుగాక. (కంట నీరు గారుస్తుంది.)

సం—(సంభ్రమంతో లేస్తూ) అమ్మా!

వి—(సామంగా) తండ్రీ! పుత్రకా! నామాట విను. హృదయం రాయిచేసుకొని, చచ్చినా సరే, తల చినపుడెల్లా, నిమిషంగానీ అరనిమిషంగానీ, సరిపడని వారి గుండెలు అవిసిపోయేలాగు శత్రువుల నెత్తిన భగ్గున మండిపడు. నీకు తప్పక జయం కలుగుతుంది. లే. త్వరపడి ఉత్సహించి, లే. ఇదుగో, ఆయుధం. తీసుకో. పో. పరాయిమూకను చీల్చి చెండాడు. (ఆయుధం చేతి కందీయబోతుంది.)

సం—(దీనంగా) ఎంత రాతిగుండెదానవమ్మా! నేను నీకంట బడనినాడు, లోకంలోని సర్వసంపదలూ నీకైవసమయినా, ఏం ప్రయోజనం?

వి—ఓరి మందబుద్ధీ! భృత్యులూ, పరివారాలూ లేక, పరులుపెట్టే పిండాల కాశపడి, సత్తువలారి బ్రదికేవారి దారి విచారించకు. పండిన చెట్టును పక్షుల్లాగా, యావత్ప్రపంచం నిన్నాశ్రయించి బ్రదికే బ్రదుకు సంపాదించు. తన చేతుల బలంమీద బ్రదికే పురుషు డిహపరాలు సంపాదించి, శాశ్వతకీర్తి గడిస్తాడు.

సం—అట్టి యోగ్యత నాకున్నదా?

వి—లేకేం? ఉత్సాహం తెచ్చుకొన్ననాడు అన్ని అడుగులూ ఏనుగుఅడుగులో లాగు అన్ని శక్తులూ నీలో ఇమిడిపోతాయి. విక్రమక్రమానికి తగినట్టు తన తేజం ప్రకాశింపజేయక, పరాయీలకు వెరచి, ప్రాణాలమీది తీపితో, ఒదిగిఉండే క్షత్రియుడు దొంగకంటే కనిష్ఠుడుసుమా.

సం—అమ్మా! ఉత్సాహం తెచ్చుకుంటే వస్తుందా?

వి—ఓరి మూఢుడా! (విచారంతో) ఏం చేయను? చావబోయేవాడికి మందు మాదిరిగా నా వాక్యాలు నీపట్ల పనిచేయడం లేదు. ఇంతకూ నాకడుపు.........

సం—తల్లీ! నాకడుపూ మండిపోతోంది. అదేమాత్రమూ ఆలోచించవు.

వి—(కోపించి)ఛీ! అనామకుడా! ఎంగిలిపిండాల మెతుకులతో కాకుల కడుపుమంట చల్లారుతోంది. కూరాధికూరుని కన్నకూతురు, ఉత్తమక్షత్రియునికన్నకోడలు, భాగ్యవతి, కన్నీరు కారుస్తూ వండిపెట్టే పిండానికి నీకడుపుమంట ఎదురుచూస్తోంది. రాజ్యం శత్రువులపాలు చేసి యీదశ ననుభవించే నీవు నా కొడుకువా? ఛీ! ఛీ!

సం—అమ్మా! అమ్మా! కోపంతో దేహం మరిచిపోకు. నేను మరీ దిక్కులేక......

వి—నీశ్రేయస్సు గోరి ఒకమాట చెబుతాను. విను. రాజనీతి రెండువిధాలు. శత్రువు బలహీనుడుగా ఉన్నపుడు అకస్మాత్తుగా వానిపై బడి వశపరచుకోవడం ఒకపక్షం. ఉత్సాహశక్తి కలవాడు ఎప్పుడైనా దండెత్తి తన క్రియాశక్తిని ప్రకటించి పగ సాధించుకోవచ్చు. అది మరోపక్షం.

సం—అయితే?

వి—మన విరోధి సింధురాజు ప్రకృతం బలహీనంగా ఉన్నాడు. అతని సామంతులే అతనికి వ్యతిరేకులుగా ఉన్నారు. ఆసంగతి నాకు తెలుసు. పోనీ, అలాకాదు, అతడేమీ ముసలితనం లేకుండా, శిలగొట్టుకొని ఉంటాడా? అప్పటికన్న ఇప్పుడు దుర్బలుడై ఉండడా?

సం—ఉండొచ్చు.

వి—కాబట్టే, నిండు ఉత్సాహం తెచ్చుకో. ప్రళయరుద్రుడుగా విజృంభించు. మృత్యుదేవత నాలుకలాగు నీ నిశితకరవాలం తాండవింపజేయి. తెగినసహాయసంపత్తి కూర్చుకొని విరోధిపై పడి కొదమసింగంలాగు వీరవిహారం చేయి. నీతండ్రిపేరు, నీపేరు నిలబెట్టుకో. నాకడుపుకు వన్నె తీసుకురా. భాగ్యవతి నిజంగా భాగ్యవతే అనిపించు. లేనివాడు ఈ కుక్కిమంచంలో మురిగిచావు.

సం—(భయంతో, దీనంగా) అమ్మా! నీనోటి మీదుగా అలా అనకు.

వి—అంటే దోషం లేదు. కులం, శీలం, విద్య, బలం అన్నీ ఉండి, యెద్దులాగా సర్వం వహించవలసిన నీలాటివాడు నిరుత్సాహియై తప్పుచేయడం చావడంతో తీసిపోదు. రణరంగంలో నిలబడి, అసహాయుడై, శత్రువును చీల్చి చెండాడిన మహావీరుణ్ణి రాజ్యలక్ష్మి వరిస్తుంది. కూలిపోతాడో, ఇంద్రుడు పాదపూజ చేస్తాడు. లే. శత్రుశలభాలమీద చిచ్చఱపిడుగులాగా పడు.

సం—(చేతులు చాచి చూచుకుంటూ) అమ్మా! ఈచేతుల్లో ఆమాత్రం బలం ఉందా?

వి—లేకేం? నీతల్లి, నీతండ్రి క్షత్రియకులానికి అలంకారాలుగాని, అంగారాలు కారు. (విచారపడుతూ) కుమారా! నీ తండ్రిగాని, నేనుగాని అడిగినవాడికి లేదనడం కద్దా? ఈనాడు ... (కన్నీరు తుడుచుకుంటూ) నీభార్య, నేను కూటికీ గుడ్డకూ లేక, అడవుల్లో అలోలక్ష్మణా అని అంగలారుస్తూంటే చూస్తూ ఊరుకున్న నీవిప్పుడు బ్రదికిఉన్నవారి లెక్కలో లేవు. మన నాశ్రయించినపరివారం, దిక్కూ మొక్కూ లేక, ఏ మారుమూలనో దేవురలాడుతూంటే రక్షించలేని మన బ్రదుకు తగలెయ్యనా?

సం—అమ్మా! ఎవరి కర్మ నెవరు తప్పిస్తారు?

వి—(రోషంతో మండిపడుతూ) ఛీ! ఛీ! ఛీ! నిష్ప్రయోజకుడా! మగపాడి లేని నీమొహం ఇహ చూడలేను. (చేతులతో మొహం కప్పుకొని విచారిస్తూ) నీవు నాకొడుకువు కావు. ఈపర్ణశాలవాకిట నడుములు విరిగిన బక్కకుక్కవు.

సం—(బ్రతిమాలుతూ) అమ్మా! అమ్మా! అంత ఆగ్రహించకు. భాగ్యవతి వింటుందేమో!

వి—(మరింత రోషంతో) వినుగాక. తప్పక వినాలిసిందే. సంజయా! పూర్వం సౌవీరకన్యలచేత కీర్తింపబడ్డ నీవు ఇప్పుడు సింధుకన్యల అపహాస్యాల పాలు గాకు. జీవితసంశయమైనప్పుడు ఎదురుదిరిగి పెనగాలికాని, ఒంగి తప్పించుకొని బ్రదకరాదు. మన వంశంలో ఒకని నాశ్రయించి తిరిగినవాడు లేడు. నీ విట్టి కుక్కబ్రతుకు బ్రతకకు. అసహాయుడవైకాని, ససహాయుడవైకాని విక్రమించి యశ మార్జించు.

సం—అమ్మా! నీహృదయం ఉక్కుతో పోతపోసిం దనుకుంటాను. నీరాజనీతి ఎంత బాగున్నదమ్మా! సవతికొడుకునులాగు నన్ను యుద్ధంచేసి చావమంటున్నావు. కడుపున కన్న కొడుకుకు తల్లి ఇచ్చే ఉపదేశమేనా ఇది? నే చచ్చిన తరువాత ఈ రాజ్యభోగాదులవల్ల నీవు బావుకొనేదిమాత్ర మేమిటి?

వి—అవును. నాహృదయం అయోమయమే. నీమీది ప్రేమకు దానిలో తావులేదు. పిరికిపందవై పిక్కబలం చూపించిన నీకు నీతిమార్గం ఉపదేశించి బాగుచేయలేని నాప్రేమ గాడిదప్రేమ గాదూ? ధర్మార్థకామాలకు సంబంధించిన సత్వృత్తం నీలో ఉందో, నీమీద ప్రేమ నాకెందు కుండదు? అభ్యుదయం లేక దుర్బుద్ధి అయిన అల్పుణ్ణి కొడుకనీ, మనుమడనీ ప్రేమించేవారి ప్రేమ వ్యర్థంసుమా.

సం—ప్రేమ లేకపోతే లేకపోయింది, నన్నిలా బ్రదకనీ తల్లీ!

వి—(ధీరతతో) వీలుపడదు. బ్రదకనీయను. క్షత్రియుడు యుద్ధం చేయడానికే జన్మిస్తున్నాడు. విజయం అతని సొమ్ము. ఏమగు చచ్చినా బ్రదికినా వెయ్యినాళేలు. విధివశాత్తు యుద్ధంలో చచ్చినా, బ్రదికినా ఉత్తమక్షత్రియుడు లోకపూజితు డవుతాడు. పరిభవానలంతో తగులబడుతూఉన్న నీబోటి నడపీనుగకు అతన్ని చూచే హక్కుకూడా లేదు.

సం—అమ్మా! చచ్చినవాణ్ణి ఎందుకీలా మరింత చంపుతావు? నమస్కరిస్తాను. శాంతించుతల్లీ. (నమస్కరిస్తాడు.)

వి—(రోషంతో చివాలున లేచి) ఓరి పశువా! దేశద్రోహీ! ఇప్పటికైనా నీమనస్సు తిరగడం లేదు. పోనీ... ఇది నీకు అనుకూలమైన కాలంగా తోస్తోంది. తప్పక జయం కలుగుతుందనే నానమ్మకం. నా వామ భాగం అదే సిద్ధాంతీకరిస్తోంది. సర్వశత్రుసంహారం చేసి నేను నీకు పట్టం కట్టగలను. నాకు అనుమతి ఇయ్యి.

సం—(మంచంలోంచి ససంభ్రమంగా లేచి నిలబడి, తల్లి చేతులు పట్టుకొని) అమ్మా! అమ్మా!

వి—(మాట వినిపించుకోకుండా) స్త్రీకి స్వాతంత్ర్యం లేదుకాబట్టి, నేను నీభరణపోషణలలో ఉన్నానుకాబట్టి నీఅనుమతి వేడుకోవలసివొచ్చింది. కాదో, మగవాడివికాని నీఅనుమతితో నాకేంపని? ఇప్పుడే పోతున్నాను. పదేనను. అనవా? నాలాంటి దానిని నీలాంటి దేశ అధికారంలో పడద్రోసిన దైవాన్నికూడా ఎదిరిస్తాను.

సం—(విచారించి, నూతనోత్సాహం ప్రకటిస్తూ) అమ్మా! నాకు విజయం ఎలా కలుగుతుందో, సహాయసంపత్తి ఎలా సమకూరుతుందో సెలవీయి తొందరగా సెలవీయి.

వి—కుమారా! రాచతేకం రోమరోమంలోను నిండించుకొని ఉత్సాహశక్తితో విజృంభించు. వెనక ముందులు చూడకు. శత్రువులమీద పెబ్బులిలాగా పడు. విక్రమించు రాజసింహునికి సహాయసంపత్తి తనకుదానుగా సమకూరుతుంది. మనకు కావలసినంత ధనమున్నది. నాకు తెలుసును. లేదో, నేను సంపాదిస్తాను. లే. ఇదుగో, ఆయుధం. నీకు ముమ్మాటికీ జయం కలుగుతుంది. పద. వైరిమారణహోమానికి గుండం త్రవ్వించు. శౌర్యాగ్ని ప్రజ్వలింపజేయి.

సం—(ససంభ్రమంగా ఆయుధం అందుకొని, పాదాభివందనం చేస్తూ) విదులామహాతల్లీ! శూరమాతా! ఆజ్ఞ!

వి—(ఆనందం, రాజసం వెలువరిస్తూ) పుత్రకా! పోయి జయలక్ష్మితో సహా వచ్చి నాకన్నుపండువు చెయ్యి. (ఆశీర్వదించి, లేవనెత్తి, ఆలింగనం చేసుకొంటుంది)

సం-(రోషంతో, సాయుధుడై వెళ్లిపోతాడు)

వి—(సంజయుడి దోవనే చూస్తూ సగర్వంగా) ఈనాటికిగదా నాకోడలు సౌభాగ్యవతి! ఇదే రాచ పుటుక! (నిష్క్రమిస్తుంది)

3-వ దృశ్యం

[యుద్ధభేరీభాంకారాలు చెవులు గింగురుమని పిస్తూంటాయి. కాహళాలు, పటహాలు దిక్కులు బ్రద్దలు చేస్తూంటాయి. సేనాకలకలం చెలరేగుతూ ఉంటుంది.

సమీపంలో డేరాలో సింధురాజు మంత్రితో యుద్ధాలోచన చేస్తూంటాడు]

సింధురాజు—మంత్రీ! సౌవీరరాజకుమారునికి ఇంత సాహసం ఎలా కలిగిఉంటుంది?

మంత్రి—అనేకదండయాత్రలు చేసి, శత్రువులను ముప్పతిప్పలు పెట్టి మూడూళ్ల చెరువుల నీళ్లు తాగించిన సింధుసార్వభౌములే యిలా ప్రశ్నిస్తే.. ?

సిం.రా—కత్తి చేతబట్టలేని పిరికికండ, అసహాయంగా తలపడి, నన్ను యుద్ధానికి పిలవడమా!

మం—ఏమాశ్చర్యం ? ఉత్సాహశక్తిలోని గొప్పతనం మీకు కొత్త కాదు. అతనికి తన నిశితకరవాలంకంటే వేరు తోడుకూడా అక్కరలేదట.

సిం.రా—మనకు పరమశత్రువే అవుగాక - సంజయుడు క్షత్రియకులాభరణం అంటాను.

మం—నిస్సంశయంగా.

సిం.రా— (ఆలోచించి) మంత్రీ! ఈతనికీసమయంలో సహాయంసమకూరిందో, ఫాలాక్షునికైనా అజయ్యుడే అవుతాడు.

మం—దానికి తగిన బందోబస్తు చేయించాను. సౌవీరదేశానికీ, మన సింధుదేశానికీ సరియైన రాకపోకలు లేకుండాచేయించాను. నదుల వంతెనలు కూల్పించాను, రోడ్లు తెగగొట్టించాను.

సిం.రా—అక్కడక్కడా మజిలీలలో మన గూఢచారులు శల్యసారథ్యం చేయడం అవశ్యం సుమా.

మం—అన్ని యేర్పాట్లూ చక్కగా చేయించాను. ఇహ నాతని బలం దైవంమీద ఆధారపడి ఉంది.

(బలాల అలజడి వినిపిస్తుంది)

సిం.రా—(ఆలకించి) ఏదో భయంకరమైన కలకలం వినవస్తోంది. మన పక్షంనుండే అనుకుంటాను. విను.

మం—(వింటూంటాడు)

ప్రాతిగామి—(ప్రవేశించి) సింధుసార్వభౌమా! ఈనాటి యుద్ధం అపూర్వం. సౌవీరకుమారుడు మధ్యాం దినమార్తాండుడులాగా ప్రతాపంతో మండిపడుతూ న్నాడు. గజబలం చాలావరకు నశించిపోయింది. పదాతులలో నిరుత్సాహం అంకురిస్తోంది.

సిం.రా—మన యువరాజా?

ప్రాతి—యువరాజా ఒక్కడే సేనను కూడ గట్టుకొని అభిమన్యుడిలా పగవారికి సమాధానం చెబుతూ న్నాడు.

సిం.రా—సరే. ఈనాటి సంజయుని బలం?

ప్రాతి—ఎవరో తెలీదుగాని, ఇద్దరు చక్రరక్షకులుగా ఆతనిని వెన్నంటి యుద్ధరంగంలో వీరవిహారం చేస్తూ న్నారు.

సిం.రా—ఆచూకీలు తెలీవా?

ప్రాతి—లేదు. మారువేషాలేమో అనిపిస్తోంది. సౌవీరకుమారుడినైనా ఎదుర్కోవచ్చుగాని, ఆ ఇరువురిని తేరిపార జూడడానికైనా మన బలాలు సాహసించడం లేదు. పారజూచామో పారజూస్తాయికూడాను.

సిం.రా—(ఆశ్చర్యంతో) ఆఁ. అంతటి శూరులా!

ప్రాతి—చిత్తం.

సిం.రా—మన అశ్వబలం అంతా యువరాజుకు మద్దతుగా నడిపించవలసిందిగా దండనాథులకు నా ఆజ్ఞగా తెలియచేయి.

ప్రాతి—(విధేయత చూపి వెళ్లిపోతాడు.)

సిం.రా—(మంత్రితో) విదర్భదేశంవిషయమేమైనా తెలుసుకున్నావా?

మం—కొంచెం అలజడిగా ఉన్నది. ఎటూ చెప్పడానికి వీల్లేదు.

(తెరలోబిగ్గరగా) "ఎక్కడ, సౌవీరకుమారుడెక్కడ?"

సిం.రా—(విని, దిలాసాతో) ఆఁ. మన బలాలకు ఊతం చిక్కినట్లుంది. ఆతడు బహుశా తిరిగి...

ప్రాతి—(వేగిరం ప్రవేశించి) మహారాజా! ఎవడో ఒక మహాపురుషుడు సుమారు ఇరవైవేల గుఱ్ఱపుదళంతో వచ్చి సంజయునికి తోడుగా మన సేనమీద విరుచుకుపడ్డాడు.

(తెరలో—"జై సౌవీరకుమారునికి జై.")

సిం.రా—(విని, ససంభ్రమంగా) ఏమిటది?

ప్రాతి—శత్రువు మన అర్ధచంద్రవ్యూహాన్ని పూర్ణచంద్రవ్యూహం చేసి లోపలికి చొచ్చుకువొస్తు న్నాడు.

(తెరలో— "జై సింధుయువరాజుకీ జై." సింహనాదాలు వినవస్తయి.)

సిం.రా—(మంత్రితో) అవిగో, మన సేనల హర్షధ్వానాలు. సౌవీరకుమారుడు పట్టుబడిఉంటాడు.

ప్రాతి—కాదు మహారాజా! శరవర్షంలో మునిగిపోయి జాడతెలీకుండాపోయిన మనయువరాజా కృతార్థ్యవస్థతో బయటపడిఉంటాడు.

సిం.రా—(సంభ్రమంతో) అలాగా? పోయి తెలుసుకో.

ప్రాతి—(నిష్క్రమిస్తాడు.)

మం—మహారాజా! ఈ మా రీచండప్రచండుని జయించడం అంత సులువుగా తోచడంలేదు.

సిం.రా—కారణం?

మం—దైవం అనుకూలంగా ఉన్నవాడుగాని ఇంత సాహసానికి పూనుకోలేడు. అట్టివాడికి అన్ని సహాయసంపత్తులూ స్వయంగా వచ్చి చేరుతాయి.

సిం. రా—పిరికి సంజయుడు అంతవాడయినా డంటావా?

మం—సంజయుడిది కాదు ఆ గొప్పతనం. వృద్ధమాత విదులామతల్లి ఆశీర్వచనబలం అతణ్ణి ఇంతటి స్థానానికి తెచ్చింది.

సిం. రా—ఆమె యింకా జీవించిఉందా?

మం— తప్పక. మారువేషాలతో సంజయుడికి భుజాలుగా ఉన్న ఇద్దరూ ఆతనితల్లి విదుల, ఆతని భార్య భాగ్యవతి అయిఉంటారు. సందేహం లేదు.

సిం. రా—ఆగంతుకుడు ?

మం—మన విరోధులలో ఒకడు, లేక సౌవీర దేశంలోనివాడొకానొకడు కావచ్చును.

(అనతిదూరంలో పెద్ద కలకలం వినబడుతుంది.)

సిం. రా—(విని, చకితుడై) ఏమిటీ గందరగోళం ?

ప్రాతి—(ప్రవేశించి) దేవా ! విదర్భరాజ కుమారుడుతనయావద్బలంతో వచ్చిశత్రువులతోడుగా మనసేనలను ఊచకోత కోస్తున్నాడు. వాహిని చిందరవందరై చీకాకుపడి దిక్కుదిక్కుకు పారుతోంది.

సిం. రా—దండనాథులు ?

ప్రాతి — అపార పారావారంగా వచ్చిపడే కొత్తసేనల పరాగంలో వారు ఏమైపోయారో అంతు లేదు. వారిలో కొంతమంది ఇప్పుడసలే లేనట్టున్నారు.

సిం. రా — (సంభ్రమ, విషాదాదులతో) ఆహా ! ఎంత ఘోరం !

ప్రాతి—(నిష్క్రమిస్తాడు.)

(కత్తుల చటచటలు వినిపిస్తాయి.)

సిం. రా—సంకుల సమరం విజృంభించినట్లుంది.

మం—మన సేనలలో నిరుత్సాహంకూడా ప్రబలినట్లుగానే ఉంది.

(తెరలో—"మహారాజా ! మహారాజా !")

(దగ్గరలో భయంకరంగా కోలాహలం వినవస్తుంది.)

సిం. రా—ఆఁ. ఆఁ. (అంటూ లేచి నిలబడుతాడు.)

మం—(కూడా లేచి నిలబడుతాడు.)

ప్రాతి — (ప్రవేశించి) మన యువరాజును శత్రువులు చుట్టుముట్టివేశారు. అతడు సింహం కోరమీద పక్కపరుచుకున్నాడు. శత్రువు కోట సమీపిస్తున్నాడు. ఇంకొక క్షణంలో......(విని) అదుగో, అలజడి. ఆకాస్తా అయినట్టే ఉన్నది.

(కొన్ని రక్తబిందువులు పైనుండి వారి పాదాల ముందు పడతాయి.)

సిం. రా—(చూచి చకితుడై) ఈ నెత్తురు చుక్కలెక్కడివి ? (నేల పరిశీలించి ఆకసంవంక చూస్తాడు.)

మం— (ఆకాశం పరిశీలిస్తాడు.)

ప్రాతి—(ఆకాశంమీద ఒకచోట వేలితో చూపుతూ, సావేగంగా) మహారాజా ! మహారాజా ! అదుగో యువరాజు మస్తకాన్ని రాబందులు తన్నుకుపోతున్నాయి. అదుగో, అదుగో.

సిం. రా—(చూచి, పరిశీలిస్తూ, విషాద సంభ్రమాలతో) యువరాజు మస్తకమే ?

మం—అలాగే ఉన్నది.

ప్రాతి—యువరాజు తలే మహారాజా ! యువరాజు తలే.

సిం. రా—(శోకంతో) కుమారా ! ఇంత చిన్న వయస్సులోనే వీరాభిమన్యుడిలాగు పితృణం తీర్చుకున్నావా? కుమారా! నా రాజ్యతృష్ణకు నీవు పానకం అయినావా! (సరోషంగా కన్నులెఱ్ఱజేసి, కరవాలం ఝుళిపిస్తూ) పాపీ! పిరికి సంజయా! నీ హృదయకుహరంలోని వేడి నెత్తురుతో ఇప్పుడే నా కుమారునికి నివాపాంజలు లిస్తాను. (మండిపడుతూ చరచరా వెళ్లిపోతాడు.)

మంత్రి, ప్రాతిగామి—(నిష్క్రమిస్తారు.)

౪-వ దృశ్యం

[పటకుటీరముముంగిట విదుల కూర్చొని ఉంటుంది. ప్రక్కనే ఒకబల్లమీద పట్టుబట్ట పఱచి కృపాణం పెట్టి ఉంటుంది.

సంజయుడు, వాని వెనుక విదర్భరాజ కొమారుడు, దుర్జయకుమారుడు, రాజపురుష వేషంతో ప్రభంజనదాసు, కొందరు భటులు బంధింపబడిన సింధురాజును తీసికొని వస్తారు.]

సంజ—(గబగబ వచ్చి) నమోస్మన్మాత్రే విదులాయై. (పాదాభివందనం చేస్తాడు.)

విదుల—(ఆసనం దిగి, ఆనందాశ్రువులు రాలుస్తూ, సంజయుని లేవనెత్తి, తల నిమురుతూ) వీరశ్రీ వీర శత్రుంజయ మహారాజకుమారా! సంజయా! జయలక్ష్మితో సహా వచ్చావా! ఈనాడు నీ సంజయ నామధేయం సార్థకమయింది. నా ఉభయకులాలూ వన్నె కెక్కినై. నా కోడలు భాగ్యవతి సౌభాగ్యవతి అయింది. కుమారా! విదులాశత్రుంజయుల అంగాంగాలవల్ల ఉద్భవించిన తేజోరాశి అని నిన్ను లోకం గుర్తించగలిగింది. చిరంజీవ! (అని మూర్ధాఘ్రాణం చేసి ఆలింగనం చేసుకుంటుంది.)

సంజ—(కొంతవడికి వేరుపడి) అమ్మా! ఇదుగో! నీ ఆశీర్వచనబలంచేత శత్రువును బంధించి తెచ్చి నీకు అర్పణ చేస్తూన్నాను. నీ వేమాజ్ఞాపించినా సరే.

విదుల—(రాజసం ప్రకటిస్తూ) సంజయా! మనకూ, మన దేశానికి తీరని పగే అనుగాక, కూరమానియైన ఈ సింధురాజుకు ఈ నిర్బంధం ఇంకా తగదు. అయిన ప్రతీకారం చాలు. పాశాలు విడదీయించు.

సంజ—(విధేయతతో) మాత్రాజ్ఞ. (తానే స్వయంగా కట్లు విప్పుతాడు.)

సిం. రా—(చేతులు కట్టుకొని నేల చూస్తూ నిలబడతాడు.)

విదు— సింధురాజా! జయాపజయాలు దైవాధీనాలు. వాటినిగురించి హెచ్చుకుందులు మనిషికి తగనిపని. సూర్యుడు ఉదయిస్తున్నాడు, చంద్రుడు అస్తమిస్తున్నాడు; చంద్రుడు ఉదయిస్తూన్నాడు, సూర్యుడు అస్తమిస్తూన్నాడు. నాయనా! నీ సింధురాజ్యం నీ చేపిలుకో. ఇదుగో, నీ సోదరుడు సంజయుడు. కుడిభుజంగా నిలిచి నీ చిన్నితమ్ముని అభ్యుదయానికి పాటుపడు. నేటినుండి నీవు నా జ్యేష్ఠ పుత్రుడివి.

సిం. రా—(ఆనంద ఆశ్చర్య అభిమాన కరుణాభినివేశాలతో హృదయం కరిగి) విదులామతల్లీ! నీ ఔదార్యానికీ, నా తమ్ముడు సంజయుని శౌర్యానికీ జన్మజన్మకు కృతజ్ఞుడిని. నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. శత్రుంజయుడైన సంజయుని అచిరకాలంలోనే ఏకచ్ఛత్రాధిపతిని చేసి నా ఋణం తీర్చుకొంటాను. (సంజయుని చేతులు పట్టుకొని) సోదరా! సంజయా! ఎండకన్నా వానకన్నా ఎరగని భార్యతోను, కూరమాత విదులామతల్లితోను నిన్ను అడవులలో నానా యాతనల పాలు చేసిన ఈ కఠోరహృదయుణ్ని మన్నించు. (అశ్రువులు రాలుస్తూ సంజయుని కౌగిట చేర్చుకుంటాడు.)

మరొక భటుడు—(ప్రవేశించి) అమ్మా! పట్టపేనుగు అలంకరింపబడి కోటవాకిట సిద్ధంగా ఉన్నది.

విదు—ఇప్పుడే వస్తూన్నాం.

సిం. రా—(సంజయునితో) తమ్ముడూ! ఉత్తమ క్షత్రియు డింతతో శాంతి పొందరాదు. తృప్తిలేని బ్రాహ్మణుడిలాగా, తృప్తిపడే రాజు తనకు తానే హాని తెచ్చుకుంటాడు. రాబోయే విజయదశమినాడు దండయాత్రకు బయలుదేరు. నాలుగు సముద్రాల చివళ్ల వరకూ సౌవీర శత్రుంజయ మహారాజ కుమార సంజయప్రభువు సామ్రాజ్యాన్ని విస్తరింప జేసినవాడుగాని ఈ (తన్ను మాపుకుంటూ) సింధురాజుకు కునుకు పట్టదు.

సంజ—అవశ్యం సోదరా!

విదు—విదర్భరాజకుమారా! నీవు మాకు చేసిన మహోపకారం అపారం.

వి. రా—(నమ్రతతో) అమ్మా! గురుస్థానంలో ఉండి నాకు అస్త్రవిద్య సాకల్యంగా నేర్పిన నీ ఋణం తీర్చుకోడానికి భగవానుడు నాకీ నాడిలా అవకాశం కలిగించినందుకు ఎంతయు ధన్యుణ్ని. (నమస్కరిస్తాడు.)

విదు—దుర్జయకుమారా! ఇచ్చి పుచ్చుకొన్న సంబంధాన్ని సార్థకపరుస్తూ ఆపత్సమయంలో ఆదుకొన్న నీ మేలు మరవరానిది. నీవంటి శూరాగ్రేసరుడికి సోదరి కావడం వల్లనే మా భాగ్యవతి భాగ్యవతి కాగలిగింది.

దుర్జ—శూరమాతా! నీవంటి వీరనారీ వతంసాలను కనడం చేతనే ఈ వసుమతి రత్నగర్భగా కీర్తి పొందుతోంది. నాసోదరి మీ యింటికి కోడలు; ఈనాడు మహోత్సాహంతో శత్రువులను గెలిచిన ఏక

చ్ఛత్రాధిపతి సంజయ మహారాజు పట్టమహిషి, అయిం దంటే నా అదృష్టం ముందు యావద్బ్రహ్మాండం గడ్డి పోచ విలువయినా చేయదు.

విదు—(ప్రభంజనదాసును చూపుతూ) ఈవీరా గ్రేసర చక్రవర్తిని ఎలా గౌరవించాలో, ఎంతతో ఈయనఋణం తీర్చుకోగలుగుతామో గోచరం కావ డం లేదు.

ప్రభం—(తలపాగా తీసి, రాజవేషం తొలగి స్తూ) ఏదో ఉబుసుపోకకు సభలో పద్యాలల్లే ఆట వస్తువుకు నాకు మీరు ఋణపడడమా! ఇదుగో- ఈ శరీరం, ఈ మెదడు మీ ఉప్పుతో పెరిగింది.

విదు—కవిసార్వభౌమా! నీవు సామాన్య కవివి కావు. ఆదికవివి. నిరుత్సాహంతో అడవులలో మసిలి పోతూ ఉన్న మాకు ఉత్సాహశక్తి కలిగించి యింత ఐశ్వర్యం సంపాదించి యిచ్చిన నీవు మాకు సర్వథా గురుతుల్యుడవు.

ప్రభం— విదులామహాదేవీ! ఒక్క మనవి. బ్రాహ్మణ్ని కనక యాచిస్తూన్నాను. ఏదో సంతోష సమయం. తప్పక అవునవాలి. నాడు, అడవిలో, భాగ్యవతి మంచినీరు తెచ్చే సమయంలో, ఎదురుపడి, గుర్తుపట్టి, సంజయమహారాజుకు రోషం, ఉత్సాహం కలిగించడానికిగాను, కూయరాని కారుకూతలు కూశాను. అందుకు ఫలితంగా (తన తల చూపుతూ) ఈ తల తీయించి కోటవాకిట పడవేయిస్తారో, లేక నన్ను సజీవంగా ఉప్పు పాతరలో ఊరవేయిస్తారో, మరేం చేస్తారో మీయిష్టం. చేసినపాపం నలుగురి ముందూ చెప్పుకుంటూన్నాను.

విదుల—(నవ్వుతూ) ఆ విషయం భాగ్యవతి ఆలోచించి చెబుతుంది.

సంజ—(నవ్వుతూంటాడు.)

(తక్కినవారు నివ్వెఱపోయి చూస్తూంటారు.)

భాగ్యవతి—(హారతి పళ్లెరంతో ప్రవేశించి సంజయునికి నీరాజనం ఇస్తుంది.)

భటులు—జై విదులా శత్రుంజయసంజయ మహారాజులకు జై.

(తెర జారుతుంది.)



కేంద్రములో బృహస్పతి విలువ

❀

= శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు =

ఒకానొక మహారాజపుత్రుని వివాహమహోత్సవ ముహూర్తమునుగూర్చి కడచిన పుష్యమాసపు 'భారతి' సంచికలో ప్రస్తావించియుంటిని. ఉపరాగదోషదూషితమైన యా ముహూర్తపు ఫలము వైవాహికజీవితమున దంపతులకు పరస్పరవైమనస్యమో, వైమనస్యమో తెచ్చిపెట్టియుండనోపు. కారణ మేమయిన నేమి, ప్రథమవివాహకాలమునుండి ఆరవయేట నామహారాజపుత్రునికి పునర్వివాహావశ్యకత యేర్పడియుండుటమాత్రము సుప్రసిద్ధవిషయము. మూర్ధాభిషిక్తుడగు మహారాజపుత్రుడు కావలె నన్నచో, మహిషీపట్టమున కువ్విళ్లూరు మత్తకాశినులు లభించుట యరుదా? ఆతని రెండవ వివాహపు ముహూర్తము నందలి గ్రహస్థితి యీ క్రిందికుండలి చూపగలదు.

X ౧౫-౩౦ కే ౧౦-౧౩	శు ౦-౧	ర ౧౪-౫౭ వ ౨౯-౩౦ శ ౨౯-౪౦	బు ౧-౪౨ I ౨౦-౩౦ గు ౨౦-౨౦
	వివాహ లగ్నము		కు ౬-౩
చ ౨౭-౭	సాయనగ్రహకుండలి		
			రా ౧౦-౧౩ ౩౨౭-౨౨ (వ)

లగ్నకాలము రమారమి ఉదయము ౯ నుండి ౧౦ ఘంటలకాలములో నని వింటిని. ఆ మధ్యకాలమందే బృహస్పతి లగ్నమం దుండుట తటస్థించుటచే, గురూదయకాలమునకే యీకుండలి గుణింపబడినది.

౧౯౪౨-వ సంవత్సరము మే నెల ౬-వ తేదీన జరిగిన వివాహ మిది. లగ్నమందు బృహస్పతి యుదయించుచుండుట యీముహూర్తమందలి యుత్కృష్టగుణము. కాని, కర్మఫల మేమో, ఈవివాహముహూర్తమునకుసయితము ప్రబలదోషములు పట్టినవి. ఈ క్రింది పట్టికను జూడుడు:

(౧) కుజుడువివాహలగ్నభావమునకే వచ్చుట;

(౨) దశమకేంద్రమందు మోక్షకారకుడో, విమోచనకారకుడో అగు కేతు వుండుట;

(౩) ద్వాదశభావస్థితివలన రవి దుష్టుడగుట;

(౪) వ్యయస్థానమందు శనివరుణులు ప్రమాదకరముగా యుద్ధము చేయుచుండుట;

(౫) చతుర్థకేంద్రమున మా య ల మా రి య గు ఇంద్రగ్రహ ముండుట;

(౬) లగ్నాధిపతియగు బుధుడు శనిసంయోగము నంది స్తబ్ధుడై వ్యయమం దుండుట;

(౭) క్షీణచంద్రుడు వివాహలగ్నమున కష్టమస్థానము నాశ్రయించి అస్తమానము నభిలషించుచుండుట;

(౮) సౌఖ్యకారకుడగు శుక్రుడు చక్రాదిలో గండసంధిలో నుండుట;

(౯) వివాహకాలమునకు "విష్టి" తొంగిచూచుచుండుట.

ఇన్నిదోషములా రాజపుత్రుని వివాహమునకు?

మన మౌహూర్తికులలో ననేకుల కొక అవిచారరమణీయమగు నభిప్రాయ మున్నది; గురువును లగ్నరాశిలో - ఏమూలలో నయినాసరే - ఉంచినచో, లగ్నమున కెన్నిదోషము లుండినా పరిహార మగునని.

"బుధః పంచసహస్రాణి
శుక్రః పంచశతానిచ
లక్షమేకం తు దోషాణాం
గురుః కేంద్రే వ్యపోహతి"

అను వాక్యము మనవారికి పరమాదరణీయమగు ప్రబలప్రమాణము ! ఇట్టి వాక్యములలో అర్థవాద మున్నదని వారికి స్ఫురించుటే లేదు.

గురువు వాస్తవముగా "గొప్ప"వాఁడే ! శుభ గ్రహమే ! కాని, ఏదోషములయినా, అవి ఎట్టి వయినా, లక్షసంఖ్యకు మించనిచో, కేంద్రమందలి బృహస్పతి వాని నన్నిటిని బోఁగొట్టఁగలఁ డనుకొనుట కన్న ఆ మహనీయునియెడల మన మాచరించు మహాపరాధము లేదని నామనవి. ఒక చిన్నవిషయ మును గమనించితిమేని, ఈలక్షదోషాపహారకుని బల మనకు సులభముగా నర్థము కాఁగలదు. ప్రతినిత్యము బృహస్పతి లగ్నమం దుదయించుట ఏదోయొక రాశిలో జరుగుచునేయుండు ననుట నిర్వివాదాంశము గదా? ఆమాత్రమున, ఆరాశినే లగ్నముగా నేర్పరచి, ఏదినమైనా — అమావాస్య కానిండు, వ్యతీపాత కానిండు—వివాహాది శుభకార్యములు జరుపవచ్చు ననఁగలమా? ఇంతే కాదు. మౌహూర్తికుల పాలిటి కామధేనువువంటి మరియొక వాక్య మిది చూడుఁడు:

"కేంద్రత్రికోణగేజీవే
శుక్రేవా యదివా బుధే,
దోషా వినాశ మాయాంతి
పాపాఇవ హరిస్మృతేః" [నారదుఁడు]

పెండ్లిముహూర్తములను నిర్ధరించువారి కింత కన్న సౌకర్యము కావలయునా? గురువో, శుక్రుఁడో, లేక బుధుఁడో, కేంద్రమందయినాసరే- కోణ మందైనాసరే, ఉండినచో సర్వదోషపరిహారమఁట !! నాలుగు కేంద్రము లున్నవి. కోణములు రెండున్నవి. పైమూఁడుగ్రహములలో నొక్కొక్కరిసండి ఆరు రాసులలో – కేంద్రకోణములలో – ఏరాశియందైనా లగ్న ముండినచో దోషము లంటవఁట! ఏదినమున, ఏగంటలో లగ్నమును నిర్ణయించినా, ఈ మూఁడు గ్రహములలో సామాన్యముగ నేదోయొక్కటి కేంద్ర మందో, కోణమందో రాఁగలుగుటచే ఎవరి కెప్పుడు లగ్నము కావలె నన్నచో, అప్పుడే "తదేవ లగ్న"ము తయారగునుగదా! ఇంతకన్న అసంబద్ధ సూత్రము లుండునా? విద్యామాధవసూరివాక్య మీరహస్యము నెంతస్పష్టముగా విశదీకరించుచున్నదో గమనింపుఁడు:

"శుభగ్రహాణా ముదయో౽స్తి నిత్యం
నతావతా కర్మ శుభం విదధ్యాత్
గ్రాహ్యో మహాదోషవివర్జితో౽య
మిదం ముహూర్తస్య పరం రహస్యం"
(విద్యామాధవము)

ముహూర్తశాస్త్రముమాట యట్లుండనిచ్చి, పురాణముల నొకమారు ప్రశ్నింతము—బృహస్పతి గారి కంత శక్తి గలదా యని. ఇతఁడు దేవతలఆచార్యుఁడే, వాచస్పతియే అగును. కాని, తన కళత్రస్థానము నాక్రమించి వేధించుచున్న చంద్రునివలని దోషమును తానే పోఁగొట్టుకొనఁజాలక, "నాకు తారాబలము లేదు" అనుకొని నెమ్మదిపడి, "వంశాభివృద్ధి రస్తు" అని చంద్రుని నాశీర్వదించినవాఁడేగదా యీ బృహస్పతి? స్వయంప్రకాశహీనుఁడు, దుర్బలుఁడు, జడమూర్తి అగు నీచంద్రుని విషయమందే యీగతి అయినచో, పీరాధిపీరులగు నితరగ్రహములవలని వేధాదోషములను పరిహరించు శక్తి యితనికిఁ గల దన్నచో మనలఁ జూచి చంద్రుఁడైన నవ్వఁడా? "స్వయం తీర్ణః పరాన్ తారయతి" అను న్యాయము బృహస్పతియెడల సయితము వర్తింపకతప్పదు.

పోనిండు. రాజపుత్రుని జాతకమున గురువున కున్న యధికార మేమి? తృతీయవ్యయాధిపతియై, అష్టమస్థానము నాశ్రయించియున్నవాఁ డీబృహస్పతి! ఇట్టి బృహస్పతి రాజకుమారుని వివాహకాలమున లగ్నమునం దుంచినమాత్ర మేమి శుభఫల మీఁగలఁడు? వరాహమిహిరాచార్యుని బంగారువంటి సూత్ర మీక్రిం దిడి పరిశీలింపుఁడు:

"హోరావిదో జగురిదం,
సూతావబలో, దశాధిపారిశ్చ,

అశుభఫలదశ్చ సాంప్రత
ముదయే సౌమ్యోపి నేష్టఫలః"

ముహూర్తములను నిర్ణయించి యిచ్చు దైవజ్ఞ శిష్యులను నిరాదరించు చుండుట మిగుల శోచనీయము. కాని, ఇట్టి స్థితికి కారణము చాలమట్టుకు పెండ్లిపెద్దలే. అనేకులకుముహూర్తముపై నభిమానము లేదు. ఏదో 'అందమునకి' వారికి లగ్న మొకటి పత్రికలలో నచ్చువేయించుటకు కావలసియున్నది. అంతే. అలవికాని అల్లుండ్లకు కట్నమిచ్చుటకు వెయ్యార్లు, అక్కరలేనివారికి సయితము పంపుటకై లగ్నపత్రికల నచ్చొత్తించుటకు నూర్లు వెచ్చపెట్టుటకు వెనుదీయని దాతలయినా, పెండ్లిపెద్దలు ముహూర్తము నిర్ణయించియిచ్చు జోస్యుని కిచ్చు సంభావన పాతికయో, పరకయో! దానికి తగిన లగ్నములే లభించుచున్నవి. అందుకు కావలసిన సూత్రములు మాత్రమే ప్రచారమునకు వచ్చినవి. మహారాజపుత్రుని వివాహలగ్నమునకు సంభావన కొదవయుండు ననుట నాఆశయము కాదు. సర్వసామాన్యముగ నీశాస్త్రము మన దేశమున నధోగతికి వచ్చుటకు పెండ్లిపెద్దల యనాదర మొక కారణ మని మాత్రమే నామనవి.

పోనిండు. ఈముహూర్తపు ఫలితమెట్లున్నదో మన మెఱుంగము. అంతఃపురరహస్యములను తెలుసుకొనుటకు ప్రయత్నించుట భావ్యము కాదుకూడ. సర్వము సమీచీనముగనే యుండఁగలదని నమ్ముదముగాక!

నే నీవ్యాసమును వ్రాయుచున్నపు డొక పెద్ద మనుష్యుఁడు సమీపమందుండి, వ్రాసిన భాగములను చదువుకొని "ధర్మబద్ధమైన ప్రథమవివాహమునకు మంచి సుముహూర్తము కావలసినదే. కాని, రెండవ వివాహపు లగ్నమున కిన్ని నియమము లేల?" అని ప్రశ్నించెను. నాకు నవ్వు వచ్చినది. నిమిషకాల మూరకుండి, "అతిథిపూజానిర్వహణార్థమై రెండవ వివాహము చేసుకొనువారి కీలగ్ననియమము లక్కర లేదు." అంటిని.

అది యట్లుండె. ఏశుభదినమున నా రాజపుత్రుని వివాహము జరిగెనో, నాఁటిదినమే యొకపల్లెలో నొక బీద బ్రాహ్మణకుటుంబమున నొక వివాహము జరిగినది. ముహూర్తము మాత్రము పూర్వాహ్ణమునఁ గాక అపరాహ్ణమున. ఈ ముహూర్తమును నిర్ణయించిన పెద్దలు మాత్ర మాచార్యబృహస్పతిని విడుతురా? ఆ గ్రహమును దశమకేంద్రమం దుంచి కన్యాలగ్నమును వారు నిర్ధరించినారు. చంద్రుఁడు మకరాంతములో నుండినవాఁడు కుంభరాశిలో ప్రవేశించినాఁడు. ఇతర గ్రహముల స్థితిలో చెప్పకోఁదగినంత మార్పేమియును లేదు.

ఆ వధువు జాతకచక్ర మిది :—

వ ౨౧-౩౮ (వ)	X ౨౬-౧౫	చ ౧౬-౦	
	కన్యక జాతకము — (సాయనము)		రా ౨౮-౫ I ౨౮-౩౦
కే ౨౮-౫ కు ౨౩-౮ గు ౨౧-౪౦			ఇ ౨౪-౪౮ (వ)
బు ౨౬-౨౫ ర ౫-౫౨	శు ౧౦-౫ శ ౧౯-౧౪		

గురుశుక్రుల లిరువురి పూర్ణ దృష్టి లగ్నముపై నున్నది. "కాంచన కేతకీకుసుమము" బోలిన దేహకాంతి ఆ జాతకురాలిది. కాంతికిఁ దగిన చక్కని సౌందర్యమున కామె రంగభూమి. లగ్నభాగలో నున్న రాహువు కొంత పొడుగరియయిన "తటిన్నిభ గాత్రవల్లరి" నిచ్చినాఁడు. ఉచ్చస్థితిలో లాభస్థానమందున్న నిండుచంద్రునిపై గురుశుక్రులయొక్కయు, శనికుజులయొక్కయు దృష్టి యున్నది. నిడువాలిక తళుకు చూపులతో మిగుల దర్శనీయమైనది జాతకురాలి ముఖబింబము. బుధవరుణుల పరస్పర కేంద్రవర్తిత్వము నవనవోన్మేష మగు ప్రతిభ, చాకచక్యము, సంకల్పశక్తి—వీని నిచ్చుటే కాక, కొంత స్వాతంత్ర్య ప్రియత్వముతోడి వ్యధికరణ చిత్తవృత్తిని సయితము ప్రసాదించినది. నిరంతరహాసన్ముఖి యగు నా బాలికామణీముఖ మొక్కొక్కప్పుడు తటాలునరోషకషాయిత

మగుటకు చంద్రకుజుల సమసప్తకమే కారణము. సప్తమభావమందలి గురుశుక్రులపై వరుణుని మిత్రదృష్టి జాతకురాలి విలాస వైదగ్ధ్యమును తెలుపఁజాలినది.

౧౯౪౦-వ సంవత్సరమునజూలై మాసమున కార్య వశమున నామిత్రుని గ్రామమునకుఁ బోయినపు డాతని యింటనే తొలుదొల్త నేనీ కన్యకను చూడఁగల్గుట. అప్పటి కా చిన్నదాని వయస్సు పదునైదు సంవత్సరములు. ప్రస్తావవశమున నా మిత్రుని యాప్త బంధువర్గమునకుఁ జేరిన దా కన్యక యనియు, అతని కుమారుని కా కన్యక నిచ్చి వివాహము చేయు సంకల్ప మామెతల్లిదండ్రుల కున్నదనియు, తగిన సుముహూర్తము లభించినచో, వారి యిష్టానుసారము వివాహము జరుపు కుతూహలము తనకును గలదనియు నామిత్రుఁడు నాకుఁ దెలిపెను. అపుడపుడే పదునెనిమిది సంవత్సరముల వయసువచ్చిన కుమారుఁ డొకఁడు నా మిత్రునకుఁ గలఁడు. అతఁడు మంచి ఆకార సౌష్ఠవము గల సుఫురద్రూపి. "పొరఁబాటు" వలననో, "గ్రహపాటు" వలననో, స్కూలుఫయినలు పరీక్షలో జయమును పొందలేక కొంతకాల మింట నిలిచినాఁడు. చదువును కొనసాగించుకోరిక గలదు. ఆ సమయము నకు సరిగా రత్నమువంటి తమ కన్యకతో నామె తల్లిదండ్రులు వచ్చి నామిత్రుని యింట విడిసి వివాహ సంధానమును నడిపినారు. పొంతనములు కుదిరినవని జ్యోతిష్కు లప్పుడే సెలవిచ్చినారఁట! ఇంటి పనిపాటులలో తనకు సాయము లభించు నను నాశతో నా మిత్రుని భార్య త్వరలో వివాహము జరుపవలెనని పట్టుపట్టినది. చదువుసంధ్యల తగులాటము లేని నిశ్చింతజీవితము, కోరిక లీరికలెత్తించు నూత్న తారుణ్యవిజృంభణము, భావనారంగమున ప్రతిఫలింపఁగల ముగ్ధమోహనవిలాసములతో కనులపండువు గావించు బాలికామణి! నా మిత్రుని కుమారశేఖరుఁ డపుడు కా దిపుడు పెండ్లి కుమారుఁ డగుట కువ్విళ్లూరుచుండుటలో నాశ్చర్యము లేదు. వివాహము విద్యావిఘాతము చేయునని, మొదలుమొదలు నామిత్రుఁడు కొంత వెనఁదీసినా, ఎదిరిపక్షము ప్రబలమగుటచే, ఇతని వాదము నెగ్గినదికాదఁట. త్వరగా వివాహము జరుపుటయే మేలని నామిత్రుఁడు నయితము విధిలేక నిర్ధరింపవలసివచ్చినది. లగ్నమునకు మంచి కాల మెప్పుడో జాతకములు చూడుమని నా మిత్రుఁడు నన్నడిగెను.

ఆ చిన్నవానిజాతక మీక్రింద నున్నది:—

వ ౧౧-౪౫	బు ౨-౨౮ శు ౭-౨౧ ర ౧౭-౪౧	కు ౩-౨౨ X ౨౪-౦	
	వర జాతకము — (సాయనము)		
			ఇ ౧౩-౧౪ (వ) I ౨౩
కు ౨౦-౪౬		శ ౩-౬(వ) రా ౭-౨౬ గు ౧౩-౨౧(వ)	చ ౧౪-౧౦

చక్రకుఁదనమునకు పేరయిన సింహరాశి ౧౩-వ భాగలో నున్న ఇంద్రగ్రహము లగ్నమందుండుటయు, జౌత్కృష్ట్యమును సూచించు సింహరాశి ౨౩-వ భాగ లగ్నమగుటయు జాతకుని దర్శనీయవిగ్రహమును తెలుపుచున్నవి. మూఁడింట రాహుసంయోగముతో నున్న బృహస్పతి మంచి ప్రాపంచికవిద్యనే సూచించుచున్నాఁడు. బుధశనుల కున్న సమసప్తకదోషము తాత్కాలికముగా వచ్చిన విద్యావిఘ్నమును తెలుపఁజాలినది. భాగ్యస్థానమందలి ఉచ్చరవి, ధనస్థానమందలి యుచ్చశని- వీరు జాతకునికి మంచి భాగ్యోదయము, అర్జనపటుత్వము ఈయఁగలరు. స్వక్షేత్రము నాశ్రయించి భాగ్యభావమం దున్న శుక్రుఁడు జీవితమున సుఖసౌభాగ్యము లుండునని వాగ్దాన మిచ్చుచున్నాఁడు. సప్తమస్థానాధిపతియగు శని ఉచ్చుఁడై కుటుంబములో నుండుట యొక విధముగా వైవాహిక జీవితవిషయమున విలువగలదే. కాని, ఆ శనికి సమసప్తకములో నున్న బుధుని వేధ గలదు. పనులలో దక్షత కల్గి, జాగరూకురాలై హెచ్చుగా సౌందర్యాభిమానము కాని, విద్యాగర్వముకాని, తళుకుబెళుకులుకాని లేని సంసారియగు భార్య రాఁగల దనవచ్చును.

ఈ రెండు జాతకములను పోల్చిచూతము. పురుష లగ్న మాగ్నేయరాశి; కన్యాలగ్నము జలరాశి. కాన లగ్నముల కానుకూల్యము పూజ్యము. పరస్పరముగ రవిచంద్రుల కేమియు మిత్రదృష్టి కానరానందున భక్తిమాట ప్రశంసకే రాదు. ఇఁక పురుషజాతకమున ప్రబలుఁడగు శుక్రునికి స్త్రీజాతకమందలి బలవంతుఁడగు కుజునితో సమసప్తకయోగ మున్నది. రక్తిమాత్రము బాగుగా నుండఁగలదు.

సామాన్యముగా సమసప్తకదృష్టి దుష్ట దృష్టిగా పరిగణింపఁబడుచుండుట సత్యమే. కాని, వివాహవిషయమున నీ సూత్రమున కొక చిన్న యపవాద మున్న దనవచ్చును. స్త్రీపురుషుల జాతకములలో నొకరి రవి మఱియొకరి చంద్రునకు, ఒకరికుజుఁడు మఱియొకరి శుక్రునకు సమసప్తకమం దుండఁగలిగినేని, ఆయోగము దాంపత్యధర్మ విచారమునమాత్రము ప్రాతికూల్య దృష్టిగా పరిణమించక, పరస్పరానురాగ సంపత్తినే సూచించఁగలదు. చంద్ర రవులు భార్యాభర్తలనియు, శుక్రకుజులు కాముకీ కాముకు లనియు భావించుట జ్యోతిష శాస్త్ర సంప్రదాయమని మనము జ్ఞప్తిలో నుంచుకొన్నచో, అట్టివారి పరస్పరాభిముఖ్యముఅన్యోన్యాకర్షణదోహదకమై, పరస్పరానురాగసంధాయకమై, మిగుల స్పృహణీయముగ నుండునని సులభముగా నర్థమగును. ప్రకృతినుండియే మన మొక దృష్టాంతమును గ్రహింతము. రవిచంద్రుల పరస్పరాభిముఖ్యము పౌర్ణమనాఁడు మాత్రమే సిద్ధించును గదా! నాఁటిదినముచంద్రబింబమునకున్నంత కళాపరిపూర్ణత, ఆనందసంధాయకత మఱి యేదినమైన మనము చూడఁగలమా? వలచిన వల్లభుఁ డభిముఖుఁ డయినపు డనురక్త యగు భార్యముఖబింబము వికసించు టేమి యరుదు?

మఱియొక్కమాట. సమసప్తకమునకు దాంపత్య విషయమున చెప్పిన యీయర్థము నొక యపవాదముగా గ్రహించు నక్కఱలేకయే సమన్వయపరచుట సైతము సాధ్యమే! సమసప్తకయోగ మొక యుద్ధము వంటిది. యుద్ధమును రెండువిధములుగా విభజించవచ్చును. ఒకటి రౌద్రభయానక బీభత్స రసముల నాశ్రయించినది; రెండవది శృంగార కరుణ శాంతరసముల నభివ్యక్తింపఁజేయునట్టిది. ఖడ్గబలముతో నొకటిని రెండు చేయు ప్రతాపము గలది మొదటిది; కటాక్షబలముతో రెండింటి నొకటిచేయు ప్రభావము గలది రెండవది. భౌతికదేహమును గెలువఁగోరునది యొకటి; మానసిక ప్రపంచమును జయించు శక్తి కలది మఱియొకటి. ఈ రెండవ రకపు యుద్ధము రసికప్రపంచమునకు క్రొత్తది కాదు. ఈ దృష్టితో చూచినచో, స్త్రీజాతకమందలి పురుషగ్రహములలో రవికుజులకు, క్రమముగా పురుషజాతకమందలి స్త్రీ గ్రహములలో చంద్ర శుక్రులతో సంభవించు సమసప్తక యోగము ప్రేమమయ పవిత్ర జీవితైక్యమును పోషింపఁగల్గుటయు, తదితరగ్రహములకు— అందులో క్రూరగ్రహములకు— వచ్చు సమసప్తకయోగము ద్వేషదూషిత మగు హీనజీవితమును దాంపత్య ధర్మమున తెచ్చిపెట్టుటయు అస్వాభావిక మనలేము గదా? స్త్రీ పురుషుల జాతకములను పరిశీలించు సహృదయు లీ విశేషవిధిని గమనింతు రని యాశ.

ప్రకృత మనుసరింతము. ప్రశంసలోని కన్యావరుల జాతకములకు శుక్ర కుజ సమసప్తక యోగప్రేరితమైన యాకర్షణము మాత్రము కలదని కనుగొంటిమి. కాని, కన్యకజాతకమందలి వరుణునితో వరజాతకపు కుజుఁడు పూర్ణ కేంద్రదోషము దృష్టిలో నుండుట పాఠక మహాశయులు గమనింపవలసియున్నది. దాంపత్యవిషయమున కుజవరుణుల వైరమును గూర్చి మన మిదివరకే కొన్ని దృష్టాంతములను జూచినాము గదా? ఆరంభమున నత్యుత్కంఠతోఁడి యాకర్షణమును జూపి, వెనువెంటనే విషాదకర మగు వియోగము నీయఁజాలిన యోగ మిది! రవి చంద్రుల వలని భక్తి కాని, లగ్నముల యానుకూల్యము కాని లేక, కుజ శుక్రుల రక్తిపై మాత్రమే యాధారపడిన కన్యావరుల విషయములో, అన్యోన్యకుజవరుణవేధ యుండెనేని, అది చాల ప్రమాదకారి యనుట సులభముగా నూహింపఁగలము.

ఇది యిట్లుండ, ప్రకృతదశాసౌకర్య మెట్లున్నదో పరికింతము! స్త్రీజాతకమున రవి ధనుస్సులో

౬-వ భాగలో నున్నాఁడు. అనుటచే, పురుషజాతకమున ధనుస్సు ౨౧-వ భాగలో నున్న కుజునికి వెనుక ౧౫ భాగలలో నీరవి యున్నాఁడనుట. "ఏకాంశవర్ష" సంప్రదాయమున కన్యకకు ౧౫ సంవత్సరముల వయస్సు వచ్చునప్పటికి, కన్యజాతకపు రవిని వరజాతకపు కుజుఁ డాకర్షించఁగలఁడు. ఇట్టి యోగ మున్నచోట, పరస్పర సన్నికర్ష సాహచర్యాదిసౌకర్యము లబ్బెనేని, ప్రబలమగు నాకర్షణశక్తి బయలుదేరును. ఇంతే కాదు. కన్యజాతకపు రవికి ౧౦౬ భాగల దూరమున వరుణుఁ డున్నాఁడుకదా? ఆకారణమున వరుణుని కేంద్రస్థానమును (౯౦ భాగలదూరమును) బొందుటకు రవి ౧౬ భాగలు చలింపవలసియున్నది. కాన, ౧౬ సంవత్సరముల వయస్సున రవివరుణ కేంద్రపు విషమఫల మీకన్యకకు రావలసియున్నది. ఇట్టి దశ త్వరలో రానున్న కాలమున వివాహబంధము తగిలించుచున్నారే యని నాహృదయ మాందోళనపడసాగినది.

ఇఁక పురుషజాతకమునందలి లగ్నము చలించి కన్యారాశిలో ౧౩-వ భాగకు మరుసంవత్సరమే రాఁగలదు. అనఁగా, మీనరాశిలో ౧౩-వ భాగలో నున్న యతని జన్మవరుణుని కెదురువచ్చునట. ఇట్టి విషమకాలమున నేర్పడఁబోవు వివాహమువలన నేమి ఫలము సూచితమగుచున్నదో మునుముందుగ నూహించుట యసాధ్యము కాదు. మణికనకములవలె నన్యోన్యానురూపులగు కన్యావరులు; వారి పరస్పరాకర్షణమును సఫలము చేయఁజాలిన సౌకర్యములు; ఎదురుచూచుచున్న భయావహములగు భావిదశలు!

నే నీకుండలులను వేయుచున్నప్పుడు కాఁబోవు వియ్యంకులు నాసమీపమందే కూర్చుండియుండిరి. రమ్మని పిలువఁగా, కన్యావరులుసయితము వచ్చి చేరువ నాసీనులైరి. చలితగ్రహోదులను సాధించుకొనుచు, అపుడపు డాకన్యావరులపైఁ దృష్టిసారించుచుంటిని. వారికిఁ గల పరస్పరానురాగము నిరుపమానమై కన్నులఁ దమపుచుండెడిది. గురుజనసన్నిధానమనుటచే వారు ప్రయత్నపూర్వకముగ పరస్పరాభిముఖ్యమును మానియుండిననేమి, వారి కటాక్షవీక్షణములుమాత్రము, ఏవ్యాజమువలననో, తీ చేయుచునననో, అనుక్షణ మెదురుకొలుమహోత్సవ మనుభవించుచుండిన నాఁటి అనిర్వచనీయదృశ్యము నేఁటికిని నాకు మరపురాకున్నది.

"తోలువోలులఁ విలోలగతి
దొంగలిరెప్పల నాని, కర్ణకుం
డలరుచిధాళధళ్యముల
డాపున నల్లన బొంచి మించులై
వెలువడి, పూర్ణచంద్రుపయి
వెన్నెలపుల్గుల చాలు ప్రాలు లీ
లల విభుమీద ప్రాలె నవ
లానవలాలితదృష్టిజాలముల్."

అను రామరాజభూషణకవివర్ణనమున కపుడు దృష్టాంత మబ్బినది.

"అసమపక్ష మెుకసంవత్సరమైనా వీరి వివాహమునిలుపుట మంచిది. చెడ్డదశలలో వివాహము చేయుట ధర్మము కాదు." అని ఎట్టకేలకు నాయభిప్రాయము నిచ్చితిని.

"అంతకాలము నిలుపుట సాధ్యమా?" అని నామిత్రుఁడు వియ్యంకుని ముఖము జూచెను. "ఎక్కడి మాట?" అని యతఁ డందుకొనెను.

"మీ అభిప్రాయ మేమి?" అని యాకన్యావరులపై దృష్టి బరపి ప్రశ్నించితిని.

తటాలున వారొకరి నొకరు పరిపూర్ణ దృష్టులతోఁ జూచుకొనిరి. అప్రయత్నముగ ముగ్ధ మధుర మందస్మితబంధురములై వారి ముఖారవిందములు వికసించినవి. ఇరువురును ప్రతిచెప్పక తలవంచుకొనిరి. వారు ప్రత్యుత్తర మీయవలసిన అక్కరయే నాకుండ లేదు.

కన్యావరుల యాత్రము వారి కన్నులలోనే కానవచ్చుచున్నది. వారి పెద్దల కంటెకన్న ఆత్రమున్నది. త్వరలో వివాహముచేయు ప్రసక్తి లేనప్పుడు, కుజశుక్రయోగమువలని యాకర్షణము గల తరుణీతరుణులకు పరస్పర సందర్శన సంభాషణ సహవాసాదిసౌకర్యము లబ్బుట ప్రమాదకారి యని యొకానొక పాశ్చాత్యహోరాశాస్త్రవేత్త — సెఫేరియలు

కాఁబోలు — చాటి చెప్పినాఁడు. ఇంతె చాలక, ఈ కన్యావరులకు కుజవరుణవేధ ప్రబలముగ నున్నది. వీరి కిపుడు కానవచ్చు పరస్పరప్రేమ చిరస్థాయిగా నుండఁజాల దనుట నిస్సంశయము. వివాహమైన యచిరకాలమందే, మనోభావములు మార్పు చెందఁగలవు. చాలినంత వయఃపరిపాకము, ప్రాపంచికవివేకము లేని కారణముచే గోరంతలోపములు కొండంతలుగా కానవచ్చి ద్వేషాసూయ లేర్పడఁగలవు. ఇట్టి పరిస్థితులలో వివాహబంధము తలఁపరానిది.

ఇది చాల విషమసమస్య. ఇప్పటి సాంఘిక పరిస్థితులలో, ఆఁడుబిడ్డల వివాహములకు మనువుకుదురుటే కష్టమైనది. కట్నముల యాశ వరులకు ప్రబలినది. యుక్తవయస్సు వచ్చినవారగుటచే, కన్యకలు పతింవరలు కాఁగోరుచున్నారు. వరులు కోరు కట్నము లీయలేక, కన్యకలు మెచ్చు వరులను సంపాదింపఁజాలక, కన్యాజనకులు నానావిధక్లేశముల పాలగుచున్నారు. ఇట్టి విపరీతకాలమున, ఏచిక్కులుకాని లేక, ఎదిగివచ్చిన వివాహమును నిలుపుట యోగ్యమా? సరే కాని, తాత్కాలికసౌకర్యములకు భ్రమసి, ఏకర్మము నెఱుఁగని యాఁడుబిడ్డలకు శాశ్వతక్లేశము సంపాదించి యిచ్చు బంధములను తగిల్చి, ఆజన్మాంతము వారి శోకమును చూచుచుండవలయునా? "అంతా భగవదధీనము. మన యత్నమేమున్నది!" అనువా రున్నారు. శాస్త్రము భగవదాజ్ఞ కాదా? లోకకల్యాణమునకై భగవద్దత్తమయిన శాస్త్రపు సూచనల నుల్లంఘించి ఫలితములను వలదనఁగలమా? కాని, కాలగర్భమం దణఁగియున్న భవితవ్యతను నమ్మి కష్టపడుట నున్న సౌకర్యములను నిరాకరించుట కెవరు సమ్మతింతురు? గ్రహవేధ, క్రూరదశ ఇత్యాదుల నుపన్యసించి, శాస్త్రమందు విశ్వాసములేనివారిని తటాలున మెప్పించుట కానిపని. కాని, నాకు తోఁచినది చెప్పకుండుట ద్రోహ మనుకొంటిని.

"కాలము మంచిది కాదు. సంవత్సరమైనా వీరి వివాహము నిలుపవలెను." అని చెప్పితిని. వారి కుత్సాహభంగము కల్గించినందుకై మనసు నొచ్చినది. కాని, "కాలము బాగున్నది. వివాహము చేయుట మేలు" అని చెప్పుట ద్రోహ మని నానమ్మకము.

నా మిత్రునకు నామాటపై కొంత విశ్వాసమున్నది. నిశ్చయమైనదికదా! తొందర ఏమి? సంవత్సరకాలము తాళి తరువాతనే పెండ్లి చేత మని యతఁడు నిశ్చయించినాఁడు. కన్యకతలితండ్రులు సయితము సర్లే కానిమ్మనిరి. వరునికిమాత్ర మిది యాశాభంగముగా నుండినది. కొన్ని దినములలో నొకనాఁడా కన్యక యొంటిగ నాకడకువచ్చి తన జాతకఫల మెట్లున్నదో చెప్పవలెనని ప్రార్థించినది. ఆమెయుత్కంఠకు సంతసించి ముఖ్యాంశములు కొన్ని చెప్పితిని. ప్రశంసలో నున్న వరుఁడు తాత్కాలికముగ చూపుచున్న యక్కర చిరస్థాయిగా నిలుచునది కాదనియు, సంవత్సరము జరిగినచో నతని ప్రేమ ద్వేషముగా మాఱు ననియు, ఇట్టి పరిస్థితులు రానుండఁగా నిపుడు వివాహము ప్రమాదకారి యనియు, దశలు మంచివి కానందున మూఁడుసంవత్సరములదాఁక యవివాహితగా నుండుటే యుక్తమనియు చెప్పితిని. మంచికాలము వచ్చుదాఁక వేచియుండెద నని యాచిన్నది తన నిశ్చయమును నా కెఱిఁగించెను.

సంవత్సరకాలము జరిగినది. కన్యకతలితండ్రులు మరల వివాహప్రయత్నము లారంభించిరి. అనుకొన్నట్లే అయినది. వరుణగ్రహము తన వాగ్దానమును తాను చెల్లించినాఁడు. ఆతరుణుని చిత్తవృత్తిలో మార్పు వచ్చినది. అంతటి యనురాగమును చూపుచుండినవాఁ డిపు డాకన్యకను ద్వేషింపఁజొచ్చినాఁడు. మాట యిచ్చిన ప్రకారము తన తల్లిదండ్రులు వివాహసన్నాహము చేయ నారంభించఁగా, తన కాకన్య యక్కర లేదని నిష్కర్షగా నతఁడు వారికి తన దృఢాభిప్రాయమును తెలిపినాఁడు. వారెంతో నొచ్చుకొని నీతులు చెప్పినా వినలేదు. ఎవ రెన్నివిధముల బోధించినా వాని మనస్సు తిరిగినది కాదు. కన్యకజననీజనకులు వచ్చి ప్రార్థించినా ఫలము కానరాలేదు. ఈ ప్రస్తాప మెత్తినకొలఁది వాని కాకన్యకపై ద్వేషభావ మధికమగుచువచ్చినది. కన్యకతల్లిదండ్రుల కిది గొప్ప మనఃక్లేశము. ఏడాదిక్రిందనే వివాహము చేసియుండినచో

బాగుండెదనని వారు చింతించినారు. కాని వారి తనయమాత్రము తప్పిపోయినదే మంచిదని తలఁచినది. చెప్పినమాటపై, చూపిన ప్రేమపై గౌరవము లేని చంచలచిత్తుని విషయమున నాకన్యక కిట్టి యభిప్రాయము వచ్చుట తప్పుకాదుకదా! ౧౯౪౧-వ సంవత్సరపు టంత్యభాగమున నొక మా రాతరుణుని నేను జూడఁగల్గినపుడు వాని భావపరివర్తనమునుగూర్చి చర్చించితిని. అనురక్తయగు కన్నియ పట్ల ఇయ్యది దోషమని వాదించితిని. ఇంతలు చేసి, కడ కిట్లాశాభంగము సేయుట యవివేకమని సూచించితిని. నీతికాదని నిందించితిని. తలవాంచి అన్నియు నొప్పుకొన్నాఁడు కాని ఆతరుణుఁడు తన హృదయమునుమాత్రము త్రిప్పలేకపోయినాఁడు. ఆకన్యావరుల కుండునది పరస్పరకుజవరుణ వేధ! వివాహబంధమే వచ్చియుండినచో, ఇట్టి మనఃపరివర్తనపు ఫల మెట్టి విషమమార్గము నవలంబించుచుండెనో ఎవరి యూహకు తగినట్లు వారు నిర్ధరించుకోఁగలరు. "పెండ్లికానందున వరుఁడు తప్పించుకొనఁజూచినాఁడు. కాని వివాహము నడచియుండినచో ఎట్లో సరిపుచ్చుకొనియుండును" అనువా రుందురేమో? మన ముండునది మనుస్మృతినాఁటి కాలము కాదనియు, కన్నులు తెరచి యొకమాఱు సంఘమును పరికించవలసియున్నదనియు నా మనవి.

మరల నారుమాసములు గడచిపోయినవి. ౧౯౪౨-వ సంవత్సరమున మే నెలలో ౩-వ తేదీనాఁడు, బంధువులయింటిలో జరుగనున్న యొకానొక వివాహమునకై నేను గ్రామాంతరమునం దుంటిని. ఆ శుభకార్యమునకు వచ్చిన బంధుజాలములో మన కథానాయికసయిత ముండినది. ఎప్పుడో కొంత యవకాశము చూచుకొని ఆ చిన్నది నా కడకు వచ్చి, అప్పటి తన దశ యెట్లున్నదో చూడఁగోరెను. వివాహప్రయత్న మేమియు జరుగుచుండలేదని యామెవలన తెలుసుకొంటిని. ఆమె జాతకమున వివాహసహమబిందువు సింహరాశి ౪-వ భాగలో నున్నది. దినవర్షపద్ధతిలో నిది చలించి యీవయస్సునకు సింహరాశి ౧౯-వ భాగకు వచ్చుటంజేసి, సప్తమాధిపతి యగు శనికి పూర్ణకేంద్రదృష్టి పాలయియున్నది. రెండు సంవత్సరములలో నిది చలితశనికి కేంద్రస్థానమును పొందఁగలదు. వివాహమును సప్తమాధిపతి ద్వేషించుచుండఁగా, వివాహ మెవరికొఱకు? ఇది దాంపత్యమునకు తగని కాలము. ఈవిషయ మాచిన్నదాని కెఱిఁగించి, ఈలోఁగా పెద్దలు వరనిశ్చయము చేయఁబూనినచో, వరుని జాతకమును బాగుగా పరీక్షించుట యుచితమని సూచించితిని. అట్లే చేయింతునని యాచిన్నది చెప్పెను.

ఇట్లు మాటలాడిన తరువాత కొన్ని గంటలకే ఆకన్యకసోదరుఁడు స్వగ్రామమునుండి వచ్చి, తోడనే పిల్చుకొని రమ్మని తండ్రి తన్ను పుత్తెంచినాఁడని చెప్పి, ఆత్రమున నాకన్యకను పిలుచుకొని వెళ్లిపోయెను. అంత యాకస్మికకార్య మేమో తెలియక అందరు నాశ్చర్యపడిరి. నాకుమాత్ర మేమొ తంతు జరుగుచున్నదను నమ్మకముండెను. తరువాత మూఁడు దినములకే ఆచిన్నదానికి వివాహమైనదని విని మనస్సు చాల నొచ్చినది.

ఇంత యాకస్మికముగ నీకన్యక నాకర్షించిన యావరుని జాతకపు గ్రహ మెవరుండురు? ఇంద్రుని కార్యమే యుండు ననుకొంటిని. కుతూహలమున నతని జాతకమును సంపాదించితినికూడ. క్రింద నున్నదే ఆ కుండలి:—

వ ౧౫-౫౬ (వ) కే ౧౧-౩౧	చ ౨౯-౦		X ౨౮-౩౦
	భర్త జాతకము		
	(సాయనము)		ఇ ౧౭-౩౮ శు ౨౯-౨౫
	న ౧౩-౧౩	బు ౩-౩౫ శ ౧౮-౩౫	శు ౩-౫౭ ర ౬-౩౯ రా ౧౧-౩౧ I ౨౮-౨౦

సప్తమభావమునుమాత్రము విమర్శింతము. వరుణుడు సప్తమభావమందుండి వియోగ క్లేశము నిచ్చుటకు సిద్ధుడుగా నున్నాడు. కళత్రస్థానాధిపతియగు బృహస్పతి వృశ్చికరాశిలో నుండి, వ్యయస్థానమందున్న ఇంద్రుని కేంద్రవేధకు గురిఅయినాడు. వివాహసహమబిందువు మేషరాశి ౨౧-వ భాగలో నుండుటచే, దానికి శనినుండి క్రూరసమసప్తకవైర మున్నది. ఆసహమాధిపతియగు కుజుడు వ్యయస్థానమును చేరుకొన్నాడు. ఆ బిందు వుండునది సాక్షాత్తుగ అష్టమభావమే! కుటుంబాధిపతియగు శుక్రుడు నీచుడై, వ్యయభావమందే యుండి, శనినుండి యర్ధకేంద్రవైర దృష్టిలో నున్నాడు. విషయసుఖస్థానాధిపతి యగు శని వివాహసహమమునకు ద్వేషియై కళత్రకారకుడగు శుక్రుని వేధించుట దాంపత్య సౌఖ్యమునకు "త్రోసి రాజు" చేయుటే యగును. ఈ శని మహాశయునికే రోగ (షష్ఠ) స్థానాధిపత్యము సయితమున్నది. అనారోగ్యము కారణముగా వైవాహిక జీవిత సుఖము దుర్లభము కావచ్చును. అష్టమాధిపతి యగు కుజుని ద్వాదశ స్థితి పై యర్థమునే బలపరుచుచున్నది.

"నిధనపే తనుగే వ్యయగేథవా
పతతి మామయబాధనయార్దితః"

అని సంకేతనిధి. లాభాధిపతి యగు చంద్రుని యష్టమస్థాన స్థితికి పయి గ్రంథము చెప్పు ఫల మెట్టిదో చూడుడు:

"లాభేశే మదగృహగేథ రంధ్రయాతే,
నో జీవే దిహ వనితా నరస్య కాపి"

ఇది యట్లుండె. భార్యాభర్తలజాతకముల గ్రహస్థితులను పోల్చిచూడుడు. రవిచంద్రుల కానుకూల్యము నున్న. కుజశుక్రులవలని రక్తి సుమారుపాటి. లగ్నముల కామకూల్య మున్నది. దినవర్ష దశలో చలిత వివాహ సహమము కన్యక జాతకములో జన్మకాలిక శనికి కేంద్రమునకు వచ్చిన దని కనుగొన్నాము కదా! ఆ బిందు వే భాగకు వచ్చుటచే శని దౌష్ట్యమునకు జిక్కినదో, అదే భాగయందే భర్తజాతకమున నింద్రు డుండుట చదువరులు ముఖ్యముగా గమనింపవలసిన యోగము! శని వేధాఫలము రానున్న కన్యక నాకర్షించి మాయమంత్రములు పఠించి మచ్చుబూడిద చల్లిన గ్రహ మింద్రుడే యని వ్యక్తమగును. కళత్రస్థానాధిపతిని ద్వేషించుచున్న ఇంద్రుని యాకర్షణము వలన కలిగిన వివాహమునుండి భర్తకు గాని, శనివేధ గల భార్యకు గాని ఏమి సౌఖ్య మబ్బునో మన మూహించుకొనవచ్చును. ఇంద్రునివలన మోసము, శనివలన దుఃఖము సూచితములు. భర్తజాతకమందలి ఇంద్రునినుండి భార్యజాతకమందలి లగ్నాధిపతి యగు చంద్రునికి, సప్తమాధిపతి యగు శనికి నిత్యమైన కేంద్ర శత్రు దృష్టియే కదా లభించినది ?

ఇట్టి పరస్పర గ్రహసంబంధమువలన నేర్పడిన వివాహ మిది! పెండ్లికాలమున కన్యారాశిలో తాత్కాలిక లగ్నమున ఇంద్రు డుదయించుచున్నాడు! మన మాహూర్తికులు నిరాదరించినా, పంచాంగములు బహిష్కరించినా ఇంద్రుడు తన పని తాను నెరవేర్చుచునే యున్నాడు గదా! ఆ సహస్రాక్షుని కన్నులు మాయ నెవరితరము ?

కొన్ని నెలలు కడచీ కడవకమున్నే యొక ప్రమాదము సంభవించినది. పట్టుమని పదిదినములయినా ఆలుమగలు కాపురము చేసియుండలేదు. భార్య పుట్టినింటిలోనే యుండినది. అత్తగారింటికి పోయి భార్యను చూచు కుతూహలముతో భర్త స్వగ్రామమునుండి యకస్మాత్తుగా వెడలి రైలుబండిలో ప్రయాణము చేయుచు, మార్గమధ్యమున స్టేషనులో బండి యాగకమునుపే ఆత్రమున దిగుటచే పట్టుతప్పి పడి అపాయముపాలై, ఆస్పత్రిలో నున్నాడని ఘోరమగు సమాచారము వచ్చినది. అత్తమామలు భార్యను పిల్చుకొనివచ్చి, అనాథుడై మంచముపై బడియున్న అల్లుని జూచి దుఃఖించిరి. భార్యదుఃఖ మడుగపనిలేదు. వివాహమైనతరువాత ఆ చిన్నదాని నప్పుడే నేను చూడగల్గుట. నన్ను చూచినదే తడవుగ నాముగ్ధ భోరున కన్నీరుమున్నీరుగా నేడువసాగెను. అప్పటి నాపరితాపము వర్ణింప

నలదికానిది. విధిలేక, ఏవో కొన్ని సాంత్వనవచనములు చెప్పితిని. సౌమంగల్యమున కేబాధయు నుండదని ఆశ్వాసించితిని.

"ఈనిర్భాగ్యసౌమంగల్యజీవితము నా కేనాళ్లు ?" అని యాసుమంగలి బిట్టు వాపోయెను. బంగారువంటి యాపడుచునకు సంభవించిన యీఘోరప్రమాదమును విని కంటతడిపెట్టని పాపాత్ము లుండరు.

నెలలకొలఁదిగ మంచముప్రక్కన నిలిచి యాస్త్రీలో భర్త కామె ఉపచరించినది. చేతనయినంత చేసి వినికి, "ప్రాణభయము లేదు. ఇఁక పోవచ్చును" అని వైద్యశాలాధికారులు సెలవిచ్చినారు. అస్థిసంధులు కొన్ని దెబ్బతిని స్వస్థానములు తప్పిపోయియుండుటచే చలనశక్తిని గోలుపోయి మంచముపట్టియున్న భర్తను మెల్లగ తన పుట్టినిల్లు చేర్చి, అతన్వి యతనిని సేవించుచుండినది. కాచి, కట్టి, రాచి, తోమి, ఏమేమో మందులు మాకు లుపయోగించి, శ్రద్ధాభక్తులతో సంవత్సరకాల ముపచరించఁగా, భర్తకు కఱ్ఱయాధారమున నాలుగడుగులు పెట్టు శక్తి వచ్చినది. నూఱేండ్లు సంసారము చేయఁగలిగిన పతివ్రత లార్జించఁగల పుణ్య మాసువాసిని యేడాదిలో సంపాదించిన దన్నను తప్పగాదు. అంతలో నామె రోగగ్రస్త అయినది. మనోరోగమే చాలదా? ఆకస్మికముగా భర్తృసాన్నిధ్యమందే యీనెల (నవంబరు) ౨-వ తేదీన, ఈసాధ్వీరత్న మిహలోకయాత్ర చాలించుకొని పుణ్యలోకముల కరిగినది. సర్వేశ్వరుఁ డామెయాత్మకు శాంతిని ప్రసాదించుఁగాక !

చలితవివాహ బిందు విపుడు చలితశనిస్థానమునకు పూర్ణ కేంద్రమునకు వచ్చినది. జన్మశని కేంద్రమునసంపాదించుకొన్న వైవాహికజీవిత మీవిధముగా పరిణమించి, చలితశని కేంద్రమునకు వచ్చినపుడు పర్యవసానమును బొందినది.

దశమ కేంద్రమున బృహస్పతి, లగ్న కేంద్రమున నింద్రుఁడు కల ముహూర్తమున నయిన వివాహ మిట్లు పరిణమించినది. ఇఁక లగ్న కేంద్రమున బృహస్పతి, చతుర్థ కేంద్రమున నింద్రుఁడు కల ముహూర్తమున జరిగిన మహారాజపుత్రుని వైవాహికజీవిత మెట్లున్నదో? ఎట్లయిననేమి, కేంద్రమందు బృహస్పతియున్నాఁడని ఇంద్రావరుణగ్రహముల నేమరుట తగదని మన కీకథ బోధించుచున్నది.

"ఇంద్రో న శ్శర్మ యచ్ఛతు"



కంపెనీప్రభుత్వారంభంనాటి

ఆంధ్రదేశపు ఆర్థికపరిస్థితులు

= శ్రీ అజ్జరపు వేంకటరమణరావు =

"తెలంగాణంలోని ప్రతిమంటిగడ్డ ప్రఖ్యాతచరిత్రగాథలు చెబుతుంది; ప్రతి సెలయేరూ తన ప్రత్యేకపూర్వసుఖానుభవాలను పాడి వినిపిస్తుంది" అని వ్రాస్తాడు విల్కుస (wilks) చరిత్రకారుడు.

కాని, పదునెనిమిదవ శతాబ్దపు మధ్యకాలంలోని మన దేశపరిస్థితులను గనక మనం చూచినట్లయితే యిలాంటి రచనలను విని ఆనందించగలిగే అవకాశం మన చరిత్రలో ఏనాడయినా కలిగిందా, లేక భవిష్యత్తులోనైనా కలుగుతుందా అన్న అనుమానం రాక పోదు. ఆనాడు దేశంలో ప్రజాగౌరవాదరాలకు గురిఅయిన ప్రభుత్వవిధానం పోయింది. కేంద్రప్రభుత్వంలోని అధికారం అతిసీరస స్థితిలో పడిపోయింది. రాజ్యాంగఅంతరాభాగాలకు అధికారం ప్రవహింపగలిగే శక్తి శూన్య మయిపోయింది. దేశం అంతా ఆమోదించే ఏకైకప్రభుత్వం లేదు; ఏకైక శాసనం లేదు; ఏకైకచట్టం లేదు. యూరపు ఖండంలోని మధ్యయుగకాలంనాటి (Middle ages) విపరీతమయిన ఫ్యూడలుపరిస్థితులు, అశాంతి, అల్లకల్లోలం యిక్కడకూడా ప్రతిఫలించాయి. అనేక చిన్నచిన్న వంశాలు అధికారస్థానంలో కుక్కగొడుగుల్లా మొలిచేవి; మరునాడే చనిపోయేవి. వాటి స్పృహ దేశంమీద మబ్బునీడల్లా పాకిపోయేది. ఈ గుబులుకాలంలో దేశం కుమిలిపోయేది.

ఈభూములు మొదట కళింగసామ్రాజ్యంలోనూ, తరువాత ఆంధ్రరాజుల పరిపాలనలోనూ వుండేవి. ౧౩-వ శతాబ్దంలో బీదరునవాబుల అధికారంలోకి ఒదిగి, తరువాత మొగలాయీప్రభుత్వంలో ప్రవేశించి, క్రీ. శ. ౧౬౮౭ లో అలంఘీరుపాదుషాకు నమోదుఅయి, క్రీ. శ. ౧౭౨౪ లో దక్కను రాజ్యభాగంలోకి దిగజారి, హైదరాబాదు నిజాముకుటుంబకలహాలలో క్రీ.శ.౧౭౫౯లో ఫ్రెంచిప్రభుత్వంచేతులలోపడి, అప్పటినుంచీ యుద్ధాలలో ప్రభువులను మార్చుకొంటూ తిరిగి నిజాముఅధీనంలోకి పోయి, క్రీ. శ. ౧౭౬౬ లో నైజాము దానరూపేణా ఉత్తర సర్కారులు కంపెనీప్రభుత్వానికి ధారాదత్త మయినాయి.

ఇవన్నీ పూర్తిగా జమీందారీ, హవేలీ భూములుగా వుండేవి. దేశం అంతా అడవులూ కొండలతో నిండివుండేది. బాటలు లేవు; ప్రయాణమార్గాలు లేవు; న్యాయాన్యాయవిచక్షణలు లేవు. అధికారం లేనినాడు సంక్రమించే అనర్థాలన్నీ ఆనాడు మనకు వున్నాయి. ఈజమీందారులు కొండలమీద కోటల్లో నివసించేవారు. వారి రాతి

కోటలచుట్టూ కందకాలూ, అరణ్యాలూ అల్లుకొనిపోయి వుండేవి. దేశం అంతా కొండలమయం; అందుచేత వారు ఏ ప్రభుత్వం వచ్చినా తిరగబడేవారు. దోపిడీలు చేసేవారు; ప్రజలను హింసించేవారు; అనేకవిధమయిన శిస్తులు వసూలుచేసేవారు. కాని బ్రిటిషుప్రభుత్వానికి అధికారము వచ్చినా, కంపెనీవుద్యోగులకు వారిని శిక్షింపగలిగే శక్తిసామర్థ్యాలు లేవు.

ఈజమీందారులు మూడు తెగలుగా వుండేవారు: (౧) కర్ణాటకసామ్రాజ్యంనుంచి మొగలుప్రభుత్వం తరిమితే యిక్కడికివచ్చిన వెలమలు; (౨) ఓఢ్రరాజ్యంనుంచి యిక్కడికి చేరుకొన్న రాచవారు; (3) ఇదివరకు రాజ్యాలలో సైనికపటాలాలలో పనిచేసిన యోధుల సంతానమయిన ఓఢ్రులు.

వీరందరికీ పెద్ద పరివారాలు వుండేవి. వీరందరూ స్వతంత్రప్రభువులుగా అధికారం చలాయించడం ప్రారంభించారు. వీరి సిబ్బందీ అంతా మూడు రకాలుగా వుండేది: (i) జీతాలు యిచ్చి, దగ్గరవుంచుకోవడానికి అలవాటయిన మామూలుబంట్రోతులు; (ii) యిచ్చిన భూములకు నామకః కొంత పన్ను కట్టి, వాటిని సాగుచేసుకొని జీవిస్తూ, వారి అధికారంకింద వుండే మొఖాసాబంట్రోతులు; (iii)తరతరాలుగా వారి అధీనంలోనే వుండి, వారి భూములను సాగుచేస్తూ, వారితో సంబంధం వదలక, వారి పరిచర్యకోసం వుండిపోయిన మనువర్తి బంట్రోతులు.

ఈ జమీందారులు ఎక్కడికి దాడి వెళ్లినా యీపరివారం అంతా వారిని వెంబడించేది. వారి పొగరుబోతుతనాన్ని అణచి అణకువలోకి తేగలిగే శక్తి వున్న ప్రభుత్వం కాదు కంపెనీప్రభుత్వం. కొత్తగా వచ్చిన దేశంలో, బలవంతులయిన యీప్రభువులతో తగవులాడడానికి వారికి సాహసం లేకపోయింది. దేశంలోని శాంతికోసం వారిమీదనే ఆధారపడి కంపెనీ, వారినే, దోపిడీలు జరగకుండా చూడమనీ, ప్రభుత్వపు సుంకాలను వసూలుచేసి, తాము కొంత తీసుకొని తక్కినది ప్రభుత్వానికి అప్పగించమనీ కోరారు. ఇంతకంటె ఆపరిస్థితులలో తమకు తామై జోక్యం కలుగజేసుకొని చేయగలిగింది ఏదీ లేదని కంపెనీ నిశ్చయించుకుంది.

ఇక క్రీ. శ. ౧౭౫౯ నుంచి క్రీ. శ. ౧౭౬౬ వరకు, ఆ ఏడుసంవత్సరాలూ మన దేశచరిత్రలో ఏనాడూ కనివిని ఎరుగని బ్రహ్మాండమయిన అరాజకం యీభూముల్లో చెలరేగిపోయింది. ప్రభుత్వాధికారంయొక్క చిహ్నాలుగాని, తత్సంబంధమైన సూచనలుగాని, ప్రభుత్వం అంటూ అసలు ఒకటివుంటున్నదన్న స్పృహగాని ఏకోశంలోనూ కనిపించలేదు. ప్రభుత్వం అన్న మాటే దేశచరిత్రనుంచి చెరిగిపోయినట్లుగా అనిపించింది. తాబేదారులు అధికారులుగా, యజమానులు జమీందారులుగా, నౌకర్లు ఉద్యోగులుగా మారిపోయారు. ప్రభుత్వోద్యోగులు లంచగొండితనంతో రాజ్యభాగాలను తమసొంతఆస్తిలా దానధర్మాలు చేశారు. అడిగేనాథుడూ లేడు; శిక్షించే ప్రభువూ లేడు.

కంపెనీ ప్రభుత్వానికి యీ పరిస్థితులు చాలా గందరగోళంగా కనిపించాయి. ప్రజల సంఖ్యను, పరిస్థితులను, పరిశ్రమలను, పన్నులను గురించి విచారణచేసి ప్రభుత్వానికి తెలియజేయమని ఒక సర్క్యూట్ కమిటీ

(circuit committee) ని ౧౭౭౫ లో కంపెనీ ప్రభుత్వంవారు పంపారు. ఇది కారణాంతరాలవల్ల కొలదికాలంలోనే ఆగిపోవలసి వచ్చింది. కాని ౧౭౮౩ లో యీ విషయాలను గురించి దరియాప్తు చేయాలని ఇది తన పర్యటనం ప్రారంభించింది.

అప్పుడు మన దేశపు వాతావరణపరిస్థితులు అతివిచిత్రంగా వుండేవి. తూర్పుతీరంలోని ఉత్తరభాగంలో ఆగష్టునాటికి వర్షపు జల్లులు చిలకరించేవి. పునాసపంటలు పండేవి. జనవరినాటికి వరిపొలాలలోని పంటలు పూర్తి అయిపోయేవి. వేసవికాలం అంటే ఉత్తర జిల్లాలకు సౌఖ్యంగా వుండేది. సముద్రప్రాంతంకనుక. కాని కృష్ణానదిపరిసరాల్లో యిసుక భూములలో యీ వేసవిఎండల తీక్ష్ణతకు పంటలు మలమల మాడిపోయేవి. పశువుల మందలు చనిపోయేవి. ఇండ్లల్లోకూడా ౧౦౫, ౧౦౬ డిగ్రీల వేడిమికి ప్రజలు తాళుకోలేకపోయేవారు. ఈ ఎండలకు సాయం ఋతువులు మారితే, కొండలమీంది అడవులలోనుంచి గాలిదుమారాలు గుప్పున వచ్చేవి. వాటి రాకతో ప్రజలు కొండజ్వరాలకు పాలై పడకలుపట్టి పడిపోయేవారు. వారు త్రాగే నదీజలాలు మరీ అపాయకరంగా వుండేవి. అవి కొండగుహలలోనుంచి వచ్చేటప్పుడు అక్కడి అరణ్యాలలో కుళ్లిన పళ్లు, ఆకులు, చెత్త వీటిలో నాని, యింకా యివతలకి వచ్చేసరికి యినుము, రాగి కలిగిన గుట్టలమీందనుంచి పారి యీప్రదేశాలలోనికి వచ్చేసరికి చాలా అనారోగ్యకరంగా వుండేవి. కాని భూములు మటుకు ఎంతో సారవంత మయినవి. మిలమిల మెరిసే రేగడి నేలలు; బంగారమైనా పండించగలిగినపల్లపు భూములు! ఏవైపు చూచినా చక్కని నదీ ప్రవాహాలు నిరంతరం నేలను తడిచేస్తుంటే, పంటలు సమృద్ధిగా పండేవి. పాడిపంటలకు కొదువలేని దేశంగా వుండేది ఆ దేశం. ఆవులు, గేదెలు, గొఱ్ఱెలు, మేకలు బీళ్లల్లో కడుపునిండా కమ్మగా మేసేవి. గొఱ్ఱెల వూలుతో చక్కని వున్నిబట్టలు నేసేవారు. పత్తి, నీలి, వరి, చెరకు సమృద్ధిగా పండేవి. దేశంలో భాగ్యవంతమయిన వర్తక వ్యాపారం జరుగుతూ వుండేది. చక్కని ఉన్నిబట్టలు, బరంపురంసిల్కులు, ఏలూరు తివాసీలు, బందరు కలంకారీ అద్దకాలు, కోరంగిలోని నౌకా పరిశ్రమ ఇత్యాదులు ప్రపంచ విఖ్యాతిని గడించుకొన్నాయి. సాలుకు ౭౫ లక్షల పెగోడాల విలువ కలిగిన వస్తువులు సర్కారులనుంచి సరఫరా చేయబడేవి.

అప్పటి రెవిన్యూవిధానంకూడా యిప్పటికంటె చాలా విభిన్నంగావుండేది. పండిన పంటలో సగం రైతుకు విడవడం హిందూ రాజ్యధర్మం. నీటివసతులు సరియయినవి లేక రైతే నీరు మోసుకొని పంట పండించుకోవలసివచ్చిననాడు అతనికి పంటలో ౧/౩ భాగం యియ్యడం పరిపాటి. ఇదిగాక కొన్నివర్గాలకు కొంతమందికి ఎక్కువభాగం యిచ్చేవారు. ముఖ్యంగా బ్రాహ్మణులకు, భూములను కొత్తగా సాగునకు తీసుకొన్న రైతులకు యీ లాభం వుండేది. చేనులోని పంటను కోసేముందు గ్రామంలోని పెద్దల సమక్షంలో పంటయొక్క మొత్తాన్ని ఆ గ్రామంతో సంబంధం లేని పెద్దలచేత కొలిపించేవారు. అది రైతుకు అన్యాయంగా కనిపిస్తే, ఇంకొకమారు యీఅంచనా జరిగించేవారు. అప్పుడు ప్రభుత్వం తీసుకొనే భాగం

ధనరూపేణా కావాలో, లేక వస్తురూపేణానే కావాలో నిర్ణయించేవారు. ధనరూపేణా యివ్వవలసినప్పుడు అది ముందరనే చెల్లించ వలసి వచ్చేది. అందుకోసం డబ్బు నూటికి నెలకు మూడు, లేక నాలుగు రూపాయల వడ్డీతో, తమపంటను హామీయిచ్చి తేవలసివచ్చేది. దానితో తమపంటను తమకిష్టమయిన ధరలకుఅమ్ముకొనే స్వాతంత్ర్యంపోయి, షాహుకారుచేతులలోనే రైతులు చిక్కుకోవలసి వచ్చేది.

ఇక తోటలమీద శిస్తులు. పంటలో నాలుగు, లేక ఎనిమిదవ భాగంకంటె ప్రభుత్వం వసూలుచేసేది కాదు. రైతు మొక్కలకు నీరు పోసి పెంచడం, పండ్లను దూరపు అంగళ్లకు తీసుకొనిపోయి అమ్ముకోవలసి వుండడం మొదలైన కష్టాలను ఆలోచించి, ప్రభుత్వం యీపన్నులను తేలికగానే విధించేది. ఇదీ ప్రాచీన హిందూరాజ్యాలలో ప్రభుత్వం పాటిస్తూవచ్చిన పన్నుల విధానం.

కాని, తరువాతతురుష్కప్రభుత్వాల అధికారంలో ఇది అనేకమార్పులుచెంది, అనేక అన్యాయాలకు దారితీసింది. రైతులు మోయలేనిపన్నుల భారాలు వారి నెత్తిన వేశారు. దానితో రైతులకు భూముల సాగుబడిమీద వుండే యిష్టం కాస్తా మటుమాయమైపోయింది. వారి శక్తిసామర్థ్యాలు క్షీణించాయి. ఏ ప్రత్యేకసూత్రమూ లేని పన్నుల విధానంతో దుర్భిక్షం పెచ్చుపెరిగిపోయింది. మొదట శిస్తును ధనరూపకంగానే చెల్లించాలని నిర్ణయించినా, పంట ఏపుగా గనక పెరిగితే, ఏ సంకోచమూ లేకుండా చేనులోని పంటను వసూలుదారులు బలవంతంగాఅపహరించేవారు. ఒకవేళ శిస్తును ధనరూపేణాయిస్తే, ముందరనే యిచ్చుకొన్నడబ్బుకు ఋణదాతలకు యివ్వవలసిన వడ్డీతో రైతులు బాధపడేవారు. ఇక యీ రెండూ కాక, దురదృష్టం కొద్దీ, వర్షపుచినుకు లేక పంటలే పూర్తిగా పోతే ప్రభుత్వపు ఉద్యోగులు వారిమీద పడి డబ్బుయిచ్చేదాకా వారిని పీడించేవారు. ఈపన్నులు చెల్లించేదాకా రైతులు వీరిని మేపాలి. ఈవుద్యోగులు వారిపైచేస్తూవచ్చిన దురాగతాలకు అంతూ పొంతూ వుండేది కాదు. తమ బంధువులకోసమో, స్నేహితులకోసమో ఆ రైతులు అష్టకష్టపడి బాగుచేసి సాగుచేసే సారవంతమయిన భూములను వారివద్దనుంచి తమ స్వాధీనం చేసుకొని ఆ నిస్సహాయపు అమాయక రైతుజనాన్ని తమ బండ్లతో, ఎడ్లతో, కుటుంబాలతో యీ భూములమీద వెట్టిచాకిరీ చేయమని నిర్బంధించేవారు.

ఈపరిస్థితులు యిట్లుండగా, యింకను యితర పన్నులసంగతి మరీ అన్యాయంగా వుండేది. వీటిని మామూలుగా 'Sayer' అనే పదంతో పిలిచేవారు. ఈ పన్నులు జంతువులమీద, పాడిపంటలమీద, మనుష్యులమీద, ఉప్పుమీద, దైనందినజీవితావసరాలమీద సమస్తంమీదా ప్రతిచోటా విధించేవారు. ఈ పన్నులు వసూలుచేసే వుద్యోగులు లంచగొండితనంతో ప్రజలను అనేకవిధాల హింసించేవారు. అడుగడుగునా, ప్రతిఊరిమొగలోనూ ఒకేవస్తువుమీద లెక్కలేనన్నిసార్లు యీపన్నులను ప్రజలు యిచ్చుకోవలసి వచ్చేది. దానితో పరిశ్రమలు నశించాయి. కర్షకులు హీనస్థితిలో పడి కుంగిపోయారు. వర్తకులు అధైర్యంతో వ్యాపారంనుంచి విరమించుకొన్నారు. వాణిజ్యం లేదు;

వ్యవహారకేంద్రాలు లేవు; అధికారం లేదు. ఈపరిస్థితులకు పరిహారమే లేకపోయింది. ఈ పన్నులతో ఆగిందనుకొన్నారా దేశదరిద్రం? లేదు. ఇంకా 'Moturpha' పన్నులని వేరే పన్నులు వుండేవి. అవి యిళ్లమీద, వ్యవసాయంమీద, వృత్తులమీద, వర్ణభేదాలమీదా వసూలుచేసేవారు. దానితో అరాజకంతోపాటు ఆర్థికదౌర్భాగ్యస్థితికూడా పరిపూర్ణత్వం పొందింది.

నెల్లూరుపరగణాను ౧౮౦౧-వ సం.లో నవాబులవద్దనుండి కంపెనీవారు సంపాదించారు. యుద్ధ బీభత్సం, పటాలాల దోపిడీ యీప్రదేశాన్ని అంతగా కలవరపరచలేదుగాని, ప్రభుత్వపు ముఖ్యనగరుకు సమీపంలో వుండడంమూలాన కొన్ని అవినీతులకు లోబడి ప్రభుత్వం నీచంగా ప్రవర్తించవలసిన దురవస్థ తప్పలేదు. నవాబుల క్రూరత్వానికి ఆహుతి అయిపోయిన తెలుగురైతులకు నాగటిచాలు, పాడిదూడలుతప్ప మిగిలిన ఆస్తి ఏదీ వుండేదికాదు. ప్రజలలో భాగ్యవంతుల శాఖయే లేదు; ప్రజాబాహుళ్యం పరమదరిద్రస్థితిలో జీవించేవారు. గ్రామాధికారులు మటుకు ఆస్తులు బాగా సంపాదించుకొన్నారు. అధికారం సరిగా చలాయించలేని ప్రభుత్వంకింద వారు యథేచ్ఛగా ప్రవర్తించేవారు. ప్రజలనుపీడించేవారు. వర్తకవ్యాపారం ఏకొద్దిమందికో జీవనాధారంగా వుండేది. ఆరోజులలో వ్యాపారాని కనువయిన మార్గాలుగాని, రాచబాటలుగాని లేవు. ఎక్కడ చూచినా బందిపోటులు, దారిదోపిడీలే! అపరిమితమయిన ధననష్టం, ప్రాణభయం! ఆనాడు వరి, ప్రత్తి, పొగాకు, నేతగుడ్డలు మొదలైనవాటిని సముద్రమార్గాన్నే ఎగుమతి చేసేవారు. మొగలాయీవర్తకులు యీసామగ్రిని కొని బ్రాస్రా, పర్షియాదేశాలకు తీసుకొనిపోయి అక్కడ స్వయంగా అమ్ముకొనేవారు. ఈ వ్యాపారంలోనికి కంపెనీకూడా దిగడంతో మన తెలుగునాటి వర్తకవ్యాపారం యీ చవుకఅమ్మకపు అంగడులధాటికి ఆగలేక తప్పనిసరిగా క్షీణించవలసివచ్చింది. అదిగాక, యీవస్తువులను ఒకచోటినుంచి యింకొకచోటికి మోసుకొనిపోవడానికి బండ్లుగాని, బాటలుగాని సవ్యంగా లేని ఆకాలంలో ఎంతో ఎక్కువఖర్చు అయ్యేది. అదిగాక, రోడ్లమీద ప్రాణభయం, దోపిడీభయం ప్రజలను హడలెత్తించేది. ప్రతిచోటా మోసం, దౌష్ట్యం! ఆనాడు సాంఘికజీవితం సర్వవిధాలా అతిహేయమయిన పరిస్థితులలో పడిపోయింది. నూటికి తొంభయిమంది వ్యవసాయంమీద బ్రతికే దేశం; వారి నెత్తిన మోయలేనంత బరువుతో లెక్కలేనన్ని పన్నుల భారం! అరాజకం, అశాంతి, న్యాయాన్యాయవిచక్షణలకు దక్షత లేని ప్రభుత్వం! పరిపూర్ణమయిన అధికారంతో మదించిన భూస్వాములు ఒకప్రక్కన, అంతకంటె సర్వాధికారం తమ చేతులలోనే వుందనుకొని విర్రవీగే గ్రామాధికారులు యింకొక ప్రక్కన తమతమ అనుచరులతో గ్రామాలమీద పడి దోపిడీలు చేసేవారు; చేయించేవారు. ఒకరి ప్రయత్నాలకు ఒకరు అడ్డువస్తే, యీ రెండుతెగలూ ఘోరంగా యుద్ధంచేసి గ్రామాలను ధ్వంసంచేసివేసేవి. ఈ గందరగోళానికి చిందరవందర అయిపోయిన ప్రజ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని, తలదాచుకోడానికి తత్తరపడేవారు. ఇటువంటి సందర్భంలో యీ స్థితిలోనుంచి

దేశం ఒక్కమారుగా కంపెనీ ప్రభుత్వంవల్ల బాగుపడి శాంతినీ, సౌఖ్యాన్నీ అనుభవించ గలుగుతుందని ఆశించడానికి అవకాశం ఎంత మాత్రమూ కనిపించలేదు.

ఇక రాయలసీమవంకకు తిరిగి అక్కడి స్థితిగతులు ఆనాడు ఎటులుండేవో పరికిద్దాం. కడప, కర్నూలు, బళ్లారి, అనంతపురంజిల్లాలను క్రీ. శ. ౧౮౦౦ సం.లోనే కంపెనీ ప్రభుత్వానికి నైజాము వొప్పగించాడు. బ్రిటిషుసైన్యాలతిండిఖర్చులకుయీప్రదేశాల ఆదాయం వినియోగించుకోండి అని చెప్పి మరీ అప్పగించాడు. ఆనాటి యీప్రాంతాలను గురించి వ్రాస్తూ మన్రో ఇలా అంటాడు: "యావద్భారతదేశంలోనూ యింత అన్యాయమయిన పరిస్థితులలో పడి, అరాజకంలో వేగిపోయే ప్రాంతం ఇంకొకటి వుంటుందని ఊహించుకోవడం కలలోనైనా సాధ్యం అవుతుందని అనుకోలేము. ప్రజలకు ఏతరంలోనూ ప్రభుత్వపు విధానానికి అలవాటు పడిన స్పృహగాని, అలవాట్లుగాని ఎంత మాత్రమూలేవు. అధికారం అంటేనూ, ప్రభుత్వం అంటేనూ, శాసనానుసారంగా అనుష్ఠేయమైన జీవితవిధానం అంటేనూ యీ ప్రజలకు ఏమీ అర్థం అయినట్లు కనిపించదు. అలాంటి జీవితానికి అవకాశం వుంటుం దన్న ఆలోచనే వీరికి లేనట్లు తోస్తున్నది. ౮౦ మంది భూస్వాములు 30,000 మంది అనుచరులతో గ్రామాలను దోపిడీచేస్తూ, ప్రజలను హింసిస్తూ, అనేకవిధాల పన్నులు వసూలు చేస్తూ, జంతువులనువేటాడినట్లు ప్రజను పీడిస్తూవుండేవారు. ఇదిగాక నవాబుసైన్యాలు పొలాల మీద పడి పంటలు దోచుకొని ప్రజల జీవితం మరీ దుర్భరం చేస్తూవుండేవి. వారు చేస్తూవచ్చిన అక్రమాలకు అంతే లేదు. అడిగే నాథుడు లేడు."

క్రీ. శ. ౧౮౩౮ లో కంపెనీ కర్నూలు జిల్లాను నవాబులనుంచిస్వాధీనంచేసుకున్నది. అక్కడి పరిస్థితులు యింకా విచిత్రంగా, మరీ విపరీతంగా వుండేవి. ఆ నవాబుల కాలంలో స్పష్టంగా చెప్పుకోదగ్గ రెవిన్యూ విధానం ఏమీ లేదు. ప్రభుత్వానికీ, ప్రజాసామాన్యానికీ మధ్య ఏశాసనాలూ లేవు; ఏచట్టాలూ లేవు. ప్రజల సుఖదుఃఖాలు కేవలం ప్రభువుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వుండేవి. నవాబు ఏది తలచుకుంటే అదే చట్టం; ఏది అనుకుంటే అదే శాసనం. అంతులేని దురాగతాలూ, దౌర్జన్యమూ ఒకవైపున; వాటి కాగలేని రైతులు దేశాన్నీ, భూములనూ విడిచి పలాయనం కావడం ఇంకొక వైపున; ఈ దుస్థితికి తిరగబడి, బయటికి పోలేక, తిరగబడలేక కృశించి నశించే రైతుజనం మరొకవైపునా దేశం యొక్క క్షీణదశను విస్పష్టంగా నిరూపించేవి. సరియయిన రెవిన్యూపద్ధతికోసం ప్రయత్నించిన ప్రభువే ఆనాడు లేడు. కంపెనీప్రభుత్వం మన్వర్ ఖానును నవాబుగా చేసిన రోజుల్లో, పాతదస్తావేజులు తీయించి పూర్వపు రెవిన్యూవిధానాన్ని గురించిన విషయాలు ఆ కాగితాలకట్టలలో దొరుకుతాయేమోనని వెతకడంకోసం ప్రయత్నించారు. కాని, ఆ పాతకాగితాల దస్త్రాలను చూడడానికని నియోగింపబడిన బ్రిటిషుసైనికులకు ఆదస్త్రాలకు చుట్టిన చక్కని రంగురంగుల అద్దకాల గుడ్డలమీద ఎక్కడలేని వ్యామోహం బయలుదేరింది. దానితో వారు దస్త్రాలన్ని

టిని యిష్టం వచ్చినట్లు కలగూరగంపగా విప్పి పడవేసి ఎవరికి కావలసిన గుడ్డలను వారు పంచుకొని కాగితాలను వాటిగతికి వాటిని విడిచిపెట్టినారు. దానితో పాత రెవిన్యూ పద్ధతులను కనుక్కోడానికి ఆరంభించిన ప్రయత్నం యీ కాగితాలను మరీ అధ్వాన్నపు గతిలోకి పడదోసింది. మళ్లీ అంత కంత కష్టపడి, ఆయాసంవత్సరాల లెఖ్ఖలను కాగితాలను విలేవారీగా విడదీసి, ఆ పాత పురాణాలను జాగ్రత్తచేయించే ఓపిమి నవాబుకు లేకపోయింది. అపని అనవసర మయిన వృథాశ్రమగా అతనికి అనిపించింది. ఆయన తన ఏనుగుల నన్నిటినీ పంపి, ఆ కట్టల నన్నిటినీ గంగానదీగర్భంలో చల్లగా జారవిడిపించాడు. దానితో నవాబుల పరిపాలనలోని అరాజకం, హింస, ద్రోహం నదీగర్భంలోనుంచి కాలగర్భంలో లీనమయి పోయి ముందరి తరాలకు బొత్తిగా తెలియని పరిస్థితు లయిపోయినాయి.

ఈ నవాబుల పరిపాలన అతిహేయ మయిన స్థితిలో వుండేది. ప్రభుత్వవిధానంలో ఏ ప్రత్యేకపద్ధతికీ గౌరవం లేదు. ఏప్రత్యేక విధాన అవసరమూ వారు గుర్తించలేదు. ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే డబ్బుకు సరి అయిన జమాఖర్చులు లేవు. గ్రామాధి కారులు వారికి నియమితమయిన కార్యకలాపానికి వారు అతీతులయిపోయి చిన్నచిన్న జమీందారులుగా తయారయి ప్రజలను కన్నరీతిగా హింసించడం పరిపాటిఅయి పోయింది. వారిపైన అసలే బాధ్యత లేని నవాబుల ప్రవర్తనతో ప్రజల జీవితం మరీ దుస్తరమయిపోయింది. జనానాయే వారి ఖజానా. అక్కడనే రాష్ట్రధనపునంచులన్నీ పడివుండేవి. నవాబు మొదటనేమో న్వాంతంగా రైతులకు ధనరూపకంగానే శిస్తులు చెల్లించాలని కవుల్లు వ్రాయించియిప్పించే వాడు. కాని, తర్వాత పంట బాగా పండితే ఏ సంకోచమూ లేకుండా సర్వం హరించే వాడు. ఈబాధలు పడలేక, సారవంతమయిన నంద్యాల భూములనుండికూడా అనేకమంది రైతులు తమ పొలాలను వదులుకొని, యీ అరాజకంలోని ఈనవాబుల దౌర్జన్యానికి మరి ఆగలేక దిక్కుదిక్కులకు వలసపోయారు. ఎన్నో భూ ము లు బీడుపడిపోయినాయి. అయినా నవాబులు మాత్రం చలించలేదు. మిగిలిన ప్రజనే హింసించి వారిచేతనే భూములు దున్నించేవారు. కాని, కడకు ఆరైతులకూ అదేగతిపట్టేది. ఈబాధలనుంచి విముక్తికోసం తెలుగుదేశంలో ప్రతిచోటా ప్రజలు తహతహలాడిపోయారు.

కంపెనీప్రభుత్వం మన తెలంగాణంలో కాలుపెట్టేసరికి యివీ ఆనాటి మన సాంఘిక పరిస్థితులు !

నా రమణాశ్రమయాత్ర


= శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు =

ఒకనాడు రామనామస్మరణమున "రమణ, రమణ" యని ధ్వని వినిపించినది. ఆధ్వని ఏలనో శ్రవణ సుఖకరమైనది; హృదయానందదాయకమైనది. మనస్సు నైసర్గిక వేగమునం దొక్క దూకు దూకినది. కాని కర్మయోగపు పగ్గములు తటాలున దాని కళ్లే గట్టిగ పట్టి వెనుకకు లాగినవి. అయితే, ఆ కాంక్ష అనుదిన ప్రవర్ధమాన మైనది. రెండు మాసము లట్లట్లే జరుగసాగినవి.

"వెదక వెదక దొరుకు వేదాంతవేద్యుండు
వెదకువాని తాను వెదకుచుండు."

అను వేమనయోగి పరమోక్తి పలుమార్లు జ్ఞప్తికి రాసాగినది. అపహృతచిత్తుడై, విషయాసక్తుడగు వానికి సమాధినిష్ఠ సంభవించునా? లభించదను గీతా వాక్యము చెవులలో గింగురు మనసాగినది. తిరువణ్ణామలైకి తెరువరి నైతిని.

తిరువణ్ణామలై పోవు మార్గమునం దప్పుడప్పుడే వ్యవసాయారంభ మగుచున్నది. ఒకవంక దుక్కి; వేరొకవంక ఊడ్పు; మరొక వంక పచ్చని పైరు; ఇంకొకవంక కలుపుతీత. ఒకచోట వరి; వేరొకచోట జొన్న. అదే మామిడి తోపు; ఇదే కొబ్బరితోపు; అవిగో మోటబావులు; అల్లవిగో కొండల కోనలు; ఇటువైపున నివిగో పచ్చనిబయళ్లు! ప్రకృతి సహజసౌందర్యవిలాసినియై హృదయపీఠమున నృత్యము చేయసాగినది. ప్రకృతియే ఇంతటి ఆనంద



శ్రీ అరుణాచల దేవాలయము

సంధాయిని కాగా, పురుషు డెంతటి పరమానంద ప్రదుడు కాగలడో! మీ రిరువురి ఐక్యమునం దిం కెంతటి సౌందర్య మున్నదో! మరెంతటి శోభన మున్నదో! ఇంక నెంత సత్య మున్నదో!– అను భావము లల్లన లేక తసాగినవి. కంటి కెదురుగా కష్టజీవి కాన్పించుచున్నాడు. ఈతడే కర్మయోగి యా ? ఈతనియందు " నాది - నేను " అను అహంకార మున్నదే? ఈతడు లేకున్నచో, ఈతని ఆహోరాత్ర త్రికర్మ లేకున్నచో ప్రాణోజ్జీవన మెట్లు? సృష్టి పుట్టుకలోనే గిట్టవలె నని కాదు గదా పరమాత్మసంకల్పము! అదియే సంకల్ప మగుచో కర్తానుభవ మనునదియే యుండదు గదా ?



శ్రీ రమణాశ్రమ వాటిక

తాచేటివలె అవయవము లన్నింటిని ముడుచుకొని నిర్వికల్పసమాధిని పొందుటయేనా ఈశ్వరేచ్ఛ? అయితే ప్రకృతిసౌందర్య మెవరికొరకు? 'అతని' కొఱకేనా ? అట్లగుచో జీవులను సృష్టించు టేల?

" అన్నం న పరిచక్షీత-తద్వ్రతం. "

" అన్నం బహుకుర్వీత-తద్వ్రతం."

"న కంచన వసతౌ ప్రత్యాచక్షీత; తద్వ్రతం. తస్మాత్ యయా కయాచ విధయా బహ్వన్నం ప్రాప్నుయాత్."

(అన్నమును పారవేయగూడదు- అది వ్రతము. దానిని వృద్ధి బొందించి బహుజనోపయుక్త మొనరింపుడు.

గృహమునకు వచ్చిన ఏ అతిథియు నిరాకరింపబడరాదు. అది వ్రతము కావలెను. ఇందులకే బహుజనోపయుక్తముగ, సమృద్ధముగ అన్న మార్జింపవలయును.)

అను తైత్తిరీయోపనిషదుక్తులు స్ఫురణకు వచ్చినవి.

"ఋతంచ స్వాధ్యాయప్రవచనేచ - సత్యంచ, తపశ్చ, దమశ్చ, అగ్నయశ్చ, అగ్నిహోత్రంచ, అతిథయశ్చ, మానుషంచ, ప్రజాచ, ప్రజనశ్చ, ప్రజాతిశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ "

ఈ తైత్తిరీయోపనిషదర్థములు కనుల ముందు నాట్య మాడసాగినవి. ఈ ధర్మము, సత్యము, తపస్సు, ఇంద్రియనిగ్రహము, మనఃపారిశుద్ధ్యము, కార్య సంకల్పాగ్నిహోత్రము, నిత్యాగ్నిహోత్రము, అతిథి సత్కారము, మానుషాభ్యుదయవిద్య, సంతాన పోషణ, సతీపతి ధర్మము, కుటుంబ బద్ధులను చెప్పగా నెరిగి ఇతరులకు ప్రబోధింపవలెను. అను జీవిత విధు లొకదానివెంట నొకటి మనస్సును తిరిమితిరిమి రెచ్చగొట్టి తనువెల్ల పులకరింపజేసినవి. తర్క వితర్క భావ పరంపరలలో తన్మయత్వము గలిగినది. ఇంతలో "ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్య వరాన్నిబోధత" అను కఠోపనిషద్వాక్యము ఘంటారావము వలె హృదయకుహరమునుండి మ్రోగసాగినది. (లేవండి, మేలుకోండి, సక్రమబోధ నొంది గమ్యస్థానము చేరండి.)

తిరువణ్ణామలై రైలుస్టేషను వచ్చినది. తిరువణ్ణామలై పట్టణ ప్రాప్తి యైనది.

౨

చీకటి చెదురుచున్నది. అరుణోదయ మైనది. అరుణాచలము నాశ్రయించిన తిరువణ్ణామలై కలకలలాడసాగినది. అరుణగిరియే బంగారు పూతరేకులతో దినమణి కంజలి ఘటింపబోవుచున్నట్లున్నది. ఈగిరి చైవార మారుమైళ్లు. ఇది పురాణప్రసిద్ధము. ఇం దొకప్పుడు శివుడు మహాగ్ని జ్వాలలను జ్వలింపజేసెనని ప్రతీతి. ఇది యొకానొకప్పు డగ్నిపర్వతమై యుండనోపు.

"ఇందే స్కందాశ్రమము కలదు. అరుణాచలేశ్వరుని పురాతనదేవాలయము కలదు. ఈ మహోన్నత విశాల నగరాజము, ఈ సనాతనాశ్రమము, ఈ దేవాలయము ఈ మూడును నేడుగూడ సుప్రసిద్ధములైనవి; పునీతము లైనవి.

నూనూగుమీసము లైన రాకముందే, సర్వేంద్రియ జ్ఞానము సంపూర్ణము కాకముందే అక్షర కుక్షి యనిపించుకొనకముందే, కొంచె మించుమించుగా శైశవావస్థయందే తల్లిదండ్రులను విడనాడి అన్నదమ్ముల నలక్ష్యము చేసి 'చదువులలో కెల్ల పెద్దచదువు



శ్రీ రమణాశ్రమములోని కొలను-దానిగట్టున మహర్షి సందర్శన మందిరము


చదువుదు తండ్రీ' యని గృహమును విడిచి రమణుడు పారిపోయివచ్చినది ఈ అరుణగిరికే. ఇందలి స్కందాశ్రమమే ఈయన తపోవాటిక. ఈ అరుణాచలేశ్వరుడే ఈయన ఏకైక సద్గురువు. ఇందున్న గుహాంతరములే ఈయన నిర్వికల్పసమాధిననుభవించిన పుణ్యభూములు."

అని ఏమేమో రమణమహర్షిని గురించి చెప్పికొనుచు కొండ రాదారిని పోవుచుండిరి. రమణాశ్రమ మూరికి సుమారు ఒక మైలున్నర దూరమున మన్నది. తిరువణ్ణామలై తాలూకా ముఖ్యస్థానము. పురపాలకసంఘ మున్న పట్టణము. ఇచ్చట వేదాధ్యయన పాఠశాల లున్నవి. గీర్వాణ విద్యాలయము లున్నవి. కొండ కందగ నిండైన దేవాలయ మొండు గలదు. ఇది మహాశిలలతో కట్టబడిన గొప్ప కట్టడము. సప్త ప్రాకారములు; తొమ్మిది గాలిగోపురములు; అరమైలునకు తక్కువగాని చతురము గల ఆవరణ. ఆవరణకు

సరిపడినంతమంది ఆరాధకులు. అం దపరిశుభ్రత మేదియును లేదు. ఆలయాధికారు లిందుల కభినందనీయులు. ఇందలి శిల్పనైపుణ్య మాకర్షణీయము. అంతేకంటె ఇందొక మహత్తర విశేష మున్నది. అద్వైతవిశిష్టాద్వైతశాక్తేయ మతదైవతములు మువ్వు రిందు గలరు. ఒకవంక మహేశ్వరలింగము; వేరొకవంక వేణుగోపాల విగ్రహము; మరొకవంక పరేశ్వరీస్వరూపము. "శిరిని చేరుట కెవరికైన సావకాశము గలదు. యోగమే దాని మార్గము." అనునట్లు ఈ దేవతలమధ్య ఒక సాధువు సమాధి కలదు. ఈ సమాధియే లింగస్థాపనకు మూల మనికూడ కొందరనిరి. ఈ సమాధిలో విలీనమయిన సిద్ధుడు జందెమువన్నిన బ్రాహ్మణుడు కాడట. అయిన నేమి? బ్రాహ్మణారాధనకు మూల మైనాడు.

"ఏకుల మైతే నేమిర బ్రహ్మం
నీ కుల మైతే చాలుర బ్రహ్మం"

అను బ్రహ్మగీతాక్రందన మిచ్చట స్ఫురణకు రాకమానదు. ఈ దేవాలయము చూడవచ్చిన యాత్రికులు రమణమహర్షిని, రమణమహర్షిని చూడవచ్చిన భక్తు లీదేవాలయమును చూడకపోరు. ఈ దేవాలయము రమణాశ్రమమునకు పోవు త్రోవయందే యున్నది. ఈ దేవాలయ సప్తప్రాకారములు చూచునంత దేహిసమాశ్రయ సప్తవ్యసనములు జ్ఞప్తికివచ్చినవి. ఈ దేవాలయగోపురములను తొమ్మిదింటిని జూచినప్పుడు దేహమున గల నవరంధ్రములు స్ఫురింపకుండు టెట్లు? దేహి సప్తవ్యసనములను దాటి నవరంధ్రమధ్యస్థమగు దివ్యాత్మను సందర్శింపవలె ననియా ఈ ప్రాకారగోపుర సంఖ్యకు అర్థము? అను భావములో మనసు లగ్నమయినది. సనాతన అధునాతన నాగరకతలు రెండును గోచరించుచున్న ఈపట్టణము నట్లే వీక్షించునంతలో బండి గబగబ పరుగెత్తినది. పరిశుభ్రమగు కంకరరోడ్డుగుండ బండి పారుచున్నది. ఇరుప్రక్కల చిన్నచిన్న దేవాలయములు, మంటపములు, సమాధులు, గోరీలు చూచుచు పోవునంతలో రమణనగరము సమీపించినది.




స్కందాశ్రమము

3

రమణాశ్రమ మరుణాచలము నాశ్రయించినది. ఉత్తరమున గల అరుణాచలప్రతిబింబితప్రకృతి సౌందర్యచ్ఛాయాపరివృత మైయున్న ఈ ఋషివాటిక కనువిందుగనే యున్నది. సనాతనసన్యాసాశ్రమములవలెనే ఇందు పర్ణకుటీరము లున్నవి. కొండగుహ లున్నవి. జలాశ్రయము లున్నవి. పుష్పవాటిక లున్నవి. తరుగుల్మలతాశోభిత మైన ఈ మునివాడలో ఆధునిక నాగరకపరికరములకును, సదుపాయములకు గూడ లోటు లేదు. చక్కగ గచ్చుచేయబడి పరిశుద్ధమగు వంటశాల, భోజనశాల, దానిప్రక్కనే బోరింగు నుయ్యియు కలవు. ఈ నాతిచుట్టును ఒకప్రక్క కార్యాలయము, వేరొకప్రక్క ఋషిమందిరము, మరొకచక్కి ఇరువురు రోగుల కనువగు ఔషధాలయమును కలవు. ఔషధాలయశిరోభాగమున అతిథు లుండదగు మూడుగదు లున్నవి. స్త్రీపురుషులకు వేరువేరు స్నానముల గదులు, మహర్షి కొక ప్రత్యేకమగు స్నానపుగదియు కలదు. వేదాధ్యయనపరుల వాసమునకు వేరొక భవనము కలదు. దాని ననుసరించియే గోశాల కలదు. అచ్చటనే తపాలాఫీసు ఉన్నది. ప్రతి భవనమున విద్యుద్దీపము లున్నవి. చక్కగా తీర్చివేయబడిన బాట. ఆబాట కిరుకెలంకుల భవనములు. ఆ భవనముల ముం దచ్చటచ్చట క్రోటనులు రమణీయ

ము లనుట నిశ్చయము. ఈ యాశ్రమము నంటియున్న ప్రక్కని చిన్నితోటలో పర్ణకుటీరములందు విద్యార్థుల లైన సాధకు లున్నారు. ఆందును కొలను గలదు. ఈ యాశ్రమసముఖమున దక్షిణదిశగా మరికొన్ని భవనము లున్నవి. ఇవి రమణపరివ్రాజకుని భక్తు లుండు విడిదులు. ఒక వంగదేశీయు డిట గృహములను నిర్మించినాడు. రమణసందర్శనార్థులగు విద్యావంతులకు, ధనవంతులకు ఈ నాగరకభవనము లద్దెకొసగబడుచున్నవి. ఈఆరుగృహములపైన వచ్చు వరుమానమును బోసుగారు ఆశ్రమమునకే ఒసగుచున్నట్లు వినికిడి. ఇట మరికొన్ని



మాతృభూతేశ్వర దేవాలయములోని శివలింగము-
అంబా విగ్రహము

నూత్న భవన నిర్మాణ ప్రయత్నములు సాగుచున్నవి. ఇప్పు డిట ఈ కొండభూమి ఎకరము రెండువేల వరకు అమ్ముచున్నదట. రమణాశ్రమ నిర్మాణ పూర్వ మీ భూమికి విలువయే లేదట. దీనినే ప్రస్తుతము రమణ నగర మందురు. తొలుదొల్త అలఘమ్మ పురము. (మహర్షి తల్లి) ఆమెమరణానంతరము రమణాశ్రమ మయినది. నేడు ఆశ్రమ మొక నగరముగ పరివ్యాప్త మగుచుండుటచే రమణనగర మనుటయే సముచితము. ఈ ఆశ్రమ మంతయు ఆరు ఎకరముల ప్రదేశము.

ఇందు నలభైయైదుగు రాశ్రమవాసు లున్నారు. పదు హేనుగురు అతిథులకుకూడ వాసయోగ్యము. సుమారు ముప్పైపశుగణ మున్నది. భక్తుల శ్రద్ధాభక్తులే ఆశ్రమమున కాస్తి. (భవనములు గాక) దాతల వితరణమే ఆశ్రమవాసుల కుపాధి! రమణమహర్షి సోదరుడగు నిరంజనానందస్వామియే ఆశ్రమసర్వాధికారి. ఈయనయే ఆశ్రమమునకు వారసుడు. చిన్నస్వామి యని కూడ ఈయన పేరు.

ఆశ్రమాంగణము ప్రవేశించునంతనే ఎడమప్రక్క పునం దొక దేవాలయము గాన్పించును. ఇది అసంపూర్ణము. సామాన్యమైనది గాదు. ఎత్తయినదే. ఇప్పటికి సుమారు దీనికి ఆరులక్ష. కర్చయినది. ఇంకను మరొక ఆరులక్షతో పూర్తి కాగలదు. ఇది రమణమహర్షి మాతృసమాధి. కర్మాధికారి యైన జ్యేష్ఠపుత్రుని కోలుపోయి, కర్మసన్యాసియైన ద్వితీయు నాశ్రయించిన దావృద్ధురాలు. ఈ పూజ్యవృద్ధ అలఘమ్మ ౧౯౨౨ సం. ప్రాంతమునందు కాలగతి గాంచినది. ఆమెసమాధిలో మహర్షియే లింగస్థాపన మొనరించెను. దేవాలయము కట్టబడుచున్నది.


దీనిని దాటుట తడవుగా కార్యాలయము కట్టబడుట నున్నది. అందు ప్రవేశించునంతలో తొలుదొల్త నిరంజనానందుడే దర్శనీయు డైనాడు. ఈయనయు కాషాయవస్త్రధారియే. ఆజానుబాహుడు. కార్యాంతరమగ్ను డైయున్నాడు. 'రమణమహర్షి మందిర మెచ్చట' అను ప్రశ్న కాయనమండి కొంతతడవునకు జవాబు వచ్చినది. కార్యాలయమునకును, ఋషిమందిరమునకును మధ్య పదిగజముల ఖాళీస్థల ముండునేమో!

అందున్న నూతిని దాటి మందిరపు వసారా ఎక్కి నిలఁబడితిని. అంతే "ఇదియేనా మందిరము! ఇం దెవ్వరు నున్నట్లు లేదే!" అను సంశయ మెవ్వరికైన

తోచకమానదు. రెండడుగులు ముందునకు పోవునంత మొదటిగుమ్మము- మందిర ప్రథమద్వారము కలదు. గుమ్మముపైపునకు తిరుగునంత ఒక ఎత్తైన, పొడవైన సోఫా కన్పించినది. ఆసోఫా పరిశుద్ధమగు నేత్రానంద కరములగు అద్దకపు వస్త్రములతో చక్కగ సమర్చ బడినది. దాని కుత్తరముననే దగ్గరగా చేతికందునట్లు స్ఫటికమువలె నున్న సుంద్రమని గాజుబుడ్డిలో విద్యుద్దీప మమర్చబడియున్నది. దాని ప్రక్కనే ఎత్తగు అంతస్తులతో గూడిన చక్కని పుస్తకపీఠము గలదు. మందిరము నిశ్శబ్దముగా నున్నది. అగరువత్తుల పరిమళము మాత్రము సువ్యాప్తమగుచు ఆస్వాద్యముగ నున్నది. ఆ సుఖతరపర్యంకమునందున్న ఋషి ఎట్టి భోగియో యను భావ మప్పుడు లోన ప్రవేశించుట అసహజము గాదు. కాని కాలు లోపల బడునంత కాపీనధారియే కనుపించినాడు.

(సశేషము.)

మనసినీమాల 'బేక్‌గ్రౌండు' సంగీతం విన్న నాకుక్క—



ఈ రెండింటిలో మీకేది కావాలి?



సుఖంలేని ప్రయాణమా?



రైళ్ళు యుద్ధకృషి తమశక్తికి మించి పనిచేస్తున్నాయి. అవి తెరిపిలేకుండా ఆహారపదార్థాలను రవాణా చేస్తూ, సమంగా అన్ని ప్రాంతాలకూ పంపిణీ చేస్తూ, ఇటు ప్రయాణీకులకు యుద్ధానికి పూర్వము వున్న సౌకర్యాలు సమకూర్చడానికి రైళ్ళకు సాధ్యపడదు. ప్రజలకు వీటిలో ఏదో ఒకటి సమకూర్చ గలవు కాని, రెండూ కావాలంటే సాధ్యపడదు. నిజానికి జీవితావసరము లైన తిండి, బట్ట, బొగ్గులు మొదలైనవి ప్రయాణాలు చెయ్యడం కంటె ముఖ్యమైనవి. ఆహారధాన్యాలకు కొరతగావున్న ప్రాంతంలో మీరు ఎన్నడయినా వుండివుంటే, అన్నమో రామ చంద్రా అనే అభాగ్యులు [illegible] [illegible] ధాన్యాలను మోసుకు వెళ్ళే ఈ రైళ్ళకోసం ఎంత ఆతృతగా చూస్తూవుంటారో మీకు తెలిసేవుండేది.

అయినా, ప్రయాణాలు అంతగా ముఖ్యంకావు. అందుచేత, ప్రయాణపు రైళ్ళస్థానే ఆహారధాన్యాలను మోసుకు వెళ్లే రైళ్లు వచ్చాయి. అందుచేతనే ఈ రోజులలో రైళ్లలో జనం క్రిక్కిరిసి వుండి యిబ్బందిపడడానికి కారణం. కాబట్టి, రైళ్లు తమ ముఖ్య మైన విధిని నెరవేర్చాలని మీరు కోరినట్లయితే, మీరు ఇల్లదగ్గరనే వుండిపోవాలి.

ప్రయాణాలు తగ్గించండి

AAA 682. T. G.

త్రినేత్రుడు

[కథానిక]

= శ్రీ శివరాజు వేంకటసుబ్బారావు =

ఆదర్శంతో రక్తాన్ని మత్తెక్కించి మూగదైపోయిన ఈ ప్రపంచంపైన అప్పుడప్పుడు నాకు కోపం వొస్తూవుంటుంది. నా కేం కావాలో నాకే తెలీదు; ఎన్నో జరిగేసూచన లున్నా, ఏవీ జరగదు; జీవితానికి అర్థం లేదు. ఇట్లా అకారణమైన ఆగ్రహాన్ని అణుచుకునే అవసరం వున్నప్పుడల్లా నాకు గౌరీశంకర శాస్త్రిగారి దగ్గర కెళ్లడం మామూలు. గిరీశం అన్నట్లు ఆయనతో మాట్లాడడమే వొక 'ఎడ్యుకేషన్'. పగటినీ, రాత్రినీ పరిణయంచేసుకున్న సంధ్యలా, ఆయన ప్రాచీననాగరికతకి వొక బహిర్గతచిహ్నంలా గోచరిస్తాడు.

ఆయనవయస్సెంతో శాస్త్రిగారిని నే నెప్పుడూ అడగలేదు. డెబ్భై, డెబ్భైఅయిదు, ఎనభై కూడా నేమో! వృక్షాలు, కొండలు—వీటి వయస్సు నిర్ణయించడం శాస్త్రకారులకి కష్టం కాదు; కాని ఎవరిక్కావాలి? వార్ధక్యంలో పడ్డ మానవుడి జీవితంలోని పరిపూర్ణత వయస్సుమీద ఆధారపడదు. ముందు వెనక, మంచి చెడ్డా, ఎత్తు పల్లం—పరిపూర్ణత లేని నడివయస్కులు వీటి కొలతబద్దలు.

శాస్త్రిగారితో వున్న కాసేపూ సత్యాసత్యాలకు తావులేదు. ఆయనలో కుళ్లు, కుట్ర, రహస్యం, అంతరంగికం వున్నట్లు కనబడదు. ఆయన కసలు వ్యక్తిత్వం లేదు; వున్నా నవ్వుకీ, కన్నీటికీ అది అతీతం. ఆయన అనుభవాలూ, వుద్రేకాలూ అన్నీ శరీరంమీదే దగ్గరగా బరువుగా కనిపిస్తూవుంటాయి. తీరని వాంఛలన్నీ ముడతలలో తీర్చబడ్డాయి; నీరైన కలలన్నీ నేత్రాల వెనక చలితో వొణుకుతున్నాయి. ముందు వెలిసి, చివర అంతర్ధానమైన నక్షత్రంలా వొకటే పన్ను. చాలామంది ముసలాళ్లమాదిరి ఆయనది బట్టతలకాదు. వెండితీగలలా, మెరుపులా మెరిసే, లెక్కపెట్టటందుకు వీలుగా అమర్చబడ్డ తెల్ల వెంట్రుకలు. తపస్సు విరమించి కుటీరంలోకి కూర్చున్న యోగిలా, జీవితరహస్యాన్ని దాచుకున్న చిత్రమైన గడ్డం. ముసుగు తొలగించుకుని హృదయం ఆయనశరీరంలోనే మసలుతూవుంటుంది. ఆత్మకి ఆకారం వుంటే ఆయనలా వుంటుంది. ఆయనకి ఆలోచన లేదు. ఆలోచించే అవసరమే వొస్తే, ఆ పని ఆయనశరీరమే చెయ్యగలుగుతుందేమో ననిపిస్తుంది. వార్ధక్యం అంత అందంగా వుంటే, యవ్వనాన్ని నిలబెట్టేటందుకు యత్నాలు చేస్తున్న శాస్త్రకారులని పిచ్చాస్పత్రిలో వుంచాలనిపిస్తుంది నాకు. అప్పుడప్పుడు ప్రపంచంపై ఆగ్రహం వొస్తుందని చెప్పా మొదట్లో. శాస్త్రిగారిలాంటి వ్యక్తులు యీ దేశంలో చాలామంది ఎందుకులేరా అన్నది అనేక కోపకారణాలలో వొకటి. ఆయనది చిత్రకారుడికి చైతన్యం యిచ్చే ఆకృతి. కాని ఆచైతన్యంలో దుఃఖం వుండితీరుతుంది.

అంతే కాదు. అర్థశూన్యం అని తోచిన జీవితానికి ఆయన అర్థం కల్పించగలడు. జీవితప్రవాహానికి ఆయనజీవితం ఆనకట్ట. లోకానికి ఆకారం, ఆకృతి యివ్వగలడు. ఆయనఅనుభవాలు చాలా సాధారణమైనవే. చేసిన వుద్యోగం తాలూకాగుమాస్తా; ఆర్జించింది ఆరెకరాల భూమి; కొడుకు యిప్పుడు ఊటీలోవున్నాడు; కూతురు భర్తతో సిమ్లాలో కాపరం చేస్తున్నది. ఆయన తోటలో గుడిసెలో వొంట

రిగా కాపరం—భార్య పోయి పదేళ్లయింది;—హోటల్ మెసుకులు; చుట్ట, చదరంగం—అంతే ఆయన జీవితం. కాని ఆయనచరిత్ర వింటే ప్రతిఅనుభవమూ వొక నాటకంలా కనిపిస్తుంది. ఆయనఅనుభవాలు విషాదాంతగీతికలు. ఈసాధారణ అనుభవాలతో ఆయన జీవితాన్ని ఎట్లా అర్థం చేసుకున్నాడో నా కింత వరకూ తెలీదు. ఆయనకికూడా తెలీదేమో. కేవలం కబుర్లతో, మాటల్తో నాలో యీభ్రమని జనింపచేశాడా? ఒకొకప్పుడు ఆయన చెప్పినవన్నీ అసత్యాలేమో నన్న సందేహం వొస్తూంటుంది. కాని ఆ అనుమానం ఆయనముందు వున్న కాసేపూ రాదు. 'ఊహ'తో యథార్థ జీవితాన్ని జయించి, భావతో రహస్యాన్ని ఛేదించాడు కాబోలు. ఆస్కార్ వైల్డు ఎక్కడో "అసత్యాలాడడం, అందమైన ఆకర్షణీయమైన అబద్ధాలు చెప్పడం–యిది కళయొక్క ముఖ్యోద్దేశం" అన్నాడు. దీన్నిబట్టి చూస్తే గౌరీశంకర శాస్త్రి చాలా గొప్ప 'ఆర్టిస్ట్'.

సాయంత్రం వాలుగైంది. మర్రిచెట్టుకింది దిమ్మమీద శాస్త్రిగారు కూర్చున్నారు — శూన్యత్వాన్ని తిలకిస్తూ. ఆయన కాల్చే చుట్టలో పొగమాదిరి భావాలు ఎక్కడనుంచి జనిస్తాయో, ఎక్కడికి పోతాయో వూహించలేను. వెళ్లగానే నమస్కారం చేసి నేనూ కూర్చున్నాను.

"శాస్త్రిగారూ, నాకు జీవితంలో అర్థం కనబడలేదండి"

"నువ్వు బ్రహ్మచారివి. 'జీవితం' అనే మాటని అస్తమానూ సులభంగా వుపయోగించకూడదు" అన్నాడాయన. ఆయనతో ఏదో మాట్లాడించాలనితప్ప నా భావాలకి వేరే అర్థం కనిపించడం లేదు.

"మనుషులకంటె జంతువులు ఎంతో సుఖంగా వున్నాయనుకుంటా" అన్నాను మళ్లా.

"కావొచ్చు. 'మనుషు'లనడంకంటె 'పురుషుల'కంటె అను; నేను ఖండించను. స్త్రీలున్నారని మరిచిపోకు. వాళ్లకి తిండికోసం పాటుపడే అగత్యం లేకపోతోంది" అన్నా రాయన.

"కాని స్త్రీలకి జంతువులకంటె ఎక్కువ గౌరవం లేదనుకుంటా. శాస్త్రజ్ఞులు పురుషుల ప్రాచీనులు కోతులని వాదిస్తున్నారు. స్త్రీల ప్రాచీను లెవరా అని సందేహంగా వుంది" అన్నా.

"స్త్రీల ప్రాచీనులూ కోతులే; ఆడకోతులు" శాస్త్రిగారి పెదవులు నవ్వుకోసం ఎంతో పెనుగులాడాయి. ఆయన్ని బాగా పరకాయించి చూశాను. చలికి ముడుచుకున్న అరణ్యవృక్షాలమాదిరి చర్మం విపరీతంగా చలించింది. ఆనాడు ఆయనలో కొత్తవిషయం —యిదివరకెన్నడూ గుర్తించనిది చూశాను. కనుబొమ్మలమధ్య నుదుటిమీద నల్లటి, కొంచెం పొడుగాటి మచ్చ వుంది.

"శాస్త్రిగారూ, ఆమచ్చ ఏమిటో చెప్పారు కాదు"

ఆయన లేచి ఎండలోకి నడిచాడు. నాముందు ఆయననీడ పడింది—ఆయనలాగే చలించని నీడ.

"దానికి చాలా కథ వుంది"

"నాకు చెప్పాలి"

"ఆ మచ్చ నా మూడో నేత్రం"

నాకు నవ్వొచ్చింది. నీడ బోసినోరు విప్పింది.

దాని పూర్తి కథ చెప్పమని బ్రతిమలాడాను. "ఇక్కడ కాదు, నాతో రా." ఆయన ఎడమచెయ్యి నాభుజంమీద ఆనించి కుడిచేత్తో కర్ర పట్టుకుని నడవడం మొదలెట్టాం. గాలి పిలుపుకి ఏకంగా కదిలిపొయ్యే కొండమీది మేఘంలా ఆయన నడుస్తూ నాకీ కథ చెప్పడం ప్రారంభించాడు.

"అది జరిగి చాలాకాలమైంది. అప్పటికి నా వయస్సు యిరవై ఆరు– దాని కింకా ఇరవైకూడా రాలేదు. మా కుటుంబానికి ఆరో ఏడు; మా కుముదం మూడేళ్లది. నాకు బాగా జ్ఞాపకం— ఆనాడు ఆదివారం; సాయంత్రం ఆరుగంటలకే అది నెప్పులు పడడం నే గ్రహించలేకపోలేదు. మరిచా, కుముదం తల్లిని నువ్వు చూశావా ?"

"—లేదు, ఆభాగ్యం కలగలేదు. పోనీ, మీ దగ్గర వున్న ఫొటోయేనా చూపించండి—"

"దాని ఫోటో లేదు. అంత అందమైన స్త్రీలు యీ రోజుల్లో నాకు కనబడటం లేదు. పోనీ, మా కుముదాన్ని చూశావా ?"

"—ఆ. ఆ. చాలా సుందరమైన విగ్రహం. ఆమెనుబట్టి ఆమెతల్లి ఎట్లా వుండేదో ఊహించగలను—"

"అదే పొరపాటు. ఊహించలేవు. వాళ్ల అమ్మముందు కుముదం కోతిపిల్ల. ఆరోజుల్లో తాసీల్దారుకి నామీద ఎంతో గౌరవం, దయ— ఎందుకంటావ్ ? ఆయ నెప్పుడో నాభార్యని చూశాడు. ఇప్పుడు నా కనిపిస్తోంది— అంత అందమైన స్త్రీని ఎవరూ పెండ్లి చేసుకోకూడదని. అట్లా చెయ్యడం పాపం. పార్కులో రేడియో పదిమంది వింటారు; గౌరీశంకర్ శిఖరాన్ని అందరూ దూరాన్న చూస్తారు; సినిమా షో అంతా అనుభవిస్తారు; తాజ్ మహల్‌ని మెచ్చుకుంటారు. ఎవరూ యీ వొస్తువులు 'నావి' అనరు. అట్లాగే అందమైన స్త్రీలు. సౌందర్యం అనేది వొక సామ్యవాద సంస్థ.— ఏ వొక్కడికీ చెందకూడదు."

—ఇది వినగానే వెంకటచలం, ఒమార్ ఖయ్యామ్, లారెన్స్, జాయిస్ అంతా స్మరణకు వొచ్చారు.

"కాని ఆనాడు నా భార్య వొక సంస్థలా కనిపించలేదు. అది నాది, నాఆస్తి; దానిమీద హక్కు నా వొక్కడికే వుంది. అది యీ సంఘానికి చెందిన వొస్తువనీ, కాబట్టి ఎప్పుడో యీసంఘం దాన్ని తీసుకుపోయి సంస్థగా చేస్తుందనీ భయంగానూ, తీవ్రమైన అసూయగానూ వుండేది. ఈ అసూయ నా శాంతిభంగానికి కారణం.

ఆ సాయంత్రం మూడోకాన్పు నెప్పులుపడటం చూసేసరికి నాగుండె గుభేలుమంది. తెల్లారితే ఆఫీసు. కారణం చెప్పకుండా సెలవడిగితే తాసీల్దారు యివ్వడు; కారణం చెబితే కనుక్కోడంవొంకని యింటికొచ్చితీరతాడు. అది నేను సహించలేనిది. చేతులో కానీ లేదు. మొగడాక్టర్ని పిలిపించి దాన్ని పరీక్ష చేయించడం నాకు సుతరామూ యిష్టంలేదు. పైగా నాకు పిల్లలంటే పరమఅసహ్యం. ఎందుకంటావ్ ? పిల్లలు దాని సౌందర్యాన్ని, నాఅల్పగణింపునీ సమంగా పంచుకుంటారని వాళ్లంటే అసూయ. నా యిరువురి సంతానం దాన్నప్పుడే పంచుకుంటున్నారు. మళ్లా మూడోదా! పిల్లలకితప్ప నాకు చెందదని ఏదో వెర్రి భయం. సంతానం దాన్ని తినేసి అస్థిపంజరం నాకు మిగిలిస్తే, దాన్ని నే తగలేసి, వాళ్లు చేసిన ఘనకార్యానికి ఆస్తంతా వాళ్ల కప్పచెప్పటమా ? 'వివాహం' అనే సంస్థలో స్వార్థం వుందంటారు. కాని, చాలా పొరపాటు. అది శాసించి కోరే స్వార్థత్యాగంలో సగం వ్యయంచేస్తే భారతదేశానికి స్వాతంత్ర్యం ఏనాడో వచ్చును. సౌందర్యమైన స్త్రీని నాబోటి పోషించలేని అధముడికి కట్టడం ఎంత పాపమో, ప్రతిభాశాలిని 'వివాహం' అనే సంస్థలో బంధించడం అంతే పాపం. ఈరెంటినీ మించిన పాపం పోషించే శక్తి లేకుండా పిల్లల్ని యీలోకంలోకి తీసుకురావడం.

ఈ అభిప్రాయాలు దానికి వొకటీ అర్థంకావు. అసలు దానికి ముందూ వెనకా ఆలోచనే లేదు. పువ్వు పరిమళాన్నిచ్చినట్లు, చంద్రుడు చల్లదనాన్ని చిమ్మినట్లు పిల్లల్ని కనడం దాని సహజనైజంలా ప్రవర్తిస్తుంది. ఆరాత్రి నాకు భయంకరమైన కలొచ్చింది. ఆకలలో నాభార్య నాతో యిట్లా మాట్లాడింది — [నే మోసి కన్న సంతానాన్ని నా కలలు సృష్టించాయి; నాఅందం వాళ్లకి చక్కదనాన్నిస్తుంది. ఆకలికి నాహృదయాన్ని, దాహానికి నారక్తాన్ని అర్పించాను. నా ఆత్మలో నిద్రపోయి, అమాయకంగా నా రొమ్ములమీద పరుండి, జీవించి నన్ను శపించి, చివరకి చచ్చిపోతారు. నా కుటుంబం పెద్దవాడయ్యాడు. అప్పుడు వొక దుర్మార్గురాలు నరకాన్నుంచి వొచ్చి నాపాపని దొంగిలించింది. దాని పెదవులు, క్రూరమైన కళ్లు మత్తుతో ఎర్రగా వున్నాయి. నన్ను తగలబెట్టేటందుకు దాచుకున్న కాష్టబంగారాన్ని దాని ముద్దుకోసం అర్పించి నాచావుని కోరాడు నాపుత్రుడు. నా తలకింద దాచుకున్న బంగారంకోసం నిద్రపోతున్నప్పుడు దొంగతనాని

కొచ్చాడు కుటుంబం. మెల్లగా వొస్తున్న ఆలేని అడుగులు నాహృదయంలో ప్రతిధ్వనించాయి. తన మొహాన్ని వొంచి, సర్పంలాంటి కత్తిని నాగుండెలో త్రిప్పి నన్ను చంపిన ధ్వని శ్మశానవాటికలో వినిపించింది—మరణించినవాళ్లు మళ్లా మరణించ రన్నవాళ్ల అపత్యవాదులు...]

భయపడి లేచాను. దాని నెప్పులు, మూలుగుడూ ప్రక్కగదిలోంచి వినిపిస్తూనే వున్నాయి. జనించ బోయ్యే శిశువుని ఎట్లా చంపను? చంపాలని లేచా,... అప్పుడే ఆకాశంలో సూర్యుడు వొంటికన్నువాడిలా కుంటుకుంటూ లేస్తున్నాడు. చరచరా పరుగెత్తి, కాలు జారి మంచంకోడుకి నామొహాన్ని కొట్టుగున్నా. గాయం పడిందికాని రక్తం రాదే—ఉన్మాదానికి రక్తం గడ్డకట్టింది కాబోలు. మంత్రసాని ఎదురుగా వొచ్చి "మొగశిశువు" అని చెప్పి నవ్వుతో నాకేసి చూసీ, కవ్వున కేకెట్టి, చేతులో బెడ్ పేన్ వొదిలేసి పరుగెత్తింది. నా కర్థంకాలేదు. వీధులో కొచ్చాను. మంగలి నన్ను చూసీ 'పొది' వొదిలేసీ 'బాబో' అని పరుగెత్తడం మొదలెట్టాడు. వీధిగదిలో కుర్చీలో కూలబడ్డాను. నుదురు తడుముకున్నాను. గాయం; రక్తం లేదు. వీళ్ల చర్య నాకేమీ అర్థంకాలేదు.

ఎట్లా తెలిసిందో—తాసీల్దారుకూడా చక్కా వొచ్చాడు. నన్ను చూసి గుమ్మంలో నిలబడిపోయాడు. కుర్చీ సర్ది "దయచెయ్యండి" అన్నాను. ఆయన మాట్లాడడు.

"మొగపిల్లాడుట. ప్రమాదం లేదు...రండి..." ఆయన కొయ్యబారి నాకేసి అదేపనిగా చూడడం మొదలెట్టాడు. నా కాయనమీద కోపం వొచ్చింది. దానికీ పిల్లాడు పుట్టడంలో యీయనకికూడా ఏమన్నా వాటా వుందా? లేకపోతే యీయన కెందుకు యింతకుతూహలం, యింతఆశ్చర్యం?

"శాస్త్రీ, నీ నుదుటిమీద ఏమిటది— కన్నులా వుంది?" అన్నాడు నానుదుటికేసి తన వేలినిచూపుతూ.

"తొందరలో పడుతుంటే దెబ్బ తగిలింది."

"దెబ్బలా లేదు. అద్దంలో చూసుకో, సరిగ్గా కంటిలా వుంది...మూడో నేత్రం."

అద్దంలో చూసుగున్నా. ఏమీ లేదు, మామూలు దెబ్బే. నల్లగా గొయ్యిలా పడింది. రక్తం కారకపోవడం వొక్కటే విశేషం. తాశీల్దారు భయపడుతూ దగ్గరగా వొచ్చి నా దెబ్బని పరీక్షగా చూశాడు.

"నిస్సందేహంగా మూడోనేత్రమే. అదేమిటి, కనబడుతుంటేనే! నువ్వు ధన్యుడవు శాస్త్రీ. అవతార పురుషుడవు. ఇప్పుడు నీ భార్యకి పుట్టిన పిల్లాడు కేవలం భగవంతుడే. నువ్వు త్రినేత్రుడవు." అంటూ చేతులుజోడించి నాపాదాలమీదపడడం మొదలెట్టాడు.

ఈ పరిహాసానికి నాకు కోపం మరింత ఎక్కువైంది. ఈ తాశీల్దారుకీ, కొత్తగా పుట్టిన పిల్లాడికీ ఏదోసంబంధముందన్న నాఅనుమానం బలపడుతోంది. అసలు విషయం కప్పిపుచ్చేటందుకు యిదేదో పన్నాగం పన్నుతున్నా డని నిశ్చయం చేసుకుంటున్నా. కాని ఆమంత్రసానీ, మంగలీవాళ్లు యిట్లాగే ఆశ్చర్యం ప్రకటించి, చకితులై పారిపొయ్యారే!

"తమరు పెద్ద వుద్యోగులు; నే నేదో బీదవాణ్ణి. నన్ను తమ రిట్లా పరిహాసం చేస్తే ఎట్లా?"

"పరిహాసం కాదు శాస్త్రీ. నీ జన్మ తరించింది నేటితో. సృష్టి నీలో కొత్తమార్పుని తీసుకొచ్చింది. నీపాపాలన్నీ పూర్తిగా తొలిగి, జన్మరాహిత్యానికి సిద్ధం కమ్మని దైవం నీకు మూడోనేత్రం ప్రసాదించాడు. నీపుత్రుడు ఆ దైవం. నిన్ను మేం పూజించాలి"

అంటూ ఎన్నోమార్లు నమస్కారాలు చేసీ, తొందరగా నిష్క్రమించాడు తాసిల్దారు.

నామనస్సునీ, వాస్తవికతనీ శంకించడం మొదలెట్టాను. మానవుకి అనుభవాలు రెండువిధాలు: మానసికం; ఇంద్రియాన్వేషణ. ఆనాటి అనుభవం యీ రెంటికీ చెందదు. నాకు భయమేసింది. ఈ సంఘం వొక పెద్ద పిచ్చాసుపత్రి. దాని సూపరెంటుని నేను. నాభార్యా? దాని స్థానం యీ ఆసుపత్రిలోనే? వేగంగా గదిలోకి పరుగెట్టా. తలుపుసందులోంచి చూశా,

నా భార్య "అమ్మో — నిజమే నే!" అన్నది. ఒళ్లు మండింది నాకు. గదిలోకి ప్రవేశించా.

"ఏమిటి నిజం?" అని గర్జించా.

"అమ్మో—మూడో కన్ను!"

"దెబ్బ"

"అబ్బే, కాదు, కాదు. నిజం. భగవంతుడు" చేతులు జోడించి, నీరసంగా ఏడిచింది. పసిపాపను చూశా. తాసిల్దారు జ్ఞాపకం వొచ్చాడు. ప్రాచీనశక్తులు నాలో చెలరేగాయి. లోకాన్ని నిర్మూలం చెయ్యాలి- లేకపోతే నా బ్రతుకు చెక్కిరింపైపోతుంది. రెండు కళ్లుండీకూడా చూడలేకపోతున్న యీ గుడ్డిప్రపంచంలో నా మూడో కన్ను ఎందుకు పనికొస్తుంది? నేను చూడలేని మూడో నేత్రం నా కెందుకు? సృష్టి అవయవాలని మానవుడి ఆనందానికి, అమరతకి యిచ్చింది. ఏ అవయవాన్ని ఉపయోగించకుండా హింసించి కప్పెట్టినా మానవునికి నశింపు తప్పదు. ఉపయోగం లేని అవయవంకంటె వేరే శత్రువు మానవుడికి లేదు. భూమి నా కాళ్లకింద కదలడం మొదలెట్టింది; రంగులు కదిలి చీకటవుతున్నాయి; సున్నాలు చదరాలుగానూ, చదరాలు కోణాలుగానూ, ఇంద్రియాలు ఇంద్రజాలం, మంచిచెడ్డలు మట్టి, దైవం దయ్యం, మతం మురికి, రాజకీయం రాళ్లకుప్ప, కళ కాఫీ పొడుం, ప్రేమ పాద-లోకం తారుమారై నా అనిశ్చలత్వాన్ని మూడో నేత్రం బిగ్గరగా చాటిస్తోంది. ఆత్మహత్య తప్ప మరి మార్గం లేదు. సృష్టి దాని కంగీకరించదు. ఎవర్ని చంపను? పసిపాపనా, భార్యనా, తాసీల్దారునా—? ముగ్గుర్ని చంపాలి. పసిపాప ఏడ్పు విని పీక నొక్కాలని వుంది. ఎట్లా చంపను? వీథి గుమ్మంలోకి వెర్రిగా పరుగెత్తా. ఎదురుగా వొస్తున్న మంత్రసాని 'బాబో' అని గంతేసి నాట్యం చేస్తూ గుహలోకి దూరింది. వీథులో జనం గుంపుగా మూగారు — సన్నాయి, డప్పులు, డోళ్లు, తాళాలు. పోలీసులు, ప్లీడరు గుమాస్తా పరమశివం, బోగం సానులు, డాక్టర్ దానయ్య— వీళ్ల నాయకుడు తాసీల్దారు. పూలమాల నా మెళ్లో వేసి నమస్కరించి భజన చెయ్యడం మొదలెట్టారు. పాటలు, పొగడ్తలు, స్తోత్రాలు- నాకు పిచ్చెత్తిపోతోంది. బిగ్గరగా నవ్వాను.

"నేను పిచ్చివాణ్ని. మీరు వెళ్లండి, దయచేసి", జనం గుసగుసలు, పెద్దగోలా; పూర్వసువాసినుల ముఠా వొచ్చి కొబ్బరికాయలు కొట్టడం మొదలెట్టారు. ఏం చెయ్యను?

"నేను పిచ్చివాణ్ణి—వెళ్లండి."

"ఓ పరమాత్మా—నువ్వు ఈరూపంగా మాకు దర్శనం యిచ్చావా? మమ్మల్ని పరీక్ష చెయ్యవద్దు. మాకు నీలో చేరుకునే మార్గం బోధించండి." అన్నారు అందరూ.

"ఒకటే మార్గం: నాకన్ను పోగొట్టడం, తాసీల్దారుపుద్యోగం తీసెయ్యడం—యీ రెండూ చేస్తిరా మీ కీతక్షణం మోక్షం వొస్తుంది." అన్నాను.

"హే ప్రభూ! నా ఉద్యోగానికి యీక్షణమే రాజీనామా యిస్తాను! నన్ను మీపాదసేవ చెయ్యనివ్వండి" అన్నాడు తాసీల్దారు. ఎట్లా చావను?

"మీరంతా పిచ్చాళ్లు. పొండి." అన్నా వొళ్లు మండి. అందరూ చెంపలేసుకున్నారు.

"నిజం—ఓ త్రినేత్రుడా! మేం పిచ్చివాళ్లం, కుంకలం, పశువులం, మహాపాపులం. మమ్మల్ని శిక్షించు, దండించు, చంపు. కాని మోక్షం మాత్రం ప్రసాదించు."

వాళ్లని తోసేసి తలుపులు గడియపెట్టాను. బైట జనం పెద్ద గుంపులుగా మూగి భజన్లు ప్రారంభించారు. నన్ను చూసి నేను భయపడ్డాను. అంతా కలగా వుంది; కాని కలగాదు, నిజం. ఇంతమంది చూస్తున్న మూడో కన్ను నా కెందుకు కనబడదు? వీళ్లంతా గుడ్డివాళ్లా, లేక నేనే గుడ్డివాడినా?

భారతీయులకి దైవం, మతం అంటే అంత పిచ్చి. వాళ్లకి ఆత్మవికాసంతో నిమిత్తం లేదు; ప్రతిదానికీ బహిర్గతచిహ్నం కావాలి. పొరపాటున విష్ణుమూర్తి ఇంగ్లండు వెళ్లాడంటే వెంటనే 'ప్యాస్‌పోర్టు

చూపించమంటారు. దేవుడే వాళ్ల దగ్గర కొచ్చి, నేనే దైవాన్నంటే ఋజువుచెయ్య మంటారు. అంజనేయుడ నంటే తోక చూపమంటారు. బహిర్గతచిహ్నాలు లేకుండా, వీళ్లు జీవితపు విలువల్ని అర్థంచేసుకోలేరు. అనుభవించనూలేరు. రెండు మోటార్లు, బ్యాంక్ ఎకౌంటూ వుంటే ధనికుడు; పదిమంది బంట్రోతులు సలాంచేస్తే హోదా; మెడలో పుస్తె లేందే స్త్రీ భార్య కాదు, తల్లి కాదు; ఎవరికీ అర్థంకాని వేదాలని పఠిస్తే పండితుడు; తనకీ అర్థంకాని భాషలో సృష్టినిగురించి వితర్కిస్తే వేదాంతి; పిల్లల్ని కంటే కుటుంబీకుడు; తిండిలేక మాడడం ఆధ్యాత్మికం; ఎలెక్షన్లలో శత్రువుని వోడించడం రాజకీయం. బహిర్గతచిహ్నాలకి బానిసత్వం చెయ్యడం వీళ్ల జీవితపు పరమావధి. నన్ను దేవుడుగా చేసిన యీవ్యక్తులు బానిసలుగా వున్నారంటే ఆశ్చర్యం లేదు. తుదకు దేవుడుకూడా భక్తులకి బానిసే కాబట్టి, నా మూడోనేత్రం నాబానిసత్వానికి బహిర్గతచిహ్నం.

నేను దైవాన్నని నిశ్చయం చేసుకున్నా. తలుపుతీసి దర్శనం యిచ్చా. మళ్లా హారతులు, కొబ్బరికాయలు, అర్చనలు, ఆరాధనలు — నా కిదంతా బాగానే వుంది. తాసీల్దారుని కసితీరా బుజాలమీద తన్నాను. పరమశివానికి నేను పదిరూపాయలు బాకీ— ఇంక చస్తే అడగడు నన్ను. పైపెచ్చు పెళ్లాం పుస్తెలేనా అమ్మి నా కేదో కానుక యిచ్చుగుంటాడు. హెడ్‌క్లార్కు ఆఫీసుకి ఆరునిమిషా లాలస్యంగా వెళ్లానని అరగంట లెక్చరిచ్చాడు మొన్న. రానీ చెబతా వాడి పని. మానవప్రపంచంలో దేవుడి కున్నంత పలుకుబడి ఏ ప్రతిభాశాలికీ లేదు. ఏమిటి కారణం? బలహీనుడు బలవంతుణ్ణి చూసి "నీకంటే బలం గల దేవు డున్నాడు పోవోయ్" అనొచ్చు. లేనివాడు వున్నవాణ్ణి చూసి "నీ కదంతా దేవు డిచ్చాడు, నీగొప్పేమేడిసింది" అనొచ్చు. పైగా అన్నిపాపాలూ, అసత్యాలూ, పశుత్వాలూ దేవుడిమీద తోసెయ్యవచ్చు. మానవుడి పశుత్వానికి 'మతం' వొక బహిర్గతచిహ్నం కాబోలు! పశువుగా వుండడం మానుకుని, మానవత్వం సంపాదించినప్పుడు మతం మాయమౌతుంది."

— నాకు రహస్యాలలో మతానికి స్థానం లేకపోవడం జ్ఞప్తికి వొచ్చింది.

"ఆమొన్నాడు రాజాగారి వద్దనుండి ఏనుగుని తీసుకొచ్చారు. రాజాగారికీ, రాణీగారికీ నాదర్శనం యిచ్చాను. ధన్యులయ్యారు. నన్ను వాళ్ల భవనంలో వుంచేసుకుంటా మన్నారు. ఆనాడు జపం చేసిన కల్లోలం చూస్తే, న న్నక్కడే చంపేసి నా చుట్టూ గుడికట్టేస్తారేమోనని భయంవేసింది. ఏనుగుమీద రాత్రంతా ఊరేగించారు. అంబారీమీద పాలు త్రాగి హాయిగా పడుకున్నా. మధ్యలో తాసీల్దారు ఊరేగింపులో వున్నాడా లేడా అని లేచి చూసేవాణ్ణి. ఇంకా ఆయన నాయింటికెళ్లి యేమన్నా చేస్తాడన్న భయం, అనుమానం పూర్తిగా వొదలందే! పాపం తాసీల్దారు, రాత్రంతా ఊరేగింపులోనే వున్నాడు. ఆయనకేసి చూసినప్పుడల్లా, తను నా అభిమానభక్తుడైనట్లు మొహం కొండంత చేసుకుని గర్వంగా తన్మయత చెందేవాడు.

మూడోనాడు పొరుగూళ్లనుంచి నన్ను చూడడానికి ఎగబడ్డారు. ఆనాడు ఉదయమే నన్ను ఊరేగింపుకు తీసుకుపోయ్యారు. అ వొచ్చినవారిలో ఇద్దరు దొరలుకూడా వున్నారు. అందులో వొకాయన పోలీసు సూపరెంటుకూడా. నన్ను చూసి టోపీలు తీసి, చేత్తో రెండు బుజాలూ ముట్టుకున్నారు. నాకు ఆ అనుభవం చిత్రంగా వున్నా మనస్సంతా యింటిమీదే వుండేది. నాభార్య, నా పిల్లాడు ఎట్లా వున్నారో నని. నే నెంత బతిమలాడినా, వొక్కళ్లూ నా యింటిదగ్గి రుండి, నాభార్యకి సహాయం చేసిన వాళ్లు లేరు. ఇదేం మనుషులో, వీళ్లకి బతికే వున్నవాళ్లంటే బొత్తిగా గౌరవంలేదు. వీళ్ల దృష్టిలో, మనిషి, మనిషి కావాలంటే చావాలి.

నన్ను ఇంటికి పోనివ్వండి అని మొరెట్టుకున్నాను. వినిపించుకోలేదు. కోప్పడ్డాను; మూడోనేత్రం మూసేస్తా నన్నాను. సాయంత్రానికి ఇంటికి

చేశేశారు. ఈమార్పుకీ, యీ పిచ్చికీ కారణం పసి పిల్లాడు—వాడు నాకు పుట్టలేదని అనుమానం. పీక నొక్కి చంపేస్తే? చరచరా గదిలోకెళ్లాను.

తొందర్లో కాలు జారి మంచంకోడుకి నా మొహాన్ని కొట్టుకున్నాను. ఇదివరకులాగానే నుదుటి మీద మూడో నేత్రానికి తగిలింది. లేచి చూశా. ఎదురుగా మంత్రసాని నిలబడి, తల వొంచుకుని "పాప చచ్చిపోయ్యాడు" అని రెండుచేతుల్లో తన మొహాన్ని దాచుకొని గోడవెంపుకు నడిచింది. దెబ్బచోట నుదురు మండుతోంది. చెమట్లు పోశాయి. చేత్తో తుడుచుకున్నాను; రక్తం బొటబొటా కారుతోంది.

అది మూలుగూ, ఏడుపూ మొదలెట్టింది. నన్ను చూసి భయపడింది. "అమ్మో! కన్ను పోయింది. రక్తం, రక్తం. తడిగుడ్డ కట్టండి." నా భార్యను ఓదార్చడం మొదలెట్టాను. వాన కురిసి వెలిసినట్లుగా నా హృదయం చల్లబడి ప్రశాంతంగా మారింది. అసూయ లేదు; కోపం లేదు; విచారం అసలే లేదు. నా మూడో నేత్రంతోపాటు నా ఉద్రేకాలన్నీ పోయ్యాయి.

"లే, లే, ఏడవకు. కుటుంబం నాకు; కుముదం నీకు; పసిపాప దైవానికి. ఇంక నన్ను చూసి నువ్వు భయపడనక్కర్లేదు. మూడో కన్ను లేదు. నేను మామూలుమనిషినే..."

* * * *

కథ ముగిసిందికాబోలు శాస్త్రిగారు మాట్లాడడం మానేసి నిశ్శబ్దంలో పడ్డారు. అప్పటికి మేం ఊరుబైటికి వొచ్చినట్లు గ్రహించుకున్నాను. దూరంగా అది శ్మశానం. సూర్యుడు కిందికి పోతూ వొక్కసారి మాకేసి చూసి కన్ను గీటాడు. శాస్త్రిగారు కథ చెప్పినప్పుడు నా కెన్నో సందేహాలు తోచినా, యిప్పుడు అడగడానికి వొక్క ప్రశ్నకూడా కనబడలేదు. ఆకథ నిజమా, అబద్ధమా అన్న సమస్యే రాలేదు. మానవుడి అనుభవానికి 'సంభవం' అన్నది సరిహద్దు కాదు కాబోలు.

"అదిగో, ఆ చెట్టుకిందే యీచేతులతో ఆ పసిపాపని పాతేశాను" అన్నారు శాస్త్రిగారు వెర్రిగా నవ్వుతూ. నా కళ్లు అప్రయత్నంగా తడిశాయి.

"వాడు వొంటరిగా వున్నాడనుకోవద్దు. వాడి తల్లి కూడా ముంచుకుపోయినట్లు పదేళ్లలో వాడిపక్కనే పడుకుంది. నా మూడో కన్ను తెరిచానంటే వాళ్లిద్దర్నీ చూడగలను—అదుగో..."

నేనాయనకేసి చూడలేక పోయ్యాను. నా కంట తడి నాకే సిగ్గేసింది. ఆయన ప్రాకృతిక శక్తులలో వొక శక్తిలా గోచరించాడు. ఆ గుట్టలు, ఆ చెట్లు, ఆయన—అందరూ సృష్టిలో లీనమయిపోయి గిరగిరా తిరిగిపోతున్నారు.

ఆయన చెయ్యి గట్టిగా పట్టుకున్నా. ఇద్దరం ఇంటివేపు నడవడం మొదలెట్టాం. ఊరుదగ్గరకి రాగానే ధైర్యం తెచ్చుకుని—"మీ మూడో నేత్రం దేనికి బహిర్గత చిహ్నమో చెప్పారు కారు." అన్నాను.

"అసత్యానికీ, అంధత్వానికీ"

నా కర్థం కాలేదు.

మందలింపు

•

= శ్రీ రత్నాకరం శంకరనారాయణరాజు =

చాలును సాహసంబు సుమసాయకుడా! అనలాక్షుతోడ నీ
కేలర పంతమూన! ధృతిహీనుల మున్ జడదారు లెవ్వరో
నీలలితంపు కోలలకు నేమొ చలించి రటంచు నామహా
శూలునిపై జనందలతె, శాంతువులే ఫలితమ్ము దర్పకా!

అది యటులుండనీ, అపజయమ్మొ, జయమ్మొ, మనమ్ము గొంకెడున్
మొదటికె మోసమౌనో యని, ముద్దులమాటలు గట్టు మోహనా
స్పదమగు నీదు మోము గన ప్రాణము తల్లడమందుచుండె, నే
గొద ననుమాటెకాని పరికింపవు శంభుప్రతాప మింతయున్.

కొంచగనేల ప్రాణములకున్ దెగియించి సురాధినాథు డ
ర్థించినయట్టి కార్య మొనరించి, జగమ్ముల కెల్ల శ్రేయమున్
బంచెద, నెల్లవారల సమాదర మందెద నంచు, శక్తికిన్
మించిన కార్య మేల తలమీద వహించెదు మీనకేతనా?

అక్కర దీరుదాకనె సుమా ప్రభు లాశ్రితవర్గమున్ దయా
దృక్కుల మన్ననం బొనగి తీయని మాటల తేలుపుత్తు, రీ
టక్కుల నమ్మి యేటికి చెడన్, హరుతో పగయున్న నీకు నిం
కెక్కడి జీవితాశ, తగవే! తనుమాలిన ధర్మ మున్నదే!

చెప్పిన మాట లెల్ల చెవిజేర్చి విచారము సేయకుండ నే
నప్పరమేశునిన్ జెనకినైనను ధైర్యము దూల్తు నంచిటుల్
గుప్పన మాటజార్చి యురి గొంతుకకున్ దగిలించుకొంటి, నీ
కొప్పదె ప్రాణమైన రతి యొక్కతె యున్న దటంచు నెంచుటల్.

కరముల ముట్టినంతటనె గందెడు తూపులు, బిట్టుచప్పటుల్
జరచిన బారు వాజు లనిశంబు సుమాసవ మాని మేనులన్
మరచి చరించు జోదులును మాయురె యీబలగంబుతోడనా
పురహరు గెల్వబోయెదవు పోటరివై, యెటు సిగ్గుగాదొకో!

నిక్క మతండె యల్గునెడ నింతట నంతట బోవనీదు, నీ
యొక్కనితోడ దీరునొకొ యుగ్రత, లోకములెల్ల నీరుగా
నెక్కడ గాల్చివైచునో గణింపుము, ఊరక లేనిపోని యీ
చిక్కుల కెల్ల హేతువుగ జేసెద రిందరు నిన్ను నమ్ముమా!

తెగ బొగడినారు కార్యంబు దీరుకొరకు - సురలు; ఉప్పొంగి నిను నీవు మరచినావు
చెవుల కెక్కనె యిపుడు నే జెప్ప హితవు - విన్న వినకున్న నిదియసూ! ఉన్న మాట.

స్వలక్షణమని, వారు విడిచిపోతే మనము వెంటనే ఛిన్నభిన్నమగుదు మని బ్రిటిషు వారు పరిహసించుటసరికాదని, మన 'అఖండహిందూస్థానము' నామమాత్రము కాక బలీయమని మనము కనపరచవలె.

మన హిందూ సంస్కృతిలో తరుచు వాడు "ఇమం మే గంగే యమునే...", "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి" అను నదీమంత్రాలు నదీపుష్కరయాత్రాపద్ధతి, "అయోధ్యా మధురా మాయా..." అను పుణ్యపురముల యేర్పాటు, "మహేంద్రో మలయ స్సహ్యః..." అను కులపర్వతనిర్వచనము ఇట్టి వన్నియు భారతీయైక్యమును స్మరింపజేయునవే. వ్యాసవాల్మీకి కాళిదాసాదులు తమ ఇతిహాసకావ్యాలలో భారతదేశపు అన్నిప్రాంతాలను రమ్యముగా వర్ణించి, ఏకచ్ఛత్రపాలనను సూచించి జాతీయతాభావమును పాఠకహృదయములలో వికసింపజేయ జూచినారు. శంకరరామానుజాదులును ఆధ్యాత్మికముగా దిగ్విజయము చేయుచు భారతదేశమంతటను ధార్మికకేంద్రము లేర్పరచి మతసంస్కృతి ప్రచారము చేసినారు. ఇంతేకాక, ఉత్తరపు బదరీనారాయణమందిరములో దక్షిణపు మళయాళ బ్రాహ్మణులే పరపరంగ అర్చకులుగ నుండుట, దక్షిణపు తిరుపతి గుడిలో ఉత్తర ప్రాంతపు మహాంతు అధికారియగుట, హిమాద్రికన్య ఉత్తరదిశ వదలి దక్షిణాగ్రమగు కన్యాకుమారి వసించి నట్లు ఐతిహ్యముతో నేటికిని అక్కడ గుడి యుండుట, ఇట్టి వన్నియు అఖిల భారతదృష్టికి పోషకములే. కాని, ప్రస్తుతము మనవారు అట్టి విశాలదృష్టివి వదలి తరుచు సంకుచితదృష్టితో ఉండుటే కనబడుచున్నది. 'అఖండ హిందూస్థానము' యథార్థముగా ఉండవలెనంటే, భారతజాతి యంతటికిని సంఘటనకలిగించి, విభేదములను తగ్గించు కార్యక్రమము కావలె. గాంధీగారి సూచనపైన కాంగ్రెసుసభ యామోదించిన నిర్మాణ కార్యక్రమమే యిందుకు సాధకము.

ఈ కార్యక్రమపు అంశా లన్నిటిలోను ఈ సందర్భములో ముఖ్యముగా గమనించవలసినవి సాంఘిక మైత్రి, దానికి సంబంధించిన హరిజనోద్ధరణయు. ప్రస్తుతము హిందువులకు, ముస్లిములలో కొంతమందికి మధ్యనై మనస్య మున్నసంగతి నిజము. హిందువులు ముస్లిములను, ముస్లిములు హిందువులను పరస్పరము అనుమాన దృష్టితో చూచుటవల్ల ప్రతిస్వల్పవిషయములోను కలుగు చిన్న కలతకూడ పెద్ద సాంఘిక కలహముగా మారుచున్నది. ఇటువంటి పరస్పర భయములు, అనుమానములు పోవలెను.

ముస్లిం నాయకులు ఇస్లాంమహారాజ్యపు (Pan Islamic)దృష్టిగల్గి స్వదేశప్రేమకన్న పర్షియా, అఫగనిస్థాను మున్నగు ముస్లిం దేశాలపై ప్రేమనే ప్రధానముగా పెట్టుకొన్నారనియు, కొందరు ముస్లిములు భారతదేశ క్షేమమునకు హానికరముగాను, అన్యదేశాలకు, ముస్లిం మతవ్యాప్తికి అనుకూలముగాను ప్రవర్తించుచు, తాము పాలకజాతి వంశీయులమను భావముతో వర్తించుచు, హిందువులను భయపెట్టుచున్నారనియు, కొన్ని ప్రాంతాలలో ముస్లిముల సంఖ్య హెచ్చించుటకై మతముమార్చుట, హిందూస్త్రీలను చెరపెట్టుట జరుగుచున్న వనియు ముస్లిములను హిందూ మహాసభవా రాక్షేపించుచు

అఖండ హిందూస్థానము

✽

= శ్రీ కొమాండూరు శఠగోపాచార్యులు =

భారతఖండ మొకటే మహాదేశము; భారతీయులలో ఎన్ని శాఖోపశాఖ లున్నను వారందరును ఒకేమహాజాతి. అయితే జాతీయాభివృద్ధికి సాంఘికమైత్రి, జనులలో ఐకమత్యము కావలెను. కనుకనే కాంగ్రెసు నిర్మాణకార్యక్రమములో దీనికి ప్రధాన స్థాన మిచ్చినది. జిన్నాగారి వైఖరి యెట్లున్నను, ఎట్లైనను సాంఘికమైత్రిని సాధించుటకే ఆయనతో గాంధీగారు దీక్షతో ఇటీవల సంప్రతింపులు సాగించినారు. జగత్ నారాయణలాలు కాంగ్రెసుకమిటీలో చేయించిన తీర్మానమునకు భిన్నముగా రాజాజీ తయారుచేసిన ప్రణాళికకు గాంధీగారు చేయూత నిచ్చి, దానికి జనాబుజిన్నాగారి నొప్పించుట కెంతో పాటుపడినారు. దాని వివరము, అది విఫలమగుటకు కారణములును గతమాసపు భారతిలో శ్రీ వెంకటరంగయ్యగారు చక్కగా చిత్రించియున్నారు. ఈ గాంధీ-జిన్నాసంప్రతింపు లారంభించినప్పటినుండి జనులలో నాలుగు ప్రక్కల నుండి 'అఖండహిందూస్థాన'పు కేక లందుకొన్నవి. అనగా "మన దేశము అఖండముగా ఉండవలె; విచ్ఛిన్నముకాకూడదు" అని దాని తాత్పర్యము. సంఘీభావమే బలకరము. విభజించి పాలించుటలో మన బ్రిటిషుపాలకు లారితేరినవారు. ఐర్లండు, పాలస్తీను, ఈజిప్టు వగైరాలలోను ఈ సామ్రాజ్య ధురీణులు ఆయావర్గములమధ్య విభేదములను వృద్ధిచేయించియే తమ ప్రాబల్యమును స్థిరపరుచుకొన్నారు. మన దేశములోను ఆ రాజనీతినే ఉపయోగించుచు మనలో కలహములు పెరుగుచుండగా వారు ఆనందముతో చూచుచు సంతోషపడుచున్నారు. కలహానలమును జ్వలింపజేయు పాకిస్తాను సూత్రమునకు బ్రిటిషు రాజనీతిజ్ఞులే బీజము నాటిరని వదంతి. కాని ఇందుకు వారిని నిందించి లాభము లేదు. ఎవ రెట్లు పోయినను తమ సామ్రాజ్యము మాత్రము శాశ్వతముగా సాగించుకొన ప్రతిజ్ఞ బూనినవారు అట్లుచేయుట సహజమే. మనలో విభేదము లుండుట వల్లనే వాటి ప్రకోపమువల్ల మనకు దౌర్బల్యమేర్పడినది. మతభేదమేకాక ఇప్పుడు ఆయాప్రాంతాలమధ్య ఆచారాలు, న్యాయనిబంధనలు, భాష, లిపి ఇట్టి చాలవాటిలో భేదము లున్నవి. మనలోని సామాన్యతకు కాక విభేదాలకే మనవారు తరుచు ప్రాముఖ్య మిచ్చుచున్నారు. పూర్వము మన దేశములో అనేకరాజ్యా లుండినట్లు ఇతరదేశాలలోను ఉండినవి. కాని, అక్కడ ఒకే రాజ్య మేర్పడినమీదట జాతీయతయు బలపడెనని బ్రిటిషు, ఫ్రెంచి, జర్మను వగైరాల చరిత్ర తెలుపుచున్నది. మనకును ఇప్పు డేకరాజ్య మున్నది; కాని పరప్రభుత్వము. దాని ద్వారానే మన మొకేరాజ్యపు జాతి యనిపించుట అగౌరవము, దుర్బలత్వసూచకము. బానిసతనమే మన సామా

న్యలక్షణమని, వారు విడిచిపోతే మనము
వెంటనే ఛిన్నభిన్నమగుదు మని బ్రిటిషు
వారు పరిహసించుటసరికాదని, మన 'అఖం
డహిందూస్థానము' నామమాత్రము కాక
బలీయమని మనము కనపరచవలె.

మన హిందూ సంస్కృతిలో తరుచు
వాడు "ఇమం మే గంగే యమునే...", "గం
గేచ యమునేచైవ గోదావరి సరస్వతి" అను
నదీమంత్రాలు నదీపుష్కరయాత్రాపద్ధతి,
"అయోధ్యా మధురా మాయా..." అను
పుణ్యపురముల యేర్పాటు, "మహేంద్రో
మలయ స్సహ్యః..." అను కులపర్వతనిర్వ
చనము ఇట్టి వన్నియు భారతీయైక్యమును
స్మరింపజేయునవే. వ్యాసవాల్మీకి కాళిదాసా
దులు తమ ఇతిహాసకావ్యాలలో భారత
దేశపు అన్నిప్రాంతాలను రమ్యముగా
వర్ణించి, ఏకచ్ఛత్రపాలనను సూచించి జాతీ
యతాభావమును పాఠకహృదయములలో
వికసింపజేయ జూచినారు. శంకరరామాను
జాదులును ఆధ్యాత్మికముగా దిగ్విజయము
చేయుచు భారతదేశమంతటను ధార్మిక
కేంద్రము లేర్పరచి మతసంస్కృతి ప్రచా
రము చేసినారు. ఇంతేకాక, ఉత్తరపు బదరీ
నారాయణమందిరములో దక్షిణపు మళ
యాళ బ్రాహ్మణులే పరపరంగ అర్చకులుగ
నుండుట, దక్షిణపు తిరుపతి గుడిలో ఉత్తర
ప్రాంతపు మహంతు అధికారియగుట,
హిమాద్రికన్య ఉత్తరదిశ వదలి దక్షిణా
గ్రమగు కన్యాకుమారి వసించి
నట్లు ఐతిహ్యములో నేటికిని అక్కడ
గుడి యుండుట, ఇట్టి వన్నియు అఖిల
భారతదృష్టికిపోషకములే. కాని, ప్రస్తుతము
మనవారు అట్టి విశాలదృష్టివి వదలి తరుచు
సంకుచితదృష్టితో ఉండుటే కనబడుచున్నది.
'అఖండ హిందూస్థానము' యథార్థముగా
ఉండవలెనంటే, భారతజాతి యంతటికిని సం
ఘటనకలిగించి, విభేదములను తగ్గించు కార్య
క్రమము కావలె. గాంధీగారి సూచనపైన
కాంగ్రెసుసభ యామోదించిన నిర్మాణ
కార్యక్రమమే యిందుకు సాధకము.

ఈ కార్యక్రమపు అంశా లన్నిటిలోను
ఈ సందర్భములో ముఖ్యముగా గమనించ
వలసినవి సాంఘిక మైత్రి, దానికి సంబం
ధించిన హరిజనోద్ధరణయు. ప్రస్తుతము హిం
దువులకు, ముస్లిములలో కొంతమందికి మధ్య
వైమనస్య మున్నసంగతి నిజము. హిందు
వులు ముస్లిములను, ముస్లిములు హిందువు
లను పరస్పరము అనుమాన దృష్టితో చూ
చుటవల్ల ప్రతిస్వల్పవిషయములోను కలుగు
చిన్న కలతకూడ పెద్ద సాంఘిక కలహ
ముగా మారుచున్నది. ఇటువంటి పరస్పర
భయములు, అనుమానములు పోవలెను.

ముస్లిం నాయకులుఇస్లాంమహారాజ్యపు
(Pau Islamic)దృష్టిగల్గి స్వదేశప్రేమకన్న
పర్షియా, ఆఫ్గనిస్థాను మున్నగు ముస్లిం
దేశాలపై ప్రేమనే ప్రధానముగా పెట్టు
కొన్నారనియు, కొందరు ముస్లిములు భారత
దేశ క్షేమమునకు హానికరముగాను, అన్య
దేశాలకు, ముస్లిం మతవ్యాప్తికి అనుకూ
లముగానుప్రవర్తించుచు, తాము పాలకజాతి
వంశీయులమను భావముతో వర్తించుచు,
హిందువులనుభయపెట్టుచున్నారనియు, కొన్ని
ప్రాంతాలలో ముస్లిముల సంఖ్య హెచ్చిం
చుటకై మతమూర్పుట, హిందూస్త్రీలను
చెరపెట్టుట జరుగుచున్న వనియు ముస్లిము
లను హిందూ మహాసభవా రాక్షేపించుచు

ముస్లిములతో పోరుచున్నారు. ఇట్లే, హిందువులు సాంఘికముగా ముస్లిములతో కలియక, వారి యన్నము, నీరుకూడ ముట్టక చాకలి మంగలి మున్నగు వృత్తుల పనులు తరుచు స్వమతస్థులద్వారానే చేయింతు రని ముస్లిం లీగు నాయకు లాక్షేపించి, తుదకు పాకిస్తానుపేర తమకు ప్రత్యేక రాజ్యము కావలె ననుచున్నారు. మరియు హిందూ మతస్థు లగు హరిజనులనే (మతాచార కారణమున) గ్రామాలలో ఇప్పటికిని అస్పృశ్యులుగ నెంచి దూరమం దుంచుచున్న హిందువులు స్వతంత్ర రాజ్య మేర్పడి అందున్న అధిక సంఖ్యవల్ల హిందువులకు ప్రాబల్యమేర్పడినప్పుడు మతాచార దృష్టితో ముస్లిములనుగూడ మ్లేచ్ఛులుగ, అస్పృశ్యులుగ జూతురని జిన్నా వగైరాలు భయము, అనుమానము సూచించుచున్నారు. ఇట్టి హేతువులమీదనే తమకు, హిందువులకు జాతిసంస్కృతిభేదించుననీ,కనుక తమకు ప్రత్యేక రాజ్యము కావలె నని ముస్లింలీగువారు తీర్మానము చేసినారు. అందుకు గాఢ ప్రచారముకూడ జరుగుచున్నది.అయితే, ఇట్టి పాకిస్తాను విభజనవల్ల దేశమునకంతకే గాక ముస్లిములకును హాని కల్గుననీ, అట్టి పాకిస్తాను ఆర్థికముగా నిలువనేరదని గాంధీ-జిన్నా చర్చలవల్ల తేలిపోయినది. ఇట్టి విభజనవల్ల హిందూ ముస్లిములమధ్య విరోధము ప్రబలుననీ హిందువులేగాక, దూరదృష్టి గల కొందరు మహమ్మదీయులు గూడ తెలుపుచున్నారు. కాంగ్రెసు ముస్లిములు, అహరాస్లు, మోమినులు, షియాప్రముఖులు, జమయితుల్ ఉలేమా వారు, ఇంకను ఇట్టి ముస్లిం ప్రముఖులు పాకిస్తాను నిర్మాణమును నిరసించినారు. కాని, వారును, ముస్లిముల సంస్కృతి పోషణ కని కొన్ని రక్షణ నియమములను కోరుచు నేయున్నారు. ముస్లిముల న్యాయమైన అనుమానములను, భయమును పోగొట్టి, వారితో మైత్రి స్థిరపరచుట అధికసంఖ్యాకు లగు హిందువుల బాధ్యత. ముస్లిములును తోటి భారతీయులే. ఈరెండుమతములవారును తమదృక్పథమును మార్చుకొని సమన్వయకరముగా వర్తించవలె. ఇప్పటి మనదేశపు ముస్లిములలో చాలమంది జిన్నా, సికందరుహాయత్ ఖాను, మహమ్మదుఇక్బాల్, ఫజ్లుల్ హక్ మున్నగు నాయకులుగూడ హిందువులసంతతినుండి జనించినవారేనని వారిపూర్వచరిత్రయేకాక ముఖమైఖరికూడ తెల్పుచున్నది. కనుక వారు ప్రత్యేక జాతియనుట హిట్లరు జర్మను ఆర్యసిద్ధాంతమువలె అర్థము లేనిది. హిందూఆచారములను గూర్చి ముస్లిములు, ముస్లింఆచారములను గూర్చి హిందువులు ఉదారత చూపవలె. వ్యవసాయప్రధానమగు మన దేశములో గోవధ ఆర్థికముగా హానికరమనీ, గోరక్షణ మంచిదనీ, విగ్రహారాధకులను దూషించుట భావ్యము కాదనీ, మసీదుసమీపములో సంగీతవాద్యము జరిగినంతమాత్రమున తమ పనులకు లోటు రాదని ముస్లిములు గుర్తింపవలె. ఇట్లే, కేవలము గోవధకై హిందూముస్లిములు తలలుబద్దలుకొట్టుకొనుటతప్పనిహిందువులుకూడ తెలుసుకోవలె. ఇక మూర్తిపూజ ముస్లింలేకాక క్రైస్తవులు,ఆర్యబ్రహ్మసామాజికులుగూడ విగ్రహారాధననునిరసించువారే. మన మతపు మూలగ్రంథములగుశ్రుతిస్మృతులలో విగ్రహారాధనప్రశంస లేనే లేదనియు, ఇట్టివానినిగూర్చి ముస్లిములతో తగువు

లక్కరలేదనియు హిందువులు గ్రహింపవలె. ఒకరిఆచారములలో మంచివానిని రెండవ వారు తీసుకొని ఆదరించుటలో తప్పులేదు. ఉభయుల సామాన్యలక్షణములకు ప్రాముఖ్య మీయవలె. మతముమార్పు సందర్భమునను తరుచు సాంఘికకలహములకు తావేర్పడును. మతవిశ్వాసము వ్యక్తికి సంబంధించినది. ఒకడు బుద్ధిపూర్వకముగా ధార్మిక దృష్టితో కోరినప్పుడే వానిని మరొకమతమునకుమార్చుట న్యాయము. కాని, కొందరు క్రైస్తవులును, ముస్లిములునుమతప్రచారము పేరట హిందువులను — ముఖ్యముగా మాలమాదిగలు మున్నగు హరిజనులను, అనాధలను తమ మతములకు మార్చుట, దానిని హిందువులు నిరోధించగా కలహమేర్పడుటయు జరుగుచున్నవి. మన ప్రాంతములో లక్షలకొలది ఆదిహిందువులు 'క్రీస్తుమతము' పుచ్చుకొన్నారు. ఇందువల్ల హిందువుల సంఖ్య సహజముగా తగ్గి. మన దేశములో ఇతరమతస్థుల సంఖ్య హెచ్చును. హైదరాబాదు మొదలగు ప్రాంతాలలో ముస్లిం మతములోని కెక్కువ మార్చుచున్నారు. నిజమైన మతబోధ సవ్యముగా జరిగి, అందువల్ల మతాంతరస్థులయితే ఆక్షేపణ యుండదు. కాని అట్లుకాక, హరిజనుల కిప్పుడు హిందూసంఘములో ఉన్న హీన స్థితి ని పోగొట్టి బాగుచేయుదు మని ఆశపెట్టియే తరుచు మిషనరీచర్యలు జరుగుచున్నవి. అది అన్యాయమైనను, ప్రస్తుతపు ప్రభుత్వాధికారములో అట్టి అవకాశము లుండుట సహజము. మరియు హిందూమహాసభవారు దాని నిప్పుడు నిరోధించు పద్ధతియు సరికాదు. ముస్లిం లీగువారి యీ చర్యల నష్టుకొనుటకై మనవారు 'శుద్ధి, సంఘటన'లపేర కొన్ని చోట్ల ప్రతిక్రియ చేయుచున్నారు. మరల స్వమతములోనికి చేర్చుటలోను అట్టి పద్ధతులే అవలంబించుచు న్నారు. అస్పృశ్యతాచారము మాన్పించి, హరిజనుల నుద్ధరించుటకు గాంధీ మహాత్ము డెంతయో తీవ్ర కృషి చేసి, ఇందు కాత్మార్పణకును సిద్ధమయినాడు. నిజముగా మాలమాదిగలకు అస్పృశ్యత లేకుండా చేయుటే శుద్ధి సంఘటనలకు ముఖ్య సాధకము. ఇది సాంఘిక, ధార్మిక విషయము కనుక, ఈకార్యసాధనకు కాంగ్రెసుకన్న హిందూమహాసభయే బాధ్యత వహించి, తీవ్రకృషి చేయవలసియుండెను. అయితే, ఆసభ సాలీనా పట్టి తీర్మానములు చేయుటేకాని, దానిని తమకార్యక్రమములో చేర్చి నిర్వహించుట లేదు. పూర్వము రామానుజుల వంటి మతస్థాపకులు మాలమాదిగలకును సనాతన మతమును బోధించి వారిలోనుండియు శిష్యులను గ్రహించి, ధర్మవ్యాప్తిచేయుచుహరిజనులనుద్ధరించినారు. అట్టి 'దాసరుల' సంతతివారు నేటికిని దేశములో అక్కడక్కడ నిల్చియున్నారు. మన దురదృష్టమున నేటి క్రైస్తవ ప్రభుత్వ ఆధిపత్యమున ఈనాటి సనాతనధర్మసభ, వర్ణాశ్రమధర్మసభ వారలును అమానుషమై, అవైదికమై, హింసాత్మకమైన ఈదురాచారము నిలువబెట్ట జూచుట విచారకరము. కాంగ్రెసుప్రభుత్వపు ౨-౩ ఏండ్లలో హరిజనోద్ధరణకు కొంత ప్రోద్బలమేర్పడినది. కాని, తరువాత ఆవేడి చల్లారెను. మతాచార కారణమున బడులు, నూతులు, చెరువులు, వీధులు, ఇట్టి సర్వజనీన స్థలములకు మాలమాదిగలనురానీయనివారు దోషులు, శిక్షకు పాత్రులు అని ఇప్పుడు చట్ట

మున్నవి. కాని, ఇప్పుడు ఈ ప్రకారము ప్రభుత్వము, బోర్డులు అమలు జరుపుచున్నవా? నిమ్నజాతులకు తామే రక్షకులమని నోటితో ఎంత చెప్పినను, యుద్ధరణచర్యకు ప్రభుత్వము వారు సిద్ధపడకుండుట సహజమే. కాని, ప్రజానాయకు లిందును గూర్చి తీవ్ర కృషి చేయుట కాంగ్రెసు, హిందూ మహాసభ, ఆంధ్రమహాసభ, మితవాదులు, అతివాదులు, ఇట్టి అన్ని పక్షముల వారికి నివిధియైన బాధ్యత.

ఇట్లే భాషారంగములోను ఐకమత్య మేర్పడవలె. ప్రాంతీయ భాషలను వృద్ధి చేసికోవలసినదే. కాని, దేశీయులందరికిని ఒక సామాన్య భాష యుండి, దానినన్ని ప్రాంతాలవారును జాతీయభాషగ వ్యవహరించునప్పుడే భారతజాతి అనేది బలపడి భారతీయత చరితార్థమగును. "రష్యాలో, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పలుభాష లున్నను జాతీయత లేదా" అని కొందరు ప్రశ్నించుట కలదు. అక్కడను రష్యను, ఇంగ్లీషు అను సామాన్యభాష లన్ని ప్రాంతాలలోను నేర్పబడుచు జాతీయభావకు గౌరవప్రపత్తి లీయబడుచున్నవి. సామాన్య భాష లేకుండ హృదయపూర్వకముగా జాతీయభావము, ఏకీభావము నుండవు. ఈవిషయములో ముస్లిములు జాగ్రత్తపడి అన్ని ప్రాంతాలవారు నిప్పుడు హిందూస్తానీజ్ఞానమునకై తీవ్రకృషి చేయుచు పరస్పర సమన్వయము చేసికొనుచున్నారు. స్వభాషను విడువకుండనే జాతీయభాషగ హిందీ-హిందూస్తానీని నేర్చుకొంటే హిందువులు తమలో ఐకమత్యమును బలపరుచుకో గలుగుదురు. పూర్వము సంస్కృత ప్రాకృతాల ద్వారా ఈపని జరిగేది. దాని సంతతిలో ముఖ్యమగు హిందీయే ఇప్పుడా స్థానమున కన్నివిధములా తగినది. ౧౫౦ ఏండ్లనుండి రాజభాషగ నున్నను ఇంగ్లీషు నూటికొక్కరికి మాత్రమే తెలిసియున్నది. నూటికిరువదిమందికి హిందీభాష ఇప్పటికే తెలిసియున్నది. ఈ విషయములో మన ఆంధ్రులకు దేవుడు విశిష్టస్థానమును ప్రసాదించియున్నాడు. మనము ఉత్తరదక్షిణదేశముల మధ్య నున్నాము. కనుకనే ద్రావిడ భాషయైనను ఆంధ్రములో ఇప్పుడు హెచ్చుగ సంస్కృత హిందూస్తానీపదములు వాడుకలో నున్నవి. అథమము ౨౦౦ ఏండ్లనుండి ఉత్తరీయులతో మనకు సంబంధమేర్పడియున్నది. ఆంధ్రులనేకులు కాశీ మున్నగు హిందీ ప్రాంతాలలో వసించి సంస్కృతాదిభాషలలో మహాపండితులై ఖ్యాతిగాంచినారు. ఇంతేగాక, ప్రస్తుతము ౮౦ లక్షల ఆంధ్రులకు హిందూస్తానీ రాజకీయభాషగ నున్నది. ఇట్టి సదుపాయము లున్నను, ఆంధ్రులకు హిందీని గూర్చి లోగడనుండిన శ్రద్ధ, వేడి ఇప్పుడు తగ్గినట్లు సూచనలు కనబడుచున్నవి. కన్నడులు, మళయాళీలు దామాషా సంఖ్యనుబట్టి మన ఆంధ్రులకన్న హెచ్చుగా హిందీ నేర్చుకొనుచున్నట్లు కనబడుచున్నది. ఇటీవల తమిళులును హిందీపరిజ్ఞానములో శ్రద్ధ వహించి ముందుకు వచ్చుచున్నారు. కనుక ఈవిషయములోను మనము ఆత్మపరిశీలన చేసుకొని జాతీయభాషాభ్యాసమును వ్యాపింపజేయుట అవసరము. సామాన్యభాష లేని 'అఖండ హిందూస్తాన' మెప్పటికైనను నేతిబీరకాయవంటి దగును. హిందూస్తానీ సామాన్య భాష అయితే హిందూ ముస్లిముల మధ్య సమావేశమును, మైత్రియు బలపడగలవు.

ఇక లిపిప్రశంస. ఇప్పుడు మనమద్రాసు రాష్ట్రములో నాలుగు ముఖ్యభాషలకు వేర్వేరు లిపులున్నవి. ఇట్లే గుజరాతు, బెంగాలు, పంజాబులలో ప్రత్యేకలిపి వాడుకలో నున్నది. ఈ గడబిడకుతోడు ముస్లిములలో హెచ్చుమంది విద్యావంతులు పారసీ (ఉర్దూ) లిపి నభిమానించి వాడుచున్నారు. అయితే హిందీ, మరాఠీలకు, సంస్కృతమునకును నాగరిలిపి వాడుకలో నున్నది. ఇట్లెన్నివ్రాతలొక దేశములో ప్రచారములో నుండుట చాల అనర్థకరమని ధీమంతులందరును ఒప్పుకోకతప్పదు. అమెరికాలో, యూరపులో భాష లెన్నియున్నను, ఒకే రోమను (ఇంగ్లీషు) లిపిని వాడుదురు! రష్యాలో వేరు లిపి యున్నను, సోవియటు రాజ్యములోని అన్నిభాషలకు రష్యనులిపినే యిప్పు డుపయోగించుచున్నారు. లిపి అనేది కేవలము భౌతికమైన ఉపకరణము. కనుక ఇందుకు సౌకర్యమే ప్రధానముగా ఉండవలె. మన దేశభాష లన్నిటికిని ఒకేలిపి వాడుక యేర్పడుట అవసరము. నాగరి,గుజరాతి, బంగాళీ, ఓఢ్రము, ఆంధ్రము మొదలైన ఈలిపులన్నియు ఒకే బ్రాహ్మీలిపినుండివచ్చిన పరిణామములు. ప్రతిప్రాంతపువారికిని తమవాడుకలిపి మీఁద అభిమాన మున్నది. అది సహజము. కాని ఈ విషయములో మన అన్ని ప్రాంతాలవారు త్యాగము, ఔదార్యము చూపితే ఒకేలిపి నేర్పరచుకోవచ్చు. ఇప్పుడు మన దేశములో ఎక్కువ సౌకర్యము, వ్యాప్తి గల లిపి నొకదానిని సామాన్యలిపిగ జేసుకొని అన్నిప్రాంతాల భాషలకు దానినే ఇకముందు వాడునట్లు ఉద్యమమేర్పడవలె. అయితే ఇది ప్రభుత్వపు తోడ్పాటుతోనే కొనసాగగలదు.

అంకెల విషయములోను చాల భేదము లున్నవి. పైన చెప్పిన ప్రతిభాషకు వేర్వేరు రకముల అంకె లేర్పడి వాడుకలో నున్నవి. ఈ విషయములో ఆంధ్రులమే కొంత సంస్కరణ చేసినాము. ౧,౨,౩,౪ వంటి తెలుగు అంకెలకన్న 1,2,3,4 మున్నగునవేఇప్పుడు మనప్రాంతములో హెచ్చుగ వ్యాపించుచున్నవి. ఈఅంకెలే ఇంగ్లీషు ఫ్రెంచివగైరాలలోను ఉన్నవి. అయితే ఇవి నిజముగా ఇంగ్లండులో, ఫ్రాన్సులో పుట్టలేదు. యూరపువారందరును ఈఅంకెలను అరబ్బులనుండి గ్రహించినారు. అరబ్బులు మన దేశమునుండియే కొద్దిమార్పులతో తీసుకొన్నారు. కనుక ఇవి అసలు భారతీయములే.


వివాహము, దత్తత, ఆస్తిసంక్రమణ ఇత్యాదులనుగూర్చి హిందువులలో ఆయా ప్రాంతీయులమధ్య ఇప్పుడు కొన్ని భేదములున్నవి. కొన్ని ప్రాంతీయాచారములుండుట సహజమైనను, ఇట్టి విషయాలలో చాలవరకొకేరీతినిబంధన లేర్పడుట మంచిది. విభేదములు పోతేనే సమన్వయము, ఏకీభావమును కల్గును. ఈసందర్భములో మరొక విషయముకూడ గమనింపవలెను. హిందూలాలోని నిబంధనలు, ఆచారములు పురుషులకు లాభకరముగాను, స్త్రీలకు హానికరముగాను ఉన్నవి. పూర్వముకంటె ఇప్పుడు హిందూలాను బ్రిటిషు కోర్టులవారు అన్వయించి అమలుజరుపుటలో హిందూ స్త్రీలకు కొంత అన్యాయము జరిగినది. ఇటీవల ఇతరదేశములలో క్రమముగా స్త్రీలకు

ఆర్థికముగాను, సాంఘికముగాను అనుకూలమైన వృద్ధి జరిగినది. మన దేశములోను స్త్రీలకు న్యాయము జరుగునట్లు హిందూలాను సంస్కరించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. అందు కందరును సహాయముచేసి ఇప్పటి సాంఘికపరిస్థితులకు తగిన మార్పులతో దేశమంతటి హిందువులకును ఒకే న్యాయనిబంధనలను చట్టముగ జేయించి దేశపు హిందువులందరికి అమలు జరిపితే అది హిందూసంఘటనకు చాల తోడ్పడును.

భారతీయైక్యమునకు తోడ్పడు మరికొన్ని కూడ మున్ముందు పరిష్కారము కావలసియున్నవి. కాలమానమును గూర్చి ఆయాప్రాంతాలమధ్య చాలభేద మున్నది. మన ఆంధ్ర(బ్రిటిషు)జిల్లాలలో చాంద్రమానము, తమిళప్రాంతములో సౌరమానము, ఉత్తరప్రాంతపు చాలభాగములో బార్హస్పత్యమును వాడుకలో నున్నవి. మరియు శకము, సంవత్సరారంభము మళయాళీలకు, మనకు, బెంగాళీలకు, మరికొందరికి వేర్వేరుగ నున్నవి. హైదరాబాదులోను ముస్లిములనేకులు హిజరీ వాడుచున్నారు. కొన్ని జమీందారీలు వగైరాలలో ఫసలీమానము వాడుకలో నున్నది. ఇవి యిట్లుండగా బ్రిటిషుప్రభుత్వ పాలనలో క్రైస్తవశకమునకు ప్రాముఖ్యము వచ్చినది.

ఇప్పటి క్రైస్తవ ప్రభుత్వము మనలో ఐక్యమునకును, జాతీయోన్నతికిని, స్వాతంత్ర్యసిద్ధికిని వ్యతిరేకముగ నున్నది- నిజమే. అది సహజము. కాని పరుల దోషమెంచుచు కాలయాపన చేయుటకన్న మన జాతీయోన్నతికై మనమే గాఢవాంఛతో స్వయంకృషిపరులము కావలె. నిర్మాణకార్యక్రమమును అందులో కొన్ని అంశములైనను మనము ప్రతివారును ఆచరించుటకు ఎంతైన అవకాశమున్నది. ఇందుకు మనకు దృఢమైన కార్యదీక్ష యుంటే ప్రభుత్వపు ఆటంక మడ్డుపడలేదు. నిర్మాణకార్యక్రమమును సత్వరముగా, పూర్తిగా అమలుజరిపితే జాతీయోన్నతి కలిగితీరుననియు, అప్పుడే తన జీవితము చరితార్థమగుననియు, జనులు ఇప్పటి క్లిష్టపరిస్థితిలో నిర్మాణకార్యక్రమమును తీవ్రముగా సాగించకుంటే తా నికముందు జీవించియుండుట ప్రజలందరు తనపైని ఆశ పెట్టుకొనుట వ్యర్థమగుననియు, కనుక తాను దీర్ఘోపవాసము చేయుదు ననియు, నిర్మాణకార్యక్రమము చురుకుగా దేశములో అన్నిప్రాంతాలలో జనులు సాగించిన తాను ఉపవాసముచేయు అవసరమే ఉండదనియు గాంధీ మహాత్ముడు ఇటీవలనే ఉద్బోధించినాడు. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్." భౌతికముగా ఒకే దేశమయినంత మాత్రముచేత ప్రయోజనములేదు. దేశీయ ప్రజలలో మన మందర మొకేజాతి అనే భావముతో సంఘటనము, హృదయములో ఏకీభావము కలుగవలెను. పైన అనుకొన్న రీతిని విభేదములు తొలగించి సామాన్యత సాధించవలె. అప్పుడు నిజమైన అఖండ హిందూస్థాన మేర్పడి దానివల్ల మనకు నిశ్రేయసము కల్గును.

వారికివ్వబడే ఆహారమంతయు ఎక్కువ పుష్టికరముగా చెయ్యండి!





ప్రతి గృహిణి ఏ ఆహారపదార్థములు శక్తి నిచ్చునవో తెలిసి కొనవలెను. డాల్డా పాకశాస్త్రమను పుస్తకము (ఇంగ్లీషులో అచ్చు వేయబడినది.) 150 ఇండియన్ వివిధ తినుబండారములు తయారుచేయు పద్ధతులతో కూడినది. మిక్కిలి వుపయోగకరమైన విషయములు గలవు. 4 అణాల టిక్కెట్లు Dept. E110 P.O. Box 353, Bombay, పంపుడు.

మీ పిల్లల ఆహార విషయమై ఆలోచించునప్పుడు అది మిక్కిలి బలము నిచ్చునట్లుచేయుట ఎంత అవసరమో గమనించండి. సామాన్యంగా పిల్లలు ఎంత తింటూ వున్నప్పటికి నీరసంగా, వుసూరు మంటూ వుండుట సంభవించు చుండుటచేత, ఆహార పదార్థములు బలము నిచ్చుటలో అనేక విధములుగా వున్నవనే విషయంకూడా జ్ఞాపక ముంచుకోవాలి. ప్రతి ఆహారము కూడా విటమిన్లతోనిండిన డాల్డాతో వండిన యెడల మిక్కిలి పుష్టికరముగా వుండు నన్న విషయంకూడా గమనించ వలసియున్నది. బలము నిచ్చుటలో శ్రేష్టమైనటు వంటిన్ని, ప్రకృతి సిద్ధమై నటువంటిన్ని ఆహార పదార్థములు కలిగి యుండుటచే, ఆహారమును డాల్డాతోవండిన యెడల పిల్లలు నీరసంగాను, బలహీనముగాను వుంటారనే భయమక్కరలేదు. డాల్డా ఆహారమును మంచి రుచికరముగా చేయును — శాకములతో కూడినది.

విటమిన్లతోనిండిన డాల్డా బలమునకు

కలగూరగంప

'శాకుంతల విమర్శనము - నిర్మాణన శిల్పము'

గత మాసపు భారతిలో శ్రీ నందూరి బంగారయ్య గారు 'శాకుంతలవిమర్శనము, నిర్మాణశిల్పము' అని ఒక మంచి గంభీరమైన వ్యాసము వ్రాసియున్నారు. ఎంతో పరిశోధించినమీద ఆర్షదృష్టి లభింప తత్ఫలితముగ వెలివడ గల వ్యాసముకాని సాధారణపు పైపై చూపులకు గోచరమయ్యేది కాదు. ఇంతవరకూ తెలుగులో శాకుంతలముపై వెలువడిన విమర్శనాపూర్వకమైన వ్యాసములలో సమగ్రమైనది కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావుగారు విజ్ఞానసర్వస్వములో వ్రాసిన వ్యాసమే. తక్కినవి పాక్షికములే. అవయినా లెక్కకు వకటీ రెండే. బంగారయ్యగారు ఇప్పుడు వ్రాసిన వ్యాసము వేరొకరీతి సమగ్రమైనది అవడమేకాకుండా ఆర్షదృష్టినీ, పరిశోధకశక్తినీ వెల్లడించేది. పాలను మథించితీసే వెన్నవంటిది.

ఈ వ్యాసమునందలి 'అంకనిర్మాణము' అనే భాగంలో ప్రత్యేక అంకముయొక్క ఘటనాశిల్పనైపుణ్యమునుగూర్చి వ్రాస్తూ సంప్రదాయసిద్ధముగా చతుర్థాంకమునకు అన్నింటికంటే ఎక్కువ ప్రాధాన్యత వున్నదనీ, కాని తమ దృష్టిలో ప్రథమపంచమాంకములలో కాళిదాసు ఎక్కువ ప్రావీణ్యమును చూపించినాడనీ వ్రాస్తూ ప్రథమపంచమాంకములందలి రచనాచాతుర్యమునకు గల కారణములనూ, చతుర్థాంకము సంప్రదాయపరంపరగా వస్తూన్న అభిప్రాయానికి భిన్నంగా కొరతపడియుండుటకు గల కారణములనూ గనుపరచి కాళిదాసీయంకమునందలి ముఖ్యాంశపాంశములను సంధించడంలో తొందరపడి కొన్నిఘటనలను గుచ్చి త్తినాడని వ్రాసియున్నారు. ఇక్కడ నాకు తోచిన అభిప్రాయమును వ్రాస్తున్నాను. దీనిని చూచి మరివక పర్యాయం చతుర్థాంకమును పరిశీలించవలెనని నా ప్రార్థన.

"ఈసన్ని వేశమును సావధానముగనే చిత్రించినాడుగాని శకుంతలను వివాహమాడి.........నడుమ కొంత యవకాశం కావలసియున్నది. లేకున్న నాటకీయవిభ్రాంతి కృతార్థము కాజాలదు" అనే భాగాన్ని చూడండి.

గాంధర్వ విధిని వివాహమాడి రాజు వెడలిపోయిన తరువాత ఎంతోకాలము గడచినప్పటికీ అతని వద్దనుంచి సమాచారమే లేనందున శకుంతల చింతానిమగ్నయై చెక్కిలిపై చేయుంచి కూర్చునివున్న సమయంలో దుర్వాసమునివచ్చి శాపమిచ్చినట్లు అభిప్రాయపడ్డారు బంగారయ్యగారు. కాని రాజు వెడలిపోయిన వెనువెంటనే తదేకమానసంతో ఆయనతో అనుభవించిన భోగవిలాసము లన్నింటినీ స్మరించుకొంటూ మైమరచి కూర్చొనివున్న సమయంలో దుర్వాసశ్శాపం తగిలింది. అందుచేత వెంటనే దుష్యంతు డీమెను మరచిపోవడం సంభవించింది. షష్ఠాంకములో "ఏకైకమత్రదివసే దివసే మదీయం నామాక్షరం గణయ గచ్ఛతి యావదంతం, తావత్ప్రియే మదవరోధగృహప్రవేశం నేతా జనస్తవ సమీపముపైష్యతీతి. తచ్చ దారుణాత్మనా మయా మోహాన్నానుష్ఠితమ్" అని విదూషకునితో అంగుళీయకదానవివరణమును వివరించే సందర్భంలో దుష్యంతు డంటాడు. మూడునాళ్ల లోపలనే — ఇంకా పట్నం చేరే లోపలనే — శాపంతగిలింది. కాబట్టే రాజామెను మరచిపోయినాడు. అన్యథా ధర్మాత్ముడైన మథిష్ఠించివున్న అతనివంటి సత్య

సంధునికి తద్వ్యతిరేకగుణాలను ఆరోపించవలసి వస్తుంది. అందువల్ల ఉత్తమ నాయకలక్షణానికి అపకర్షత పట్టుకొంటుంది. వ్యాసమునందంతటనూ దుష్యంతున కిచ్చిన పదవికి లోటు కలుగుతుంది. రాజుదగ్గిరనుంచి, కొన్ని నెలలు గడచినప్పటికీ వార్త లేమీ లేనందున గలిగిన మైమరపుకాదిది. ఆయన వెడలిపోయిన వెంటనే ఇంకనూ స్మృతిపథమునుండి దూరంగాక నవనవోన్మేషములై పొంగి వస్తున్న క్రీడావిలాసము లన్నింటినీ స్మరించుకొంటూ వున్నపుడు కలిగిన మైమరపిది. మరియు చతుర్థాంకంలోని మొట్టమొదటి విష్కంభంలో అనసూయా ప్రియంవదలిద్దరూ ప్రవేశించి మాట్లాడుకొనే సందర్భంలో రాజప్పుడే వెడలిపోయినట్లుద్యోతమవుతుంది. అప్పుడే దుర్వాసశ్శాపం కలుగుతుంది. అంటే రాజు దిన పూర్వభాగంలో వెడలిపోయివుంటే అపర భాగావసానసమయంలో శాపం కలిగివుండవచ్చు. చాలాదినాలు గడవటానికి వీల్లేదు— మూడునాళ్ల లోపలనే తనవాళ్లను పంపిస్తానని గడువుపెట్టినందువల్ల. కణ్వుడు సోమతీర్థాన్నుంచి వచ్చిన తరువాత - అనగా అప్పటికి నాలుగునెలలయినా గడచివుంటాయి- "కథమిమాం అభివ్యక్తసత్వ లక్షణాం" అని పంచమాంకంలో రాజు అని వుండటంచేత—అనసూయ మళ్లా రంగంమీదికివచ్చి విచారిస్తుంది: ఇన్నాళ్లయినా రాజు దగ్గిరనుంచి అతీగతీలేదనీ; "అథవాదుర్వాస సఃకోపఏషవికారయతి" అనీ. అంటే అంతకు పూర్వమే ఎప్పుడో శాపం తగిలింది. మరియూ సప్తమాంకంలో మారీచాశ్రమంలో శకుంతలా దుష్యంతులు కలిసికొన్న పిదప తానామెను మరవడానికి హేతువేమిటన్నిరాజు మారీచునడుగగా ఆయన ఎప్పుడయితే శకుంతలను ఇక్కడికి తెచ్చారో అప్పుడే యోగదృష్టివల్ల అంతా తెలుసుకొన్నాననీ, అందుకు దుర్వాసశ్శాపమే కారణంగాని నీతప్పేమీలేదనీ ఓదారుస్తూ "దుర్వాసశ్శాపాదియం తపస్వినీ సహధర్మచారిణీ త్వయాప్రత్యాదిష్టానాన్యథా" అని అంటాడు. అందువల్ల రాజుపెట్టిన గడువు మూడునాళ్లలోపలనే శాపం కలిగింది. అన్యథా రాజుకు అబద్ధికుడనేదోషం ఆరోపించాలి. కణ్వుడు ఆశ్రమానికి తిరిగివచ్చి అశరీరవాణివల్ల సమస్తమూ గుర్తెరిగి వెంటనే ఆమెను పతిదగ్గరకు పంపిస్తాడు. ఆలస్యంచేస్తే మళ్లీ వుంగరం ఎక్కడ బయలుపడుతుందో! ఇందులోనూ కాళిదాసు యొక్క ఘటనాసంవిధాన నైపుణ్యమే కనబడుతుంది. బంగారయ్యగారి తక్కిన వ్యాసమంతా బంగారమే.

వే. సు.

జాతిపశువులకోసమై అమెరికాలో జాతిసాంకర్య ప్రక్రియలు

అమెరికా సంయుక్తరాష్ట్రాలయందంతటా ఇటీవల కొద్ది సంవత్సరాలుగా వ్యవసాయశాఖవారు పెంపుడు పశుగణంలో ఉత్తమజాతులను కల్పించడానికై విజాతిసమ్మేళనసంప్రదాయాన్ని విశేషంగా అమలు జరుపుతున్నారు. ఇందుకోసమై దేశదేశాలకూ మనుష్యులను పంపి ఉత్తమజాతి పశువులను దిగుమతి చేసుకొంటూకూడా వున్నారు. దినదినానికీ దిగనారి పోతూవున్న తమ పశుజాతిని ఉత్తమజాతికిచేరిన ఇతర పశువులచేత దాటింపించి, తద్ద్వారా వాటిని ఉద్ధరించి బాగుపరచడమూ, సర్వంతానసౌభాగ్యసిద్ధి పొందించడమూ వారి ఉద్దేశ్యం.

ఇంతముమ్మరంగా యుద్ధంసాగుతూ, రవానా రాకపోకలకు ఎంతెంతో రాద్ధాంతాలు జరుగుతూ వున్నాకూడా అమెరికావారు గత సంవత్సరం ఇలా దిగుమతిచేసుకొన్న జంతువులసంఖ్య ఆ నిరుటి సంవత్సరం సంఖ్యకు నూటికి ౧౧ చొప్పున మించిపోయింది. నిరుడు దాదాపు ౨౨౦౦౦ జంతువులు అక్కడికి చేరాయట.


ఈ సంక్రమణవిధానంలో భారతదేశంనుంచి దిగుమతి అయిన పశువులు అతి ప్రాముఖ్యాన్ని గణించినవి. ౧౯౩౧ లో ఆఫ్రికానుంచి దిగుమతి అయినవికూడా దక్షిణ, ఆగ్నేయకోస్తాప్రాంతాల్లోని సంక్రమణ విధానానికి ఎంతో తోడ్పడినవి.

ప్రప్రథమంలో అబర్డీన్ ఆంగస్, హెరిఫోర్డు, షార్టుహారన్ అనే కొన్ని తెగలకు జంతువులు — అసలు బ్రిటనుజాతికి చెందినవి — అమెరికాలోని పశుసంపదభివృద్ధిసంస్థానాల్లో చక్కగా అమరిపోయాయి. కాని, దూరదక్షిణ, ఆగ్నేయప్రాంతుల శీతోష్ణస్థితి వాటికి సరిపడక, అక్కడ వాటికి బొత్తిగా పొసగిందికాదు. ఉష్ణప్రాంత-సమశీతోష్ణప్రాంత జంతువుల రక్తసంపర్కంవల్ల ఈసమస్య ఇట్టే తీర్చివేసుకోవచ్చునని పరిశోధనలు చేసినమీదట వారికి తెలివిడి అయింది.

పైన చెప్పిన బ్రిటిషుజాతి పశువులు పింధుశాఖ శీతోష్ణస్థితి సరిపడక, గిడసబారిపోయి, ఈగ దోమకాటులకు తెగుళ్లు తగిలి నశించిపోవడం ప్రారంభమయ్యేసరికి అమెరికాపశుపరిశ్రమ సంస్థానాలవారికి భారతపశురక్తసంపర్కమేమన్నా పనికివస్తుందేమో అనే యోచన పోయింది. ఇంతలోనే దేవుడిదయవల్ల వారిలో ఒకరికి ఒక భారతదేశపు ఆబోతు కానుకగా రావడం తటస్థించింది. దానితో అక్కడి మందలను దాటించారు. ఇంకేముంది? కొన్నాళ్లకల్లా అక్కడి పశుగణం నవనవలాడుతూ నీటునిగ్గులతో వికసింపజొచ్చాయి. ఈ మారుజాతి సంతానంలోని దూడలు అక్కడి శీతోష్ణస్థితికి బాగా తాళుకోగలిగాయి; ఆవులు కుండలకు కుండలపాలు కుమ్మరింపజొచ్చాయి.

ఆ కొత్తజాతి దోమలూ, ఈగలకాటుల తెగుళ్లకు ఈషత్తయినా చలించలేదు.

అయితే, క్రమేపీ ఈజాతిలో పోలికలు మారి



భారతీయ ఖ్యాతిని నిలబెట్టిన 'జేబూ' జాతి ఆంబోతు.

పోతూవచ్చాయి. ఉండరాని లక్షణాలుకూడా కొన్ని వీటికి ఉత్పన్నమవుతూవచ్చాయి. రంగులు వదరుగా వుండడవంటున వేరగాళ్లకు వీటిమీద మోజు తగ్గిపోయింది. కాని, పశుసంస్థానాధికారుల కృషి ఫలితంగా ఇంకొకజాతి జంతువు రక్తసంపర్కంతో అసలైన ఎరుపురంగుజాతి ఉద్భవించింది. ఆజాతి సర్వవిధాలా ఆహ్లాదంగా కనిపించింది. ఈజాతికి అసాధారణమైన ఆ కొత్త ఆబోతులకు అమెరికావారు పెట్టినపేరు 'జేబూ'లు.

దరిమిలాను ఇలాటి జేబూలు వారికే అమితంగా కావలసివచ్చాయి. కాని, దురదృష్టవశాత్తు ప్రబలమైన పశువుల తెగుళ్లు పట్టుకోవడంతో అవి ఆదేశానికి వెళ్లడానికి అనుమతి లభించలేదు. ఈ అదనులో అమెరికా వ్యవసాయశాఖవారికి ఆఫ్రికాపశువులు దృష్టికి తగిలాయి. అవన్నీ అన్నిలక్షణాల్లోనూ భారతీయపశుజాతిని అచ్చంగా పోలియున్నట్టు వారు కనిపెట్టారు. అంతతో వారు వాటి పైన పడ్డారు. అక్కడనుంచి దిగుమతి ప్రారంభమయింది. వాటి తీరూ పోకల్లతో వారు అనుభవపూర్వకంగా ఆహ్లాదించారు.

ఈ భారత - ఆఫ్రికా జాతి సంతతికి చెందిన ఎద్దులు నిండైన విగ్రహాలతో కండలు దేరి ఒక్కొక్కటీ సుమారు ౨,౨౦౦ పౌనులు తూగుతుందట. ఆవులైతే ౧౫౦౦ పౌనులట. ఎలాటి శీతోష్ణస్థితికైనా ఈ పశువులు బాగా నిభాయించుకొంటాయట. ఎటువంటి తెగుళ్లకూ సులభంగా పాల్పడవట.

ఈ జాతిసాంకర్యంమూలంగా ఆ దేశంలో ఆహారోత్పత్తి అధికమయిందట. ప్రపంచంలోని వివిధ దేశాల పరస్పర సహకారంవల్ల ఎట్టి ప్రయోజనాన్నయినా సాధించవచ్చుననుటకు ఇదొక తార్కాణం.